సంపుటి: 78 సంచిక: 38 పుటలు: 52

జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ నిజ జ్యేష్ఠ బహుళ షష్ఠి
06-12 జూలై 2026
వెల: ₹20/-



మినీ ప్రళయం.. సూపర్ ఎల్‌నినో..!

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా https://payit.cc/SYBqNRG267 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

'మనందరికి పుణ్యభూమి కందకుర్తి'

డాక్టర్జీ పూర్వికుల గ్రామం కందకుర్తి మనందరికీ పుణ్యభూమి. ఆయనకు పుట్టుకతోనే దేశభక్తి అబ్బింది. అది ఆయన జీవితంలో వయసుతో పాటు పెరుగుతూ వచ్చింది అని అఖిల భారతీయ కార్యకారిణి సభ్యులు భయ్యాజీ అన్నారు. జూన్ 25న కందకుర్తిలో శ్రీ కేశవ స్మృతిమందిర్‌ను భయ్యాజీ సందర్శించారు. ఆర్ట్ గాలరీని తిలకించారు. స్మృతి మందిర్‌లో ఏర్పాటు చేసిన డాక్టర్జీ జీవిత చరిత్రను తెలిపే ఆర్ట్ గాలరీని ప్రారంభించారు. భయ్యాజీతోపాటు డాక్టర్జీ జీవిత చరిత్రను అధ్యయనం చేసిన ప్రముఖ చరిత్రకారుడు శ్రీరంగ గోడ్‌బోలె (పూణే) పాల్గొన్నారు. డాక్టర్జీస్మృతి కేంద్రం ప్రపంచ వ్యాప్తంగా దేశభక్తులందరికి స్మృతి నింపుతుందని, రానున్న రోజులలో ఇది గొప్ప శ్రద్ధా కేంద్రంగా మారనున్నదని డాక్టర్జీ జీవితంపై ఆడియో విజువల్ థియేటర్ ప్రారంభోత్సవంలో భయ్యాజీ తెలిపారు.

"వైద్య విద్య కోసం ముంబై వెళ్లవచ్చు. కాని కలకత్తా (నేటి కోల్‌కతా) వెళ్లారు. దేశంలో జరుగుతున్న సంఘటనలకు కలకత్తా కేంద్ర బిందువుగా ఉందనే అవగాహన డాక్టర్జీకి ఉంది కనుక అక్కడికి వెళ్లారు. 'మీ కుటుంబం పౌరోహిత్యం చేసే కుటుంబం, కాని మీరు ఆలయానికి ఎక్కువగా ఎందుకువెళ్లర'ని ఎవరో డాక్టర్జీని అడిగారు. ఆలయానికి ఎక్కువ వెళ్లరని కాదు, కానీ పూజ, కర్మకాండలు వంటివి ఆయనకు అలవాటు లేదు. మరొక సందర్భంలో వైద్య విద్యను అభ్యసించినా ఆసుపత్రి తెరవలేదేం అని ఎవరో అడిగినపుడు, ఈ శరీరంతో తన కోసం ఏమీ చేసుకోకూడదని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. వివాహం చేసుకోకూడదు, డబ్బు సంపాదించకూడదు. పుణ్యం కోసం పూజాదికాలు చేయకూడదు అన్నది తన సంకల్పం అన్నారు. అందుకే ఆయనను జ్ఞాపకం చేసుకుంటే శక్తి లభిస్తుంది, ప్రేరణ దొరుకుతుంది. ఆయన జీవితంలో ఏమి ఉన్నా అది మాతృభూమి కోసం మాత్రమే. మాతృభూమిని ఉన్నత స్థానానికి తీసుకువెళ్లాలన్నది ఆయన స్వప్నం. చాలాసార్లు వ్యక్తులు కలలు కంటుంటారు, కానీ వాటిని మరొకరు సాకారం చేయాలనుకుంటారు. అయితే డాక్టర్జీ అది తన పనే అని చేసి చూపించారు. వేరెవరో చేయాలని కోరుకోలేదు. అటువంటి ఉన్నతమైన, శ్రేష్టమైన జీవితం వారిది. ఆయన మనసులో మాతృభూమి తప్ప మరొక ఆలోచన లేశమాత్రం కూడా లేదు. అందుకే ఆయన గురించి ధ్యేయాన్ని ధరించి వచ్చిన రూపమే డాక్టర్జీ' అని అంటుంటారు. కేరళలో ఒక సీనియర్ ప్రచారక్ కళ్యాణాశ్రమం పని చూసేవారు. ఆయన మరణించినప్పుడు మృతదేహాన్ని అంతిమ దర్శనం కోసం ఉంచారు. చాలామంది వస్తున్నారు. ఆయన భౌతికకాయం పెట్టినచోట దిగువన రాశారు – 'మేం ఎప్పుడూ డాక్టర్ హెడ్గేవార్‌ను చూడలేదు. మీరే మాకు డాక్టర్ హెడ్గేవార్' అని. ఇటువంటి తేజోవంతమైన కిరణం డాక్టర్జీ ఆలోచనలను తీసుకొని దేశం నలుమూలకు వెళ్లింది. డాక్టర్జీని తీసుకొని వెళ్లలేదు, ఆయన ఆలోచనలను, పనిని తీసుకుని వెళ్లింది. ఆయనను జ్ఞాపకం చేసుకుని, ఇక్కడి (కందకుర్తి) నుంచి వెళ్లే ప్రతి వ్యక్తి ఆయన భావాలను మనసులో నింపుకొని వెళ్లాలి. ఇది పిక్నిక్ స్పాట్ కాదు. పర్యాటకులు తిరుగుతూ, తిరుగుతూ ఆయన సొంత ఊరు కూడా మధ్యలో వచ్చింది చూసొచ్చాం అని అనుకోకూడదు. ఈ కేంద్రాన్ని చూసేందుకు వేలాదిమంది వచ్చారు, వస్తారు. ఆయన జీవితంతో ప్రభావితమైన వేలాదిమంది ఉన్నారు. ఈ స్మృతికేంద్రంలో ఆయన అందమైన చిత్రాలు తయారు చేశారు. డాక్టర్జీజీవితాన్ని అధ్యయనం చేయాలనుకున్నవారికి లోతైన అవగాహన అవసరం. కానీ, మిగిలినవారికి భావ జాగరణం కావాలి. డాక్టర్జీ జన్మశతాబ్ది సంవత్సరంలో (స్వర్ణీయ) మోరోపంత్ పింగళే ఈ కార్యానికి శుభారంభం చేశారు. వారి కలలనునిజం చేస్తూ.. ఈ సంఘ శతాబ్ది సంవత్సరంలో, పూర్తి స్థాయిలో, డాక్టర్జీ స్మృతికేంద్రం రూపుదిద్దుకోవడం ఆనందదాయకం. ఇది మంచి ప్రదర్శన మాత్రమే కాదు, ప్రేరణ ఇచ్చేది. ఇక్కడకు వచ్చిన తర్వాత కలిగిన భావనకు ప్రాధాన్యత ఉంది తప్ప ఇతర విషయాలకు కాదు" అని భయ్యాజీ కార్యకర్తలకు మార్గదర్శనం చేశారు.

అరుదైన తాబేళ్లతో ప్రధాని మోదీ

సీషెల్స్‌లో మూడు రోజుల పర్యటనలో భాగంగా జూన్ 27న సీషెల్స్ నేషనల్ బొటానికల్ గార్డెన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించారు. ఈ సందర్భంగా అరుదైన, అత్యధిక వయస్సు ఉన్న ఉభయచర జీవిగా పేరు ఉన్న అల్‌దాబ్రా జెయింట్ తాబేళ్లకు ఆహారాన్ని అందించారు. అనంతరం ఎక్స్‌లో చేసిన పోస్టులో "అధ్యక్షుడు డాక్టర్ పాట్రిక్ హెర్మినితో కలిసి సీషెల్స్ నేషనల్ బొటానికల్ గార్డెన్‌లో భారీ తాబేళ్ల ఆవరణను సందర్శించాను. సీషెల్స్‌కు స్థానికమైన అల్‌దాబ్రా జెయింట్ తాబేలు భూమిపై ఉన్న అతిపెద్ద, అత్యంత ఎక్కువ కాలం జీవించే జాతులలో ఒకటిగా నిలిచింది. వాటిలో కొన్ని రెండు శతాబ్దాలకు పైగా చరిత్రను కలిగి ఉన్నాయి. 2014లో వాటిలో రెండింటిని కోల్‌కతాలోని అలీపూర్ జూకు బహుమతిగా ఇచ్చారు. కొన్నేళ్ల తర్వాత సీషెల్స్ మరికొన్ని తాబేళ్లను హైదరాబాద్ జూకు బహుమతిగా ఇచ్చింది" అని ప్రధాని పేర్కొన్నారు. తద్వారా భారత్, సీషెల్స్ మధ్య ప్రత్యేకమైన స్నేహ బాంధవ్యానికి ఈ తాబేళ్లు ఊతమిచ్చాయాని తెలిపారు. ఇదే సందర్భంగా సీషెల్స్ అధ్యక్షుడితో కలిసి గార్డెన్‌లో మోదీ కలియదిరిగారు. ఇద్దరూ కాసేపు ముచ్చటించుకున్నారు. గార్డెన్ ప్రత్యేకతలను గురించి అక్కడి సిబ్బందిని భారత ప్రధాని అడిగి తెలుసుకున్నారు.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Managing Editor : Kurra Durga Reddy.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు,
వ్యాపార ప్రకటనల వివరాల కోసం
(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

ఎం. శ్రీనివాస్ : సర్క్యులేషన్ ఇన్‌చార్జ్
040-27561453 / 9959997013

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం
9959991304
(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

డిజైనర్ : చిగుళ్ల కుమార్

చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 **సంవత్సర చందా రూ.850**

జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు: **రూ.1,474 (850+624)**

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

- సర్క్యులేషన్ ఇన్‌చార్జ్, జాగృతి

ప్రపంచంలో అనేకమంది మేధావుల, జిజ్ఞాసువుల జ్ఞానతృష్ణను ఏడు శతాబ్దాల పాటు తీర్చిన నలంద విశ్వవిద్యాలయంలో విద్యా సముపార్జనకు నాటి మేధావులు తహతహలాడేవారు. యూరప్‌లోని ప్రాచీన బోలోగ్నా యూనివర్సిటీ, ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీల కంటే 500 ఏళ్ల ముందే నలంద విశ్వవిద్యాలయం ప్రపంచానికి మేధో సంపత్తిని పంచిపెట్టింది. అంతటి మహా విద్యాలయం మతోన్మాద మూర్ఖతకు దహనమై విద్యార్థులకు వేదనను మిగిల్చింది. దాదాపు శతాబ్దాల అనంతరం దాని పునరుద్ధరణపై ప్రభుత్వం దృష్టిపెట్టడం అత్యంత హర్షణీయం, స్వాగతించవలసిన విషయం.

ప్రధాని మోదీ 135వ 'మన్ కీ బాత్' లో అనేక విషయాలపై అభిప్రాయాలు వెల్లడిస్తూ 'నలంద విశ్వవిద్యాలయ' పునరుద్ధరణ అంశాన్ని ప్రస్తావించడంతో దేశవ్యాప్తంగా మరోసారి నలందపై కొత్త ఆసక్తి మొదలైంది. రెండేళ్ల క్రితం నలంద ప్రాంగణాన్ని ప్రారంభించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు ప్రధాని మోదీ. నలంద విశ్వవిద్యాలయం మూడవ స్నాతకోత్సవం సందర్భంగా మే,17,18 తేదీల్లో 'శాస్త్రోత్థ -2026' పేరిట మేధోమథనం జరిగింది. "శాస్త్రోత్థ సంప్రదాయం: చరిత్ర, ఆచరణ-సమకాలీన ప్రాసంగికత" అనే అంశంపై నిపుణులతో వినూత్న పద్ధతిలో చర్చా కార్యక్రమం జరిగింది. భారతదేశ జ్ఞాన సంప్రదాయంలోని వివిధ వైఖరులు, దృక్పథాలకు చెందిన పండితులు ఈ చర్చలో పాల్గొన్నారు. ఆధునిక సాంకేతికతకు మన ప్రాచీన మేధో మూలాలను అన్వయించడం అత్యవసరమని ప్రధాని అభిప్రాయ పడడం ముదావహం.

సాధారణ శకం 427లో గుప్త సామ్రాజ్య చక్రవర్తి తొలి కుమార గుప్తుడు స్థాపించిన నలంద విశ్వవిద్యాలయం ప్రపంచంలోనే తొలి రెసిడెన్షియల్ యూనివర్సిటి. మధ్యయుగాలనాటి ముఖ్యమైన విశ్వవిద్యాలయాలలో ఒకటైన నలందలో రత్నసాగర, రత్నోదధి, రత్నరంజక అనే మూడు భవనాలతో ఉండే గ్రంథాలయాల్లో కోటికి పైగా పుస్తకాలు ఉండేవని.. తూర్పుఆసియా, మధ్యఆసియా ప్రాంతాల నుంచి అప్పట్లోనే 10 వేలమందికి పైగా విద్యార్థులు ఇక్కడికి వచ్చి చదువుకునేవారని చరిత్ర చెప్తోంది.

శాలివాహన 1948 శ్రీ పరాభవ నిజ జ్యేష్ఠ బహుళ షష్ఠి

లోపలి పేజీలలో...



6లో

ముఖపత్ర కథనం

మినీ ప్రళయం..
సూపర్ ఎల్‌నినో..!

ధారావాహిక నవల

43 గణపతిదేవుడు

- మత్తి భానుమూర్తి

20లో

ప్రత్యేక వ్యాసం

సవాళ్లు, సంస్కరణల మధ్య 'ప్రపంచ జనాభా దినోత్సవం'

26లో

జాగృతి

సంపాదకీయం

మాల్వా పీఠభూమికి ఉత్తర దిక్కున ఉన్న రాజగిరి జిల్లా కుండపోత వర్షాలకు, ఆకస్మిక వరదలకూ నెలవు. కుమార గుప్తుడు పధ్నాలుగు వర్షాకాలాలు రాజగిరి ప్రాంతంలో గడిపి, నలందను నిర్మించాడని పురావస్తు శాస్త్రజ్ఞుడు అమలానంద ఘోష్ తమ 'నలంద' గ్రంథంలో అంటారు. నలంద విశ్వవిద్యాలయంలోని పుస్తక భాండాగారం అంతటిది ప్రపంచంలో ఇంకెక్కడా ఉండేది కాదు.

నలంద విశ్వవిద్యాలయంలోని మూడు గ్రంథాలయ భవనాలలో ఒకదాని గురించి టిబెట్ బౌద్ధ మేధావి తారానాథ్ వర్ణిస్తూ మేఘాలలో ఉండే 9 అంతస్తుల భవనమని అభివర్ణించారు. శిఖరాలను అధిరోహించడం, గహనాటవులను

భారత్ పునరుత్థాన దిశగా నలందా

జయించడం, ప్రహేళికలను పరిష్కరించడమే కాదు..సమస్త జీవనరంగాలను వ్యాఖ్యానించగల శాస్త్ర ప్రమాణాలను రూపొందించిన ఘనత ప్రాచీన నలంద విశ్వవిద్యాలయానికే దక్కుతుంది. అధ్యయనం, పరిశోధనలు నైపుణ్యంగా, ప్రాచీనతలోకి తొంగిచూసేందుకు అవశ్యమైన సామర్థ్యంగా తీర్చిదిద్దేందుకు 'శాస్త్రార్థ' సంప్రదాయాన్ని నెలకొల్పింది.

నలందలో నాగార్జునుడు, వసుబంధు, శాంతరక్షిత, కమలాశీల వంటి గొప్ప పండితులు మధ్యయుగ శాస్త్రీయ పద్ధతి అభివృద్ధికి దారితీసిన మాండలిక తార్కిక పద్ధతి (Dialectical reasoning method)ని అభివృద్ధి చేయడంలో దోహదపడ్డారు. ఈ విధానం మధ్య ఆసియాకు, చివరికి అరబ్ ప్రపంచం, యూరప్ దేశాలకు వ్యాపించి, ప్రపంచంలోని అనేక దేశాలను ప్రభావితం చేసింది.

సాధారణశకం 5వ శతాబ్దంలో మిహిర్కుల ఆధ్వర్యంలో హూణులు నలంద విద్యా కేంద్రంపై దాడి చేశారు. సాధారణ శకం చిట్టచివర (1193) ప్రాంతంలో దురాక్రమణదారుడైన భక్తియార్ ఖిల్జీ నేతృత్వంలోని దోపిడీ దళాలు ఉత్తర, తూర్పు భారతదేశంపై దండయాత్ర చేసినప్పుడు నలంద జ్ఞాన భాండాగారం ధ్వంసమై పోయింది. ఇస్లాం మతానికి నలంద విశ్వవిద్యాలయం పోటీగా మారుతుందని భావించిన ఖిల్జీ నలందను నాశనం చేశాడని చరిత్ర చెపుతోంది.

ఖిల్జీ దళాలు పెట్టిన మంటల్లో విశ్వవిద్యాలయం మూడు నెలల పాటు దహనమైందంటారు చరిత్రకారులు. దీనినిబట్టి ఆ విశ్వవిద్యాలయ ప్రాంగణం వైశాల్యం ఎంతో, నిర్మాణ పటిష్ఠత ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. భారతదేశంలోని ప్రముఖ పురావస్తు శాస్త్రవేత్తల్లో ఒకరైన హెచ్‌డీ సంకాలియా 1934లో ప్రచురించిన తన 'ది యూనివర్సిటీ ఆఫ్ నలంద' పుస్తకంలో భారీ కోట తరహా నిర్మాణం, అక్కడున్న సంపద గురించి, అప్పటికే జరిగిన ప్రచారం ఖిల్జీ ముఠాను దాడికి పురికొల్పి ఉండొచ్చని రాశారు.

నలంద పునరుద్ధరణ కోసం భారత పార్లమెంటు 2010లో ఒక చట్టాన్ని ఆమోదించి నప్పటికీ ఆ తరువాత పునరుద్ధరణ పనులు నత్తనడకన సాగాయి. ఎన్‌డీఏ ప్రభుత్వం 2014లో నలంద విశ్వవిద్యాలయాన్ని పునఃప్రారంభించింది. రెండేళ్ల క్రితం ప్రాంగణాన్ని ప్రారంభించారు. సరికొత్త నలందను 'జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థ'గా గుర్తించడం మనందరం గర్వించదగ్గ విషయం. 2016లో నలందా శిథిలాలను ప్రపంచ వారసత్వ స్థలం (సంపద) గా యునెస్కో ప్రకటించింది.

నలంద భారతదేశ విద్యా వైభవానికి, ఆసియా సాంస్కృతిక ఐక్యతకు ప్రతీక మాత్రమే కాదు ప్రపంచ చరిత్రలో విద్యాదానం చేసిన మహా విద్యాలయమని కూడా చెప్పుకోవాలి. నలంద పునరుజ్జీవనం భారతదేశానికి తలమానికం కాగలదని ఆశిద్దాం. ★



కథ

హరిదాసు మామయ్య

- బమ్మిడి దేవీప్రసాద్

'సంకల్ప పత్ర' దిశగా పశ్చిమ బెంగాల్ బడ్జెట్ (జాతీయం)	-	12
జొన్నగిరితో 'సీమ'లో సువర్ణాధ్యాయం (ఆంధ్రప్రదేశ్)	-	14
వర్ష బీభత్సంలో భాగ్యనగరం (తెలంగాణ)	-	16
చరిత్ర పొడవునా.. మరణమృదంగం (అరాచకం)	-	18
స్టార్మర్ రాజీనామా: యు.కె. కొత్త ప్రధాని.. (అంతర్జాతీయం)	-	24
అమ్మ నవ్వింది - గౌతమ్ లింగా (కథ)	-	28
పాదాభివందనం... పరమార్థం! (ఆదర్శం)	-	32
వర్షం ప్రకృతి అంత ప్రాచీనం.. (గళమెత్తిన గతం)	-	34
కర్తవ్యనిర్వహణలో ఆదర్శమూర్తులు (ఆర్ఎస్ఎస్-100)	-	36
వికెట్ల రాణి..శ్రీచరణి! (క్రీడ)	-	43
శివపథానికి జ్యోతిర్లింగాలు (ఆధ్యాత్మికం)	-	45
ప్రథమార్థంలో పరేషాన్! (సినిమా)	-	50

మినీ ప్రళయం..

ఎల్‌నినో ఒక ప్రకృతి విపత్తు. ప్రకృతి మానవాళిపై కరుణించి జీవనాన్ని ఎలా సుఖమయం చేస్తుందో అలాగే విపత్తులను కూడా సృష్టించి మానవ జీవితాన్ని దుర్భరం కూడా చేస్తుంది. అయితే విపత్తులకు మానవ తప్పిదాలు కూడా ఒకవిధంగా కారణమవచ్చు. మానవాళి వాడుతున్న శిలాజ ఇంధనాలు, తద్వారా విడుదలవుతున్న కర్బన, ఇతర వాయు ఉద్గారాల ద్వారా భూమి వాతావరణం వేడెక్కుతుంది. సముద్ర జలాల అంతర్భాగం, ఉపరితల జలాలు వేడెక్కి సముద్రాల పైనుంచి వేడివాయువులు వీస్తాయి. వీటినే ఎల్‌నినోలు అంటారు. మనం ఎల్‌నినోలను రాకుండా ఆపలేము. కానీ, వాటి నుంచి ఉత్పన్నమయ్యే ప్రతికూల వాతావరణ పరిస్థితులనుండి మనల్ని మనం కాపాడుకోగలం. దానికి మంచి ప్రణాళిక, ఆచరణ, అందరి భాగస్వామ్యం కావాలి. ఎల్‌నినో ఒక వాతావరణ అననుకూల ప్రక్రియ. భూమధ్య రేఖ ప్రాంతంలో సముద్ర ఉపరితల జలాలు సాధారణం కన్నా ఎక్కువగా వేడెక్కడాన్ని ఎల్‌నినో అంటారు. సాధారణంగా సమతుల్యంగా ఉండే వాతావరణం కొన్ని ప్రత్యేక దశలో అధిక వేడిమిని సంతరించుకోవడాన్ని ఎల్‌నినో దశ అంటారు. ఈ పరిస్థితి కొన్ని నెలల వరకు ఉండొచ్చు. పైగా దాని విపరీత ప్రభావం భూమి ఉపరితలం మీద ఎల్‌నినో దశ ముగిసినప్పటికీ మరి కొద్దికాలం కొనసాగే అవకాశం ఉంది. దీనివల్ల సముద్రం ఉపరితల జలాలలో, వాయువులలో ఎక్కువ వేడిమి ఉత్పన్నమవుతుంది.. ఈ వేడిమి ప్రభావానికి చల్లటి రుతుపవనాలు ఎక్కువ దూరం ప్రయాణించలేవు. దీంతో వాతావరణంలో ఎన్నో ప్రతికూల పరిణామాలు చోటుచేసుకుంటాయి.

ఎల్నినోకు కారణమయ్యే సముద్ర ఉపరితల వేడి నీటి ప్రదేశాలను సీ సర్‌ఫేస్ టెంపరేచర్ (SST) హాట్ స్పాట్స్ అంటాము. ఇవి సాధారణంగా మధ్య, పశ్చిమోత్తర పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలోను, ఆగ్నేయ హిందూ మహాసముద్ర ప్రాంతంలోనూ, గల్ఫ్ అఫ్ మెక్సికో, అట్లాంటిక్ సముద్ర ప్రాంతాలలో ఉంటాయి. ఎల్‌నినో సీ సర్‌ఫేస్ ఎయిర్ టెంపరేచర్ హాట్‌స్పాట్స్ (SSA) అంటే ఇవి ఎల్‌నినో కారకమైన సముద్ర ఉపరితల వేడి వాయువులు.ఇవి తూర్పు ఆఫ్రికా, దక్షిణ అమెరికా, సముద్ర తీర ప్రాంతాలలోని ఖండాలలో ఉంటాయి అని శాస్త్రవేత్తలు తమ అధ్యయనాల ద్వారా గుర్తించారు. ముఖ్య గుర్తు ఏమిటంటే SST /SSA లలో ఉష్ణోగ్రత సాధారణం కంటే 0.5 డిగ్రీలు పెరిగినపుడు ఎల్‌నినో వచ్చే అవకాశం ఉంటుంది. పై రెండింటిని సర్వసాధారణమైన ఎల్‌నినోలు అంటాము. వీటివల్ల వాతావరణంలో ప్రతికూల పరిస్థితులు ఏర్పడినప్పటికీ అవి తీక్షణమైనవిగా ఉండవచ్చు, ఉండకపోవచ్చు. కొద్దిపాటి నుంచి ఒక విధమైన ప్రతికూల పరిస్థితులను కలిగిస్తాయి.

75 ఏళ్లలో నాలుగు సూపర్ ఎల్‌నినోలు

సముద్ర అంతర్భాగంలోనూ, సముద్ర ఉపరితల నీటిలోనూ ఉష్ణోగ్రతలు 0.5 డిగ్రీల నుండి 2.0 డిగ్రీల దాక పెరగడాన్ని సూపర్ ఎల్‌నినో స్థితి అంటాము. ఈ దశ ఒక భయానకమైన స్థితిని సూచిస్తుంది. వాతావరణంలో విపరీతమైన మార్పులు చోటు చేసుకుంటాయి. పరిస్థితి అతలాకుతలమై పోతుంది. కొన్నిచోట్ల భారీవర్షాలు, వరదలు, మరి కొన్నిచోట్ల వర్షాభావ పరిస్థితులు, తీవ్రమైన ఎండలు, వేడిగాలులు సంభవించే అవకాశం ఉంటుంది. కాబట్టి సూపర్ ఎల్‌నినో మానవాళి చవి చూసే ఒక భయానక వాతావరణ విపత్తు. దీనివల్ల దారుణమైన వాతావరణ పరిస్థితి కలుగుతుంది. 2026లో సూపర్ ఎల్‌నినో వస్తుంది అనే అంచనాకు శాస్త్రవేత్తలు వచ్చారు. ఇది మన దేశాన్ని అత్యధికంగా ప్రభావితం చేయనుంది. మనందరికి రానున్నది గడ్డుకాలమనే చెప్పాలి.

1950 నుండి 2025 వరకు అంటే గత 75 ఏళ్ల చరిత్రలో సూపర్ ఎల్‌నినోలు నాలుగు సార్లు సంభవించాయని గణాంకాలు తెలియచేస్తు న్నాయి. 1982-83, 1997-98, 2015-16, 2023-24లలో సంభవించాయి. ఇవన్నీ ప్రభావిత ప్రాంతాలకు,మానవాళికి తీవ్ర నష్టాన్ని కలిగించాయి. 1997-98 సూపర్ ఎల్‌నినో కారణంగా ఆస్ట్రేలియాలో అత్యధిక వర్షపాతం నమోదైంది. దీంతో అక్కడి భూములలో సగటున 20 నుంచి 40 మి.మీ.ల తేమ పెరిగింది. అలాగే 2015-

సూపర్ ఎల్‌నినో..!

16 సూపర్ ఎల్‌నినో కారణంగా ఆస్ట్రేలియాలో వర్షా భావం తలెత్తింది. తేమ గణనీయంగా తగ్గిపోయింది. ఈ రెండు పరిస్థితులూ వ్యవసాయానికి విఘాతం కలిగించాయనవచ్చు.

అంచనా విధానం

అమెరికా జాతీయ సముద్ర వాతావరణ ప్రాధికారిక సంస్థ (నేషనల్ ఓషనిక్ అండ్ అట్మాస్ఫెరిక్ అడ్మినిస్ట్రేషన్ –NOAA) ఈ రంగంలో ముఖ్యంగా పనిచేస్తుంది. ఇది అధ్యయనాలుచేసి ప్రచురించే నివేదికలు ఇతర దేశాలకు ఉపయోగ కరంగా ఉంటున్నాయి. అలాగే యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్ కాస్ట్స్ ఇన్ యూకే అండ్ జర్మనీ అనే సంస్థ కూడా ఎల్‌నినో గురించి ముందస్తు సూచనలు ఇవ్వగలదు. మనదేశంలో సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంటల్ స్టడీస్ ఈ విషయాలపై సమాచారం సేకరిస్తుంది. అలా సేకరించిన సమాచారాన్ని క్రోడీకరిస్తుంది. విశ్లేషణలు చేస్తుంది. పరిశోధనాత్మక దృక్పథాన్ని సంబంధిత సమాచారానికి ఆపాదిస్తుంది. ఇటు ప్రభుత్వానికి, అటు ప్రజలకు తమ పత్రికలు, వెబ్‌సైట్ ద్వారా తెలియ చేస్తోంది. వీటితో పాటు పలు దేశాల్లో వాతావరణ సూచన కేంద్రాలు ఇదే రంగంలో పనిచేస్తూ గణాంకాలను పొందుపరుస్తున్నాయి.

అనర్థాలు

ఇవి రెండు రకాలుగా ఉంటాయి. మొదటిది కొన్ని ప్రాంతాలలో అత్యధిక, అసాధారణ వర్షపాతం నమోదై వరదలు సంభవించి ఆస్తి, పంటల, ప్రాణ నష్టాలు సంభవిస్తాయి, 2023 ఎల్‌నినోలో ఇదే జరిగింది(దీన్నే ఇండియన్ నినో అన్నారు). వర్షాభావం, వేడిగాలులు వీచడం జరిగింది. రెండూ తట్టుకోలేని ఉత్పాతాలే.

ఈ ఏడాది వచ్చే ఎల్‌నినో రెండవ రకానికి చెందినదిగా శాస్త్రవేత్తలు నిర్ణయించారు. ఇది మన దేశంపై అత్యంత తీవ్ర ప్రభావం చూపిస్తుంది. 12 రాష్ట్రాలలో ఉన్న 312 జిల్లాలను కరువుకోరల్లోకి నెట్టగలదని చెపుతున్నారు.

సమస్యలు

1. అతి వేడి గాలులు: ఇదే మూలమైన సమస్య. మిగిలిన కష్ట, నష్టాలకు కారణం. ఈ వేడిగాలులవల్ల ప్రభావితమయ్యే ప్రాంతాలలోని ప్రజలు హీట్ స్ట్రెస్ – వేడిమి ఒత్తిడికి గురవుతారు. వీచే గాలి నుండి జీవులపై ప్రసరించే అతి వేడిమి, అతి తేమ, గాలి, ధార్మికతల సంయుక్త పీడనం. ఇది వాతావరణం నుంచి వచ్చే పీడనం దీనికి ముఖ్యకారణాలు. పారిశ్రామిక, వాణిజ్య, రవాణా కార్యకలాపాలలో విడుదలయ్యే వేడి, వాయు ఉద్గారాలు సమస్యను మరింత జటిలం చేసి మన ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. మామూలు వాతావరణ పరిస్థితులలోనే ఎల్‌నినోలో నమోదైన ఉష్ణోగ్రతలు, మిగిలిన కారకాలపై ఐరోపాలో పరిశోధనలు చేశారు. వాటి ప్రకారం 1970లో మామూలు వాతావరణ మార్పులకే ప్రపంచ జనాభాలో 55% సంవత్సరంలో కనీసం 90 రోజులు వేడిమి ఒత్తిడికి గురయ్యారట. అది 2025కు వచ్చేసరికి 70%కి పెరిగింది. ఇప్పటికీ సహజ వాతావరణమే వేడిమి ఒత్తిడి కలుగచేస్తుంటే, దానికి తోడు ఎల్‌నినో నుంచి వేడిమి ఒత్తిడి మానవాళిని పూర్తిగా ఇబ్బంది పెడుతోంది. ఉప ఉష్ణమండల ప్రాంతాలైన దక్షిణ ఐరోపా, ఉత్తర, దక్షిణ ఆఫ్రికా, దక్షిణ అమెరికాలో మునుపటికంటే అదనంగా ఇప్పుడు సంవత్సరంలో 50 రోజులు వేడిమి ఒత్తిడి ఉంటుందని అంచనా. అంటే ఏడాదిలో 140 రోజులు. ఇక భారత్‌లో దీని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పెరుగుతున్న ప్రపంచ కార్యకలాపాలవల్ల గతంలో ప్రతి దశాబ్దం 0.27 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు పెరిగితే ఇటీవల అది 0.32 కి పెరగడం గమనార్హం. 1970 నుంచి ఈనాటి వరకు ప్రపంచ వ్యాప్తంగా సుమారు 900 కోట్ల ప్రజలు విపరీత వేడిమి ఒత్తిడికి గురయ్యారని ఒక అంచనా. ఇది కాక ఐరోపా ప్రాంతంలో ఈ సంవత్సరం ఒమేగా హీట్ డోమ్ ఏర్పడే అవకాశాలు, దీనివల్ల వేడిమి అతిగా పెరిగే అవకాశాలున్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు.

2.మనదేశంలో క్లైమేట్ స్ట్రెస్ – వాతావరణ ఒత్తిడి (వేడిమి ఒత్తిడి సహా)తో ముఖ్యంగా వృద్ధులు, బాలలు ఎక్కువగా బాధపడుతున్నారు. ఐక్యరాజ్య సమితి బాలల నిధి–యునిసెఫ్ (UNICEF) బాలలకు పర్యావరణ ముప్పుపై 2026లో సమర్పించిన నివేదిక ప్రకారం మనదేశంలో దాదాపు ప్రతి చిన్నారి వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల నుంచి ఒత్తిడికి గురవుతున్నారు. అది వేడి కావచ్చు, అధిక వర్షాల వల్ల కావచ్చు, ఇంకేదైనా కావచ్చు. ప్రపంచం లోని 55% దేశాలలో దాదాపు 97% బాలలు(సుమారు 24 కోట్ల మంది)రెండు రకాల ఒత్తిళ్లు ఒకదానితో ఒకటి కలిసినప్పుడు వాటికి గురవుతున్నారు. దీనికితోడు శిలాజ ఇంధనాన్ని

మండించడం, పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాల వల్ల ఉత్పన్నమౌతున్న కాలుష్యం, అప్పుడప్పుడు వచ్చే ఎల్‌నినోలు బాలల సమస్యలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. భారత్‌లో పై వాటిలో ఒకటైనా తప్పకుండా, నిరంతరాయంగా బాలలను ప్రభావితం చేస్తూనే ఉంటుంది. పైన పేర్కొన్న 24 కోట్ల మంది బాలలలో దాదాపు 16 కోట్ల మంది కరవు, విపరీతమైన వేడి, ఆ వెంటనే వాతావరణం మారి ఆకస్మికంగా ముంచుకొచ్చే వరదలను చవి చూసిన సందర్భాలు ఉన్నాయని UNICEF ఆవేదన. సహజంగానే మనదేశం తుపానులు, వరదలు, వేడి వాతావరణం ఉండడానికి అనుకూలమైన భూభాగం. దీనికితోడు విచ్చలవిడి పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, బొగ్గు,ఖనిజాల తవ్వకం కోసం చెట్లు కూల్చి హరితాన్ని హరిస్తున్న వైనం, భూగర్భ జలాల విపరీత వాడకం, కాలుష్య నియంత్రణలో ప్రభుత్వాల నత్తనడకలతో సమస్య మరింత జటిలమై అమాయక బాలలు అల్లాడిపోతున్నారు. ప్రభుత్వాలు తక్షణమే ఈ సమస్యలన్నిటిపై దృష్టిపెట్టి తగు చర్యలు చేపట్టాలి. అలాకాని పక్షంలో పరిస్థితులు మరింత తీవ్రమై "క్షవరం అయితే గాని వివరం రాలేదు" అన్నట్లుంటుంది. ఎందుకంటే కాలుష్య నియంత్రణా వైఫల్యంలో బాలలే మొదటి బాధితులు. ఒక నివేదిక ప్రకారం 2025లో భారత్‌లో వాతావరణంలో చోటుచేసుకున్న విపరీత మార్పులలో దాదాపు 5.5 కోట్ల మంది బాలలు ప్రభావితులయ్యారు. ఇంకొక అతి బాధాకరమైన విషయం ఏమిటంటే ప్రపంచంలోని అన్ని దేశాలకంటే మనదేశంలోనే ఎక్కువ మంది బాలలు విపరీత వాతావరణ మార్పులతో కష్టాలకు గురవుతున్నారు.

మన దేశంలో బహుళ వ్యాప్తంగా ఉన్న నానుడి "మనం ఈ ప్రకృతిని మన పెద్దలనుండి కాక మన భావితరాలనుండి తీసుకుని అనుభవిస్తున్నాం" అన్నది వారికి మిగలకుండా నాశనం చేస్తున్నాం. వాళ్లకి కష్టాలు, నష్టాలు మిగుల్చుతున్నాం" అని దాన్ని మార్చాల్సిన సమయం ఆసన్నమవుతోంది. దేశ రక్షణ వ్యవస్థలో ఒక పదం ఉంది. శత్రువుపై ప్రయోగించే కీలకమైన రక్షణ పరికరాలను "వెపన్స్ అఫ్ మాస్ డిస్ట్రక్షన్" – సామూహిక విధ్వంసక ఆయుధాలు అని అంటాము. అలాగే మనం ప్రస్తుతం విచ్చలవిడిగా వాడే శిలాజ ఇంధనాలు, అపరిమితమైన కార్లు, బైకులు, ఏసీలు, పరిశ్రమలలో అతిగా వాడే రసాయనాలు, అతిగా ఉత్పత్తి చేసే పారిశ్రామిక వ్యర్థాలు.. ఇలా అన్నీ అతి అయితే వీటిని ఒక రకంగా పర్యావరణాన్ని నష్టపరచే వెపన్స్ ఆఫ్ మాస్ డిస్ట్రక్షన్స్ అనవచ్చు. వీటిని నియంత్రించడం మనందరి తక్షణ కర్తవ్యం. రూపాయి విలువ గణనీయంగా తగ్గుతుంటే ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తపరచగానే ప్రభుత్వం తక్షణ చర్యలకు పూనుకుంటుంది.. మరి పర్యావరణ సమతుల్యతకు విఘాతం కలుగుతుంటే పర్యావరణ వేత్తలు ఆందోళనలు వ్యక్తపరిచినప్పటికీ సత్వరచర్యలు తీసుకోవడానికి అంత వేగంగా నడుంకట్టదు. ఇది వాస్తవం కాబట్టే నానాటికీ పర్యావరణ సమతుల్యత దెబ్బతిని, ఎల్‌నినోలు దీనికి తోడై ప్రజా జీవితం ముఖ్యంగా బాలలు వాతావరణ ఒత్తిడికి గురవుతున్నారు. ఎల్‌నినో రావచ్చు, రాకపోవచ్చు కానీ శాశ్వతమైన ఎల్‌నినో నిరంతర పర్యావరణ విఘాతమనుకోవచ్చు.

3. వ్యవసాయ సంక్షోభం

సూపర్ ఎల్‌నినోతో తీవ్ర వర్షాభావం కానీ, తీవ్రంగా వర్షాలు పడటం కానీ జరుగుతుంది. దీనివల్ల పంటలు పండించడానికి తగిన నీరు లేకపోవడం, భూగర్భ జలాలు ఎండిపోవడం జరుగుతుంది. అలాగే అతివర్షంతో పంట నాశనమవుతుంది. దీంతో రైతులు తీవ్రమైన ఆర్థిక నష్టంలో కూరుకుపోతారు. దేశంలో తిండి గింజల కొరత ఏర్పడుతుంది. ఎల్‌నినోతో కూడా వర్షాభావంతో తగినంత పంటలు పండవు. ఈ పరిస్థితులలో ముఖ్యంగా నగరాలలో నివసించే అధిక జనాభాకు చాలా ఇక్కట్లు, పారిశ్రామిక, వాణిజ్య కలాపాలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. అందుకే సూపర్ ఎల్‌నినోను చిన్న ప్రళయంగా భావించవచ్చు.

4. విద్యుత్ సంక్షోభం

తగినంత నీరు లేక బొగ్గు ఉపయోగించి ఉత్పతయ్యే విద్యుత్, నీటి ఆధారిత విద్యుదుత్పత్తి తగ్గి విద్యుత్ సంక్షోభం తలెత్తుతుంది.

5. పర్యాటకానికి దెబ్బ

వేడి గాలులు, విపరీత వర్షాల వల్ల పర్యాటక రంగం దెబ్బ తింటుంది. దాని పైన ఆధారపడుతున్న ప్రాంతాలు, సంస్థలు తీవ్ర ఆర్థిక నష్టాలను చవి చూస్తాయి.

6. శ్రామికుల కొరత

అసలే అధిక జనాభా కలిగిన నగరాలలో ఇప్పటికే అష్టకష్టాలు పడుతున్న శ్రామికులు, కార్మికులు ఎల్‌నినోల దశలో ఉపాధి, నీరు, మంచి వసతి, విద్యుత్తు కరవై, స్వగ్రామాలకు తిరిగి వెళ్లిపోవాల్సి వస్తుంది. దీనివల్ల నగరాల్లో శాశ్వతంగా ఉండే మిగిలిన జనాభాకు శ్రామికులు దొరకక తీవ్ర ఇబ్బందులు నెలకొంటాయి.

7. ఆరోగ్య సమస్యలు

వాతావరణ మార్పులు, వేడిమి ఒత్తిడి, నీటి కొరత, విద్యుత్ కొరత వల్ల ప్రజల దైనందిన జీవితంలో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా వృద్ధులు, బాలలు బాధితులవుతారు.

8. ఆర్థిక సంక్షోభం

ఎల్‌నినోల ద్వారా ఉత్పన్నమయ్యే అనేక ప్రతికూల ప్రభావాల వల్ల ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతుంది. 1983-84 నుండి 2023 వరకు సంభవించిన నాలుగు ఎల్‌నినోలవల్ల ప్రపంచవ్యాప్తంగా దాదాపు 10 వేల కోట్ల డాలర్ల నష్టం జరిగినట్లు ఆర్థిక నిపుణులు తెలిపారు. వీటి నుంచి కోలుకోవడానికి ఎక్కువ ఆర్థిక వనరులు కావలసి ఉంటుంది.

ప్రభుత్వ చర్యలు

1. 2026 సూపర్ ఎల్‌నినో వల్ల దేశంలో 315 జిల్లాలు తీవ్ర వర్షాభావంతో ప్రభావిత మౌతాయని, దాదాపు కరవుకు గురవ వచ్చని, వాటిలో మన రెండు తెలుగు రాష్ట్రాలు కూడా ఉన్నాయని కేంద్రం గుర్తించింది.

2. పర్యావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ పంటలను, పద్ధతులను గురించి

రైతులలో అవగాహన కల్పించడానికి నడుంకట్టింది. ఎక్కువ నీటిమీద ఆధారపడని ప్రత్యామ్నాయ పంటలను సూచించడం, ప్రోత్సాహించడం దీని ముఖ్యోద్దేశం. దీనికి కేంద్ర ప్రభుత్వం ఖేత్ బచావో అభియాన్ అని పేరు పెట్టింది. దీనిలో కేంద్ర వ్యవసాయ పరిశోధనా సంస్థ, మెట్ట వ్యవసాయంపై కేంద్ర వరిశోధనా నంస్థ ప్రధాన పాత్ర పోషించనున్నాయి.

3. ఇప్పటికే నిల్వ ఉన్న వ్యవసాయ ఉత్పత్తుల సురక్షిత నిర్వహణ, నియంత్రణలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు సూచనలు ఇచ్చాయి.

4. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన తీవ్ర వర్షాభావ జిల్లాలలో ఏపీ, తెలంగాణ కూడా ఉన్నాయి. వీటితో పాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, బిహార్, జార్ఖండ్, ఒడిశాలు కూడా అధికంగా ప్రభావితమౌతున్నట్లు గుర్తించారు.

ఆంధ్రప్రదేశ్‌లో చర్యలు, సూచనలు

- వర్షాభావం తట్టుకునే ప్రత్యామ్నాయ పంటలు ముఖ్యంగా పప్పుదినుసులులాంటివి,సహజ సేంద్రియ పంటలు వేయాలి (వీటిని తక్కువ నీటితో పండించవచ్చు).
- ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీ మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వ "రైతన్నా! మీకోసం! అన్న బృహత్ కార్యక్రమాన్నిన రైతులు అనుసరించాలి.
- ఎల్‌నినో తీవ్రరూపం దాల్చకముందే పంటలను కాపాడుకునేటంత నీటిని జలాశయాల నుంచి వదలాలి.
- సూక్ష్మ నీటిపారుదల వ్యవసాయ పద్ధతులు పాటించి నీటిని పొదుపుగా వాడుకోవాలి.
- రాష్ట్ర విపత్తు నిర్వహణ విభాగం ద్వారా వేడిగాలులను ప్రజలు, ఇతర ప్రాణులు తట్టుకునే ప్రణాళికలు అమలుపరచాలి.
- పరిశ్రమలు, వాణిజ్య, నిర్మాణరంగంలోని శ్రామికులు వేడిమి నుంచి తట్టుకోవడానికి తగిన నీరు, వసతి సౌకర్యం ఏర్పాటు చేయాలి. వైద్య పరమైన సహాయం ముమ్మరం చేయాలి.

రాయలసీమ జిల్లాలకు ముప్పు

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న బలహీన వ్యవసాయ ప్రాంతాలకు ఎల్‌నినో హెచ్చరిక జారీ చేసింది, ఆంధ్రప్రదేశ్‌లోని వలు జిల్లాలను గుర్తించింది. ఈ అంచనా ప్రకారం రాయలసీమలోని అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు, ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు కూడా అధిక ప్రమాదకర కేటగిరిలో ఉన్నాయి. ప్రకాశం, నెల్లూరు జిల్లాలను కూడా ముందుగానే సన్నద్ధమవ్వాల్సిన బలహీన జిల్లాలుగా గుర్తించారు. ఆంధ్రప్రదేశ్‌లో తగ్గుతున్న భూగర్భ జలమట్టాలు, పరిమిత నీటిపారుదల సౌకర్యం, ముఖ్యంగా వర్షాధార వ్యవసాయ ప్రాంతాలలో రుతుపవన వర్షాలపై అధికంగా ఆధారపడటం ప్రధానంగా ఆందోళనలు కలిగిస్తున్నాయి. రాయలసీమలో వ్యవసాయం ప్రధానంగా రుతుపవన వర్షాలపై ఆధారపడి ఉంటుంది కాబట్టి, అక్కడ వర్షపాతం ఏ మాత్రం తగ్గినా విత్తనాలు వేసే నిర్ణయాలు, పంట ఉత్పాదకత ప్రభావితం కావచ్చు. రుతుపవన పరిస్థితులు బలహీనంగా ఉంటే, నీటిని ఎక్కువగా వినియోగించే పంటలకు అధిక నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. శ్రీకాకుళం, విజయనగరం వంటి ఉత్తర కోస్తా జిల్లాల్లో, నీటిని పొదుపు చేసే సాగు పద్ధతులను అవలంబించాలని, తేమ ఒత్తిడిని తట్టుకోగల పంటల వైపు మళ్లాలని రైతులకు సూచిస్తున్నారు. కరవు లాంటి పరిస్థితులు వాటిల్లకుండా, క్షేత్రస్థాయిలోనే వ్యవసాయ అత్యవసర ప్రణాళికలను అమలు చేయాలని జిల్లా యంత్రాంగాలను కోరారు. ఈ ప్రణాళికలు పంటల వైవిధ్యం, సమర్థవంతమైన నీటి నిర్వహణ, రైతులకు సకాలంలో సలహాలు ఇవ్వడంపై దృష్టి సారిస్తాయి. అధిక నీటి లభ్యత అవసరమయ్యే పంటలకు బదులుగా పప్పుధాన్యాలు, జొన్న, సజ్జ, రాగి వంటి కరవును తట్టుకోగల పంటలను పండించాలని బలహీన ప్రాంతాల్లోని రైతులను ప్రోత్సహిస్తున్నారు. నీటి వినియోగాన్ని తగ్గించి, ఉత్పాదకతను నిలబెట్టడానికి మల్చింగ్, అంతరపంటలు, నేరుగా విత్తే వరి (DSR) వంటి శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను కూడా ప్రోత్సహిస్తున్నారు. వర్షపాత ధోరణులు, పంటల పరిస్థితులు, తలెత్తుతున్న ప్రమాదాలను పర్యవేక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌నినో పర్యవేక్షణ సెల్, పంట వాతావరణ పర్యవేక్షణ బృందం ద్వారా పర్యవేక్షణ యంత్రాంగాలను బలోపేతం చేసింది. ఈ వ్యవస్థ రైతులకు, జిల్లా యంత్రాంగాలకు సకాలంలో సలహాలను అందించే లక్ష్యంతో పనిచేస్తుంది. వర్షాధార ప్రాంతాలలో స్వల్పకాలిక, తక్కువ నీటి అవసరమయ్యే పంటలను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అనిశ్చిత వాతావరణ పరిస్థితులలో కూడా నష్టభయాలను తగ్గించి, రైతుల ఆదాయాలకు రక్షణ కల్పించేందుకు పంటల వైవిధ్యీకరణ, మిశ్రమ వ్యవసాయం, అంతరపంటలను ప్రోత్సహిస్తున్నారు. పరిమిత తేమ లభ్యతలో మెరుగ్గా పండే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజల పంటలపై ప్రత్యేక దృష్టి సారించారు.

తెలంగాణలో చర్యలు, సూచనలు

- ప్రత్యామ్నాయ పంటలు, నీటి నిల్వలకు ప్రాధాన్యం
- అవనరమైన చోట డ్యాముల గేట్లకు మరమ్మతులు
- వరి సాగు 35 లక్షల ఎకరాలకు కుదింపు
- పప్పులు, చిరు ధాన్యాలు, మొక్కజొన్న, నూనె గింజల పంటలకు ప్రోత్సాహం
- నదీ జలాల్లో వాటాలపై సంబంధిత రాష్ట్రాలతో సంప్రదింపులు
- గ్రేటర్ హైదరాబాద్‌కు తాగునీటి నిల్వల నిర్వహణకు ప్రణాళిక
- భూగర్భ జలాల పరిరక్షణకు ఇంకుడు గుంతల ఏర్పాటు
- రైతు వేదికల ద్వారా ఎల్‌నినో పట్ల రైతులకు అవగాహన

అందుబాటులోఉన్న సమాచారం ద్వారా తెలుస్తున్నదేమిటంటే వర్షాభావ పరిస్థితులను తట్టుకుని పంటలను కాపాడుకునేందుకు కేంద్ర వ్యవసాయ పరిశోధనా సంస్థ, మెట్ట వ్యవసాయంపై కేంద్ర పరిశోధనా సంస్థ సంయుక్తంగా ప్రతి జిల్లాకు ప్రత్యేక వ్యవసాయ అత్యవసర ప్రణాళికలను

మన బాధ్యత

ఇలాంటి విపత్తు సమయాల్లో ప్రజలు కూడా స్వచ్ఛందంగా (సంఘాలుగా ఏర్పడి) పలురకాల విపత్తు నిర్వహణ కార్యక్రమాలు అమలు చేసే ప్రభుత్వాలకు వారి కార్యక్రమాలలో తగిన చేయూతనిస్తే ఎల్‌నినో పరిస్థితులను సులభంగా ఎదుర్కోవచ్చు. ఆ దిశలో యీ క్రింది సలహాలు ఉపయోగపడొచ్చని అనిపిస్తోంది.

- మెట్ట పంటలు వేయడానికి రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావాలి.
- ప్రజలందరూ మార్కెట్‌లో లభించే ఆహార పదార్థాల వాడకంలో వృథాను అరికట్టాలి.
- రైతులు సహా ప్రజలందరూ ఎల్‌నినో ప్రభావాల గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలి.
- ప్రజలందరూ వేడి సమయాలలో తప్పక గొడుగుల కింద, షెల్టర్‌ల కింద ఉండి తమను తాము కాపాడుకోవాలి.
- దైనందిన నీటి వాడకంలో అత్యధిక పొదుపును పాటించాలి. పదేపదే ఇళ్లు కార్లు కడగడం తగ్గించాలి.
- ఎల్‌నినో ప్రభావం సమయాలలో నీటిని ఉపయోగించి చేసే నిర్మాణాలను తాత్కాలికంగా ఆపేయాలి.
- అత్యవసరమైతే తప్ప స్వంత వాహనాల్లో విహారాలు, ప్రయాణాలు చేయకూడదు. దీనివల్ల ఇంధనం మండించడం వల్ల ఉత్పన్నమయ్యే వేడి, కాలుష్యాన్ని నివారించవచ్చు.
- జాతీయ రహదారులకు పక్కనే ఉన్న గ్రామాలలోని ప్రజలు రోడ్ల పక్కన సామూహిక షెల్టర్స్ నిర్మించాలి.
- ఎవరికీ వారు, వారు ఉంటున్న ప్రదేశాలలో పక్షులకు, ఇతర ప్రాణులకు తాగునీటి కడవలు ఏర్పాటుచేయాలి.
- పరిశ్రమలలో ఎక్కువ నీటి వినియోగం ఉన్న ఉత్పత్తులను తగ్గించాలి/తాత్కాలికంగా నిలిపి వేయాలి.
- నగరాల్లో, గ్రామాల్లో ప్రజలు వాడవాడలా ఎల్‌నినో సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పొదుపు చర్యలపై సదస్సులు నిర్వహించుకోవాలి.
- విద్యుత్తును పొదుపుగా వాడుకుని విద్యుత్ ఉత్పత్తిపై అదనపు భారం పడకుండా, ఉత్పత్తి వ్యయం పెరగకుండా చూసుకోవాలి.
- నగరాల్లో పెద్దగా పనిలేని వారు నగరాల్లోని వనరుల కోసం పోటీ పడకుండా గ్రామాలకు వెళ్లి సహాయపడాలి.

రూపొందిం చాయి. వర్షాలు నిలిచిపోయే అవకాశం ఉన్న ప్రాంతాలలో సాగు ఖర్చులు భారం కాకుండా, తక్కువ నీటి అవసరం ఉండే, తక్కువ కాలంలో పండే ప్రత్యా మ్నాయ పంటలను వేసేలా రైతులను ప్రోత్సహించాలని కేంద్రం కోరింది. పంటల వైవిధ్యీకరణ ద్వారా సాగు నష్టాలను చాలా వరకు తగ్గించాలని రాష్ట్రాలకు సూచించింది.

రైతాంగానికి సాగునీటి కొరత రాకుండా ఉండేందుకు రాష్ట్రాలు తమ పరిధిలోని చెరువులు, కాల్వలు, జలాశయాలు, పొలాల్లోని చిన్న కుంటలు, చెక్ డ్యామ్‌ల మరమ్మతులను తక్షణమే పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వాన నీటిని గరిష్టంగా నిల్వచేసుకునేందుకు వీలుగా తాత్కాలిక కట్టలను నిర్మించాలని సూచించింది. తీవ్ర నీటి కొరత ఉన్న జిల్లాల్లో తాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యత నిచ్చింది.

పర్యావరణ పరిరక్షణోద్యమం ఒక నిరంతర ప్రక్రియగా పర్యావరణాన్ని, వాతావరణాన్ని పరిరక్షించే విధానాలను తమ దేటా సమీకరణ, విస్తృత ప్రచారం ద్వారా మనదేశంలో విజ్ఞాన, పర్యావరణ కేంద్రం– సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ కృషి చేస్తోంది. ఇది 1980లో ప్రారంభమైంది. పర్యావరణాన్ని, వాతావరణాన్ని పరిరక్షించే విధానాలను ఇటు ప్రభుత్వానికి, అటు ప్రజలకు తమ ప్రచురణలద్వారా, వెబ్‌సైట్ ద్వారా, ప్రచారం ద్వారా తెలియజేయడానికి ఎంతో కృషి చేస్తోంది. 2023లో సంభవించిన సూపర్ ఎల్‌నినోకు సంబంధించి ఆ దశలో ప్రతి రోజూ వేడిగాలులు వీచిన సరళి, వర్షపాతం తగ్గుదల చెందిన సరళి, ప్రత్యేకంగా ఏర్పడ్డ ప్రతికూల వాతావరణ పరిస్థితులను క్రోడీకరించి, విశ్లేషించి ఒక డేటా పట్టిక చేసింది. ఎల్‌నినో వల్ల దేశంలో వ్యవసాయ ఉత్పత్తులు తగ్గిన సరళిని, ప్రతికూల వాతావరణ పరిస్థితుల వివరాలు, చివరకు 2023 ఎల్‌నినో ప్రభావం వల్ల చనిపోయిన వారి సంఖ్యను కూడా డేటాగా పొందుపర చిందని సమాచారం. ఆ అనుభవంతో ఈ సంస్థ 2026 సూపర్ ఎల్‌నినో వల్ల కలిగే (ఇప్పటికే దాదాపు 30% వర్షపాతం నమోదు కాలేదని అంచనా) దుష్పరిణామా లను అంచనా వేస్తున్నది. తమ దైనందిన కార్యకమంగా ఈ సంస్థ ప్రతినిధులు గ్రామాలు, పట్టణాలలో తిరిగి పర్యావరణ, వాతావరణ పరిస్థితులను పరిరక్షించు కోవడం కోసం ఎన్నో సదస్సులద్వారా విషయ, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు. ఇది కాక భారత జాతీయ సముద్ర సమాచార సేవల కేంద్రం– ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషనోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్(ఐఎన్‌సీఓఐఎస్) అనే సంస్థ కూడా ఎప్పటికప్పుడు సముద్రాల్లో మార్పులు,

మనపై వాటి ప్రభావం మీద ఎప్పటికప్పుడు మనకు సమాచారం, హెచ్చరికలు జారీ చేస్తుంది. ఇలాంటి ఇతర చిన్న, పెద్ద సంస్థలు, పర్యావరణ శాస్త్రవేత్తలు పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్న కృషి ఎంతో ప్రశంసనీయం.

ప్రజలు తమ పరిధిలో స్వచ్ఛందంగా, సమష్టిగా పాల్గొని తమ పర్యావరణాన్ని తామే రక్షించుకోగలరనే దానికి రాజస్థాన్‌లోని ఒక చిన్న గ్రామం నిదర్శనంగా నిలుస్తుంది. ఎడారి ప్రాంతమైన రాజస్థాన్‌లోని బార్మేర్ జిల్లాలోని "మొలోప్ ఎనేర్ " అనే గ్రామంలో నీటి కొరత ఉండేది. ఆ గ్రామంలో కొంత భూమి వ్యర్థాలతో నిండి నిరుపయోగంగా ఉండేది. ఆ గ్రామ ప్రజలు సంఘటితమయ్యారు. ఆ భూమిని తవ్వారు. అక్కడే జలాశయాన్ని నిర్మించుకున్నారు. వర్షా కాలంలో జలాశయంలో చేరిన నీటితో ఇప్పుడు తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. ఇలా ప్రతి ప్రాంతంలో ప్రజలు తమ చుట్టూ ఉన్న చిన్న చిన్న అమూల్య వనరులను పర్యావరణ పరిరక్షణలో భాగంగా సమర్థమంతంగా, తమకనుగుణంగా మలుచుకుని ఉపయోగించుకుంటే ఎల్‌నినో లాంటి సమస్యలను ఎదుర్కోవచ్చు. వివిధ అంతర్జాతీయ, జాతీయ సంస్థల శాస్త్రవేత్తలు చేస్తున్న అధ్యయనాలు పరిణతి చెందుతున్నాయి కాబట్టి ముందుగానే విపత్తులకు సంబంధించిన సమాచారం, హెచ్చరికలు అటు ప్రభుత్వాలకు, ఇటు ప్రజలకు సకాలంలో అందుతున్నాయి.

అయితే దేశంలో ప్రతి ఒక్కరు ఆ అధ్యయనాల సారాంశాన్ని తీవ్రంగా పరిగణించాలి. అటు ప్రభుత్వాలు, ఇటు పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, ప్రజలు తగురీతిగా సకాలంలో స్పందిం చాలి. పర్యావరణ పరిరక్షణ చర్యలు విపత్తు సమయాలలోనే కాక మిగిలిన సమయాలలోకూడా చేపట్టేలా విధానరూపకల్పన జరగాలి. ప్రజల భాగస్వామ్యం ఉండాలి. వనరులను పొదుపుగా, విచక్షణతో వినియోగించుకోవాలి. చట్టాలను విధిగా పాటించాలి. వ్యర్థాలను తగ్గించాలి. ఇలాంటి పనులను సమష్టిగా అమలుచేయడంలో మనం ఇంకా పరిణతి చెందాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఎటువంటి విపత్తునైనా సమర్థ వంతంగా ఎదుర్కొనే స్థాయికి యావత్ దేశం చేరుకుంటుంది.

"సర్వే జనాః సుఖినో భవంతు"

మహీవాది రామకృష్ణ

ఎల్‌నినోతో కుప్పకుప్పలుగా నేరేడు పండ్లు



భారతీయ మార్కెట్లు నేరేడు పండ్లతో నిండి పొంగిపోతున్నాయి. భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో నేరేడు పండ్లు అసాధారణంగా సమృద్ధిగా పండుతున్నాయి. కేవలం ఒక సంవత్సరం క్రితం దిగుబడి తక్కువగా ఉన్న ప్రాంతాలలో కూడా ఇప్పుడు స్థానికులు చెట్లనిండా వండ్లు ఉండటాన్ని గమనిస్తున్నారు. దీనికి ఒక సామాజిక మాధ్యమ వినియోగదారు స్పందించారు. తమ బామ్మ తరతరాలుగా చెప్పిన ఒక సాంప్రదాయ జ్ఞానంతో ముడిపెట్టారు. వేసవిలో నేరేడు చెట్లు అసాధారణంగా అధిక పరిమాణంలో పండ్లను రాల్చితే, ఆ సంవత్సరం కరవు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందనేది బామ్మ మాట.

నేరేడు లేదా సిజిజియం క్యుమిని మార్చి, ఏప్రిల్ నెలల మధ్య పూస్తుంది. ఈ సమయంలో పూసే చిన్న, తెల్లని, సువాసన గల గుత్తులు కాయలుగా మారతాయి. కాయలు ఏర్పడటానికి ముందు ఈ గుత్తులకు తప్పనిసరిగా పరాగసంపర్కం జరగాలి. ఈ సమయంలో కురిసే వర్షమే దీనికి శత్రువు. అది పువ్వుల నుండి పుప్పొడిని రాల్చేస్తుంది, పరాగ సంపర్క కారకాలను కొట్టుకుపోయేలా చేస్తుంది. లేత కాయలు అభివృద్ధి చెందకముందే రాలిపోయేలా చేస్తుంది. ఈ ఏడాది మన దేశంలోని చాలా ప్రాంతాలలో రుతుపవనాలకు ముందు వచ్చే వసంతకాలం అసాధారణంగా పొడిగా ఉంది. అరేబియా సముద్రం నుండి వచ్చే రుతుపవనాల ప్రవాహం నిలిచిపోయింది. జూన్‌లో మహారాష్ట్ర , కర్ణాటక అంతటా 40 నుండి 54 శాతం వరకు వర్షపాత లోటు నమోదైంది. వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు నిరాశ కలిగించిన ఆ పొడి వసంతకాలం, నేరేడు పూయడానికి చాలా అనుకూలంగా ఉంది. సాధారణం కంటే అధిక స్థాయిలో పరాగసంపర్కం విజయవంతమైంది. కాయలు బాగా కాశాయి. చెట్లు ఫలాలను అందించాయి. నేరేడు పండ్లు సమృద్ధిగా పండటమనేది చెట్టు ఒత్తిడిని, ప్రత్యేకంగా తగ్గుతున్న భూగర్భ జలాలను గ్రహించి, మనుగడ వ్యూహంగా పునరుత్పత్తి వైపు తన శక్తిని మళ్లిస్తుండటాన్ని సూచిస్తుంది. 'స్ట్రెస్ ఫ్రూటింగ్' అని పిలిచే ఈ ప్రక్రియ వాస్తవ వృక్షశాస్త్రం నుండి ఉద్భవించింది. నీటి ఒత్తిడికి గురైన చెట్లు పరిస్థితులు మరింత దిగజారకముందే పునరుత్పత్తి చేయాలనే పరిణామ సహజ ప్రవృత్తితో, కొన్నిసార్లు తమ వనరులను శాఖీయ పెరుగుదల నుండి విత్తనోత్పత్తి వైపు మళ్లిస్తాయి. అయితే వృక్షశాస్త్రజ్ఞుల ప్రకారం నేరేడు పండ్ల అధిక దిగుబడి భవిష్యత్తులో కరవుకు సూచన కాదు. అది గతంలోని పొడి పరిస్థితులను, అంటే పూతకు అనుకూలించిన పొడి వసంతాన్ని ప్రతిబింబిస్తుంది. చెట్టు ఇప్పటికే జరిగిన దానికి ప్రతిస్పందిస్తోంది. కానీ అది తరువాత ఏమి జరుగుతుందో అంచనా వేయడం లేదు. సాంప్రదాయ జీవావరణ శాస్త్ర పరిజ్ఞానం, ఆధునిక వృక్షశాస్త్రం ఈ పరిశీలనతో ఏకీభవిస్తాయి. కానీ, కార్యకారణ సంబంధం దిశ విషయంలో అవి విభేదిస్తాయి.

మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు కాలానుగుణంగా పెరగడాన్ని సూచించే ఎల్‌నినోను జూన్ 11, 2026న భారత వాతావరణ శాఖ(ఐఎండీ) ప్రకటించింది. ఆసియా అంతటా వాతావరణ ప్రసరణ సరళిని ఎల్‌నినో మారుస్తుంది. దీనివల్ల భారతదేశం వైపు తేమను తీసుకువచ్చే గాలులు బలహీనపడి ఉపఖండం అంతటా వర్షపాతం తగ్గుతుంది. ఎల్‌నినో సంవత్సరాలలో భారతదేశంలో సాధారణం కంటే తక్కువ రుతుపవన వర్షపాతం, కొన్ని సందర్భాల్లో తీవ్రమైన కరవు ఏర్పడతాయి. ఐఎండీ ఇప్పటికే తన 2026 రుతుపవన అంచనాను దీర్ఘకాలిక సగటులో 90 శాతానికి సవరించింది. మొత్తం మీద రుతుపవన కాలంలో వర్షపాతం లోటుగా ఉండే అవకాశం 60 శాతంగా పేర్కొంది. ఎల్‌నినో సృష్టించిన ఈ పొడి రుతుపవన పూర్వ పరిస్థితులు నేరేడు చెట్టుకు ఒక వరంలాంటివి. నేరేడుకు అవసరం లేని అవే వర్షాలపై ఆధారపడిన రైతులకు మాత్రం పరిస్థితి చాలా దారుణంగా ఉంది. చివరికి, ఆ పండుకు, కరవు హెచ్చరికకు మధ్య పెద్దగా తేడా లేదని తేలింది. వాతావరణ సరళి మారుతున్న కొద్దీ నేరేడు పండ్లను అధికంగా ఇచ్చే పొడి వసంతాలు తరచుగా సంభవిస్తున్నాయి. ఈ జూన్‌లో మహారాష్ట్రలోని రైతులను ఒత్తిడికి గురిచేసిన అవే అస్తవ్యస్తమైన రుతుపవనాలకు ముందు పరిస్థితులే నేరేడు చెట్లకు అనువైన పరిస్థితులను సృష్టించాయి. ★

'సంకల్ప పత్ర' దిశగా

దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించిన పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో సుదీర్ఘ పోరాటం తర్వాత భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తొలిసారిగా 2026లో అధికార పగ్గాలు చేపట్టింది. తొలుత కాంగ్రెస్, తర్వాత వామపక్షాలు, అనంతరం తృణమూల్ కాంగ్రెస్ (టీఎమ్‌సీ) పరిపాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైంది. ప్రధానంగా నాలుగు దశాబ్దాలకుపైగా వామపక్షాలు, టీఎమ్‌సీ ఒంటెత్తు పోకడలతో పశ్చిమ బెంగాల్ ఆర్థికంగా కుదేలైంది. ముఖ్యంగా తృణమూల్ పదిహేనేళ్ల పాలనలో శాంతి భద్రతలు క్షీణించడంతో పాటు, నిరుద్యోగం పెరిగిపోవడం, దౌర్జన్యాలకు బెదిరి పెట్టుబడులు, కంపెనీలు రాకపోవడంతో కొత్తగా ఏర్పడిన బీజేపీ ప్రభుత్వంపై రాష్ట్ర అభివృద్ధి గురుతర బాధ్యత పెరిగింది.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడంతో పాటు శాసనసభ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చాల్సిన బాధ్యత కూడా బీజేపీ ముఖ్యమంత్రి సువేందు అధికారి భుజస్కంధాలపై ఉంది. ఈ నేపథ్యంలో తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ పాలనలో పట్టాలు తప్పిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.4.39 లక్షల కోట్ల వార్షిక బడ్జెట్‌ను పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ తొలి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అన్ని రంగాలకు ప్రాధాన్యతిస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి స్వపన్ దాస్‌గుప్తా సమర్పించిన వార్షిక బడ్జెట్‌తో రాష్ట్రానికి తాత్కాలిక ఉపశమనం కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతాయని ప్రజలు విశ్వసిస్తున్నారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాలే అధికారంలో ఉండడంతో డబుల్ ఇంజిన్ సర్కార్ తోడ్పాటుతో పశ్చిమబెంగాల్ వేగవంతంగా అభివృద్ధి సాధించే అవకాశాలున్నాయి.

పశ్చిమ బెంగాల్ 2026 అసెంబ్లీ ఎన్నికల అనంతరం బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌ను దేశవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక, పరిపాలనా వర్గాలు ఆసక్తిగా గమనించాయి. కొత్త ప్రభుత్వం ప్రవేశపెట్టే తొలి బడ్జెట్‌ను కేవలం ఆదాయ, వ్యయాల లెక్కల పత్రంగానే కాకుండా, ఎన్నికల సమయంలో వారు ప్రజలకిచ్చిన హామీలను ఎంతవరకు నెరవేరుస్తున్నారో విశ్లేషిస్తారు. అందుకే ఈ బడ్జెట్‌ను కేవలం గణాంకాలతోనే కాకుండా, బీజేపీ ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన మేనిఫెస్టో "భరోషార్ షపథ్ సంకల్ప పత్రం" హామీల అమలు కోణంలో కూడా ఉంది. పదిహేనేళ్లుగా రాజకీయ ఆధిపత్యంతో రాష్ట్ర అభివృద్ధి మందగించింది. సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేస్తున్నట్టు మమతా బెనర్జీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించుకున్నా, అర్హులకు అందకపోవడంతో అసంతృప్తి నెలకొంది. మరోవైపు పారిశ్రామిక పెట్టుబడుల కొరత, తయారీ రంగం మందగమనం, యువతలో పెరుగుతున్న నిరుద్యోగం, భారీ అప్పుల భారం వంటి సమస్యలు కూడా రాష్ట్రంలో అంతే తీవ్రంగా పెరిగాయి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై అప్పుల భారం లక్షల కోట్ల రూపాయలకు చేరుకోవడం, ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో గణనీయమైన భాగం వడ్డీలు, అప్పుల చెల్లింపులకే వెచ్చించాల్సి రావడం వల్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధులు, వనరులు అందుబాటులో లేకుండా పోయాయి.

ఈ నేపథ్యంలో 2026 ఎన్నికల సమయంలో బీజేపీ విడుదల చేసిన సంకల్ప పత్రం కేవలం రాజకీయ ప్రకటన కాకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించేందుకు ఒక ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాగా ప్రజలకు కనిపించింది. రాష్ట్రంలో మహిళల సంక్షేమం, యువతకు ఉపాధి, వ్యవసాయాభివృద్ధి, పరిశ్రమలకు ప్రోత్సాహం, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ఆధునిక సాంకేతిక రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణ, ఉత్తర బెంగాల్‌కు ప్రత్యేక అభివృద్ధి, అవినీతి నిర్మూలన, సులభ వ్యాపార వాతావరణం వంటి అంశాలకు ఆ ప్రణాళికలో ప్రాధాన్యతిచ్చారు. ఇప్పుడు ప్రవేశపెట్టిన తొలి పూర్తి బడ్జెట్‌ను పరిశీలిస్తే ఆ హామీల్లో గణనీయమైన భాగానికి ప్రభుత్వం ఆర్థిక కేటాయింపులు చేయడానికి ప్రయత్నించినట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

ఈ బడ్జెట్‌లో అత్యంత ఆసక్తికరమైంది లక్ష ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ. ఎన్నికల ప్రచారంలో బీజేపీ యువతకు ఉపాధి కల్పనను ప్రధాన హామీగా ప్రకటించింది. రాష్ట్రంలోని పాఠశాలలు, పోలీసు శాఖ, ఆరోగ్య శాఖ, స్థానిక సంస్థలు, ఇతర ప్రభుత్వ విభాగాల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేస్తామని పేర్కొంది. ఇప్పుడు బడ్జెట్‌లో లక్ష ఉద్యోగాలను ప్రకటించడం ద్వారా ఆ హామీ అమలు దిశగా తొలి అడుగు వేసినట్లు ప్రభుత్వం స్పష్టమైన సంకేతం ఇచ్చింది. యువతకు ఉపాధి కల్పనతో పాటు, ఉద్యోగం దొరికే వరకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక సహాయ కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం ప్రకటించింది. బీజేపీ ఎన్నికల ప్రణాళికలోని ప్రధాన హామీల్లో ఇది ఒకటి. యువత ఉపాధి కోసం పారిశ్రామిక పెట్టుబడులు పెరిగి, ప్రైవేట్ రంగంలో భారీ స్థాయిలో ఉద్యోగాలు సృష్టి అయితేనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని భావించిన బీజేపీ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో సంక్షేమంతో పాటు పెట్టుబడులపై కూడా సమాన దృష్టి పెట్టడం గమనార్హం.

గత రెండు దశాబ్దాలుగా పారిశ్రామిక పెట్టుబడుల విషయంలో కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాలతో పోలిస్తే

పశ్చిమ బెంగాల్ వెనుకబడిందనే అభిప్రాయం ఉంది. దీనిని మార్చేందుకు ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం "రూ.5,000 కోట్ల పెట్టుబడి ప్రోత్సాహక నిధిని" ఏర్పాటు చేసింది. అలాగే ఏఐ డేటా సెంటర్లు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, సెమీకండక్టర్ అనుబంధ పరిశ్రమలు, అధునాతన సేవారంగాలకు ప్రత్యేక ప్రోత్సాహక విధానాలను ప్రకటించింది. సింగిల్ విండో క్లియరెన్స్, 24గంటల వ్యాపార అనుమతులు, పెట్టుబడిదారులకు అనుకూలమైన పారిశ్రామిక విధానాల ద్వారా రాష్ట్రాన్ని తూర్పు భారతదేశంలో అతిపెద్ద పెట్టుబడి కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

ముఖ్యమైన ఎన్నికల హామీ "సిండికేట్ రాజ్" నిర్మూలన. పరిశ్రమలు, రియల్ ఎస్టేట్, చిన్న

పశ్చిమ బెంగాల్ బడ్జెట్

మహిళా సాధికారత ఈ బడ్జెట్‌లో అత్యంత ప్రధానమైన అంశంగా నిలిచింది. మహిళలకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం అందిస్తామని, కుటుంబాల ఆర్థిక భద్రతను పెంచే ప్రత్యేక పథకాలను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో బీజేపీ ప్రకటించింది. బడ్జెట్‌లో 'అన్నపూర్ణ యోజన'కు రూ.36,000 కోట్ల భారీ కేటాయింపు చేయడం అంటే, ఆ హామీకి ఆర్థిక రూపం ఇచ్చినట్లే. ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం కరవు భత్యం (డీఏ) పెంపు ప్రకటించడం కూడా ఎన్నికలలో ఇచ్చిన హామీ నెరవేర్చడమే.

వ్యాపారాలపై స్థానిక స్థాయిలో ఏర్పడిన అక్రమ వసూళ్ల వ్యవస్థను పూర్తిగా తొలగిస్తామని బీజేపీ సంకల్ప పత్రంలో పేర్కొంది. ఈ బడ్జెట్‌లో పెట్టుబడుల ప్రోత్సాహంతో పాటు వ్యాపార నిర్వహణను సులభతరం చేసే చర్యలు, పరిశ్రమలకు వేగవంతమైన అనుమతులు, పెట్టుబడిదారులకు అనుకూలమైన పరిపాలనా విధానాలు తీసుకువస్తామని ప్రకటించిన ప్రభుత్వం, అక్రమాలకు చెక్ పెట్టేందుకు నడుం బిగించడంతో దళారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

ఎన్నికల సందర్భంగా భారతీయ జనతా పార్టీ

ఇచ్చిన మరో కీలక హామీ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం. వ్యవసాయ, అనుబంధ రంగాలకు బడ్జెట్‌లో సుమారు రూ.24,000 కోట్ల కేటాయింపుతో ప్రాధాన్యం కల్పించారు. సాగునీటి విస్తరణ, గ్రామీణ మౌలిక సదుపాయాలు, ఆహార ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజ్‌లు, మార్కెట్ అనుసంధానం వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోని చిన్న, సన్నకారు రైతులకు కేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటు అదనపు ఆర్థిక భరోసా కల్పిస్తామని సంకల్ప పత్రంలో పేర్కొంది. రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయ మౌలిక వసతులను అభివృద్ధి చేయడం, నీటి పారుదల సదుపాయాలను విస్తరించడం, నిల్వ గిడ్డంగులు, శీతలీకరణ కేంద్రాలను ఏర్పాటు చేయడం వంటి అంశాలను కూడా ప్రధానంగా ప్రకటించింది. బడ్జెట్‌లో గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, సాగునీటి సదుపాయాల విస్తరణ, రైతులకు మార్కెట్ అనుసంధానం, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రోత్సాహం వంటి అంశాలకు కేటాయింపులు చేయడం ద్వారా ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పరోక్షంగా బలోపేతం చేసే వ్యూహాన్ని అనుసరించింది.

మహిళా సాధికారత ఈ బడ్జెట్‌లో అత్యంత ప్రధానమైన అంశంగా నిలిచింది. మహిళలకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం అందిస్తామని, కుటుంబాల ఆర్థిక భద్రతను పెంచే ప్రత్యేక పథకాలను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో బీజేపీ ప్రకటించింది. బడ్జెట్‌లో 'అన్నపూర్ణ యోజన'కు రూ. 36,000 కోట్ల భారీ కేటాయింపు చేయడం అంటే, ఆ హామీకి ఆర్థిక రూపం ఇచ్చినట్లే. ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం కరవుభత్యం (డీఏ) పెంపు ప్రకటించడం కూడా ఎన్నికలలో ఇచ్చిన హామీ నెరవేర్చడమే. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా డీఏ సమస్యను పరిష్కరిస్తామని, వేతన వ్యవస్థలో ఉన్న అసమానతలను తొలగిస్తామని బీజేపీ తన సంకల్ప పత్రంలో హామీ ఇచ్చింది.

విద్యా రంగం విషయానికొస్తే, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ, మౌలిక వసతుల అభివృద్ధి, ఉన్నత విద్యలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. విద్య, క్రీడలు, కళలు, సాంస్కృతిక రంగాలకు కలిపి సుమారు రూ. 50 వేల కోట్లకు బడ్జెట్ కేటాయింపుతో ప్రాధాన్యం కల్పించడం ద్వారా మానవవనరుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు స్పష్టమవుతోంది. కొత్త స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా క్రీడలను ఉపాధి అవకాశాలతో అనుసంధానించే ప్రయత్నం చేసింది.

మౌలిక సదుపాయాల అభివృద్ధిని ప్రభుత్వం దీర్ఘకాలిక పెట్టుబడిగా పరిగణించినట్లు బడ్జెట్ ద్వారా తెలుస్తోంది. చింగ్రీఘాట్–న్యూటౌన్ మధ్య రూ. 900 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్, కల్యాణిలో కొత్త విమానాశ్రయం, పురూలియా, మాల్దా, బలూర్‌ఘాట్‌లలో విమానాశ్రయాల అభివృద్ధి, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్ నెట్‌వర్క్ బలోపేతం వంటి కార్యక్రమాలు రాష్ట్ర పారిశ్రామికీకరణకు కొత్త ఊపు తీసుకురానున్నాయి. ముఖ్యంగా ఉత్తర బెంగాల్ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది. డార్జిలింగ్, కాలింపాంగ్, జల్పాయిగురి, అలీపుర్‌దువార్, కూచ్‌బెహార్, ఉత్తర–దక్షిణ దినాజ్‌పూర్, మాల్దా జిల్లాలను సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికను ప్రకటించింది. పర్యాటకం, టీ పరిశ్రమ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, రహదారులు, లాజిస్టిక్స్, విమానాశ్రయాల అభివృద్ధి, సరిహద్దు ప్రాంతాల మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. బడ్జెట్‌లో ఉత్తర బెంగాల్ అభివృద్ధిని ప్రత్యేక ప్రాధాన్య రంగంగా ప్రకటించడాన్ని ప్రాంతీయ సమతుల్య అభివృద్ధి హామీ అమలుకు తొలి అడుగుగా భావించవచ్చు.

మొత్తంగా చూస్తే రూ. 4.39 లక్షల కోట్ల బడ్జెట్‌లో మహిళల సంక్షేమానికి రూ. 36,000 కోట్లు, పెట్టుబడుల ప్రోత్సాహానికి రూ. 5,000 కోట్లు, లక్ష ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, మౌలిక సదుపాయాల కోసం భారీ ప్రాజెక్టులు, విద్యా రంగానికి రూ. 50 వేల కోట్లకు పైగా వ్యయప్రాధాన్యం, వ్యవసాయానికి రూ. 24 వేల కోట్లకుపైగా కేటాయింపులు వంటి చర్యల ద్వారా ఎన్నికల సమయంలో ప్రకటించిన "భరోషేర్ షపథ్–సంకల్ప పత్ర్"లోని ప్రధాన హామీల అమలు దిశగా తొలి బడ్జెట్‌లోనే బీజేపీ ప్రభుత్వం స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు కనిపిస్తోంది.

పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తొలి పూర్తి స్థాయి బడ్జెట్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా ఉంది. ఉపాధి, మహిళా సంక్షేమం, వ్యవసాయం, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించిన ఈ బడ్జెట్ రాష్ట్ర ఆర్థిక పునరుద్ధరణకు, సమగ్ర అభివృద్ధికి పునాదివేస్తూ అన్ని రంగాల్లో పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి తోడ్పడగలదనే ఆశలు కలిగిస్తోంది.

– శ్రీపాద

జొన్నగిరితో 'సీమ'లో సువ

కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ రంగ బంగారుగనిగా చారిత్రాత్మక మైలురాయిని లిఖించింది. ఈ ప్రాజెక్టును జియో మైసూరు, డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థలు రూ. 405 కోట్ల పెట్టుబడితో సంయుక్తంగా చేపట్టాయి. ఈ ప్రాంతపు పురాతన స్వర్ణ వైభవాన్ని పునరుద్ధరించే దిశగా అడుగులు వేస్తూ దీనికి "జేజీఎఫ్" (జియో మైసూరు గోల్డ్ ఫీల్డ్స్) అనే పేరును సార్థకం చేశాయి. ఈ గని ద్వారా ఏడాదికి టన్ను బంగారం ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనివల్ల మన దేశం విదేశీ దిగుమతులపై ఆధారపడటం గణనీయంగా తగ్గుతుంది. దేశీయ ఉత్పత్తిని పెంచడమే కాకుండా, రాష్ట్రానికి భారీగా రాయల్టీని సమకూరుస్తూ, వేలాది మంది స్థానికులకు ఉపాధి అవకాశాలు సృష్టిస్తూ ఈ అద్భుతమైన ఆర్థిక వృద్ధికి బాటలు వేస్తుంది.

జొన్నగిరి ఒకప్పుడు సువర్ణగిరిగా ప్రసిద్ధమైన ప్రాంతం. శతాబ్దాల నాటి బంగారు నిక్షేపాలు ఈ నేలలో ఉన్నాయని చారిత్రక ఆధారాలు చెప్తున్నాయి. అశోక చక్రవర్తి పాలన నాటి నుంచే ఇక్కడ బంగారు తవ్వకాలు నిర్వహించారని పరిశోధకులు నిర్ధారించారు. బ్రిటిష్ పాలనలో ఈ ప్రాంతంలో ఖనిజ అన్వేషణ జరిగింది. దశాబ్దాల మౌనం తర్వాత, ఇప్పుడు ఈ నేల మళ్లీ బంగారు వైభవాన్ని నలుదిశలా చాటనున్నది.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూన్ 24, 2026న జొన్నగిరిలో గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించారు. ఇది రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో మరపురాని ఘడియగా పేర్కొనవచ్చు. 'ఒకప్పుడు కేజీఎఫ్, ఇప్పుడు జేజీఎఫ్' అని ముఖ్యమంత్రి అన్న మాటలు ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను చాటి చెప్తున్నాయి. రాయలసీమను రత్నాలసీమగా మార్చేందుకు ఇదే నాందిగా నిలుస్తుందని ఆయన ప్రకటించారు. రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పారిశ్రామిక శాఖ మంత్రి టీజీ భరత్ తదితరులు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

ప్రాజెక్టు విస్తీర్ణం

జొన్నగిరి, పగిడిరాయి, బొల్లవానిపల్లె, ఎర్రగుడి గ్రామాల పరిధిలో సుమారు 598 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు విస్తరించి ఉంది. 1,200 ఎకరాల భూమిని లీజుగా, 300 ఎకరాలను పూర్తిగా కొనుగోలు చేసి ఓపెన్ కాస్ట్ మైనింగ్ కోసం సిద్ధం చేశారు. 2000 సంవత్సరం నుంచి పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఇక్కడ అన్వేషణ జరిపాయి. 2012లో జియో మైసూరు కంపెనీ ఆధ్వర్యంలో ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయి. దాదాపు నాలుగు దశాబ్దాల కలను సాకారం చేసుకుంటూ జియో మైసూరు సర్వీసెస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థలు కలిసి రూ. 405 కోట్ల పెట్టుబడి పెట్టాయి.

దేశంలోనే తొలి ప్రైవేటు బంగారు గని

దేశంలోనే తొలి ప్రైవేటు రంగ బంగారు గని కావడం ఈ ప్రాజెక్టు ప్రాముఖ్యత. ఇప్పటి వరకు దేశంలో ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలోనే బంగారు తవ్వకాలు జరిగాయి. కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ ఒకప్పుడు దేశంలో ప్రసిద్ధి పొందిన బంగారు గని. ఆ సంస్థ 2001లో మూతపడిన తర్వాత దేశీయ బంగారు ఉత్పత్తి నిలిచిపోయింది. ఇప్పుడు జొన్నగిరిలో జేజీఎఫ్ ప్రారంభంతో మరో అవకాశం లభించినట్లయింది.

ఉత్పత్తి వివరాలు, భవిష్యత్తు లక్ష్యాలు

ప్రయోగాత్మక దశలో ఇప్పటికే 40 నుంచి 60

డిజైనర్ కావలెను

జాగృతి వారపత్రికలో పనిచేయుటకు గ్రాఫిక్ డిజైనర్ కావాలి. ఫోటో షాప్, పేజీ మేకర్‌లో పేజీలు డిజైన్ చేసిన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం. తెలుగు టైపింగ్ వచ్చి ఉండాలి. డిగ్రీ/ఇంటర్మీడియట్ పాసైనవారు అర్హులు. ఎంపికైన అభ్యర్థి హైదరాబాద్‌లోని కాచిగూడలో గల మా కార్యాలయంలో పనిచేయాల్సి ఉంటుంది. జీతం: రూ.16,000/- నుంచి రూ.20,000/- (ప్రతిభను బట్టి). ఆసక్తి గల అభ్యర్థులు jagritiweekly@gmail.com కు పూర్తి బయోడేటాను పంపించండి. వివరాలకు: 9959991304

ర్ణాధ్యాయం

కిలోల బంగారాన్ని వెలికితీశారు. 1.5 టన్నుల మట్టిని శుద్ధి చేస్తే ఒక గ్రాము బంగారం లభిస్తుంది. రోజువారీ ఉత్పత్తి సుమారు ఒక కిలో మూడు గ్రాముల స్థాయిలో ఉన్నది. తొలి దశలో ఏడాదికి 400 కిలోల బంగారం ఉత్పత్తిని లక్ష్యంగా నిర్ణయించారు. రెండో దశలో దీనిని టన్నుకు పెంచుతారు. పూర్తిస్థాయి ఉత్పత్తి సాధించిన తర్వాత ఏడాదికి రెండు టన్నులు ఉత్పత్తి చేయాలనేది ఆ సంస్థ లక్ష్యం. రెండో యూనిట్ నిర్మాణం పూర్తయిన తర్వాత 50 టన్నుల ఉత్పత్తి సాధించవచ్చని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ గని కనీసం 15 ఏళ్ల పాటు నిరంతరంగా ఉత్పత్తి కొనసాగించగలదని అంచనా. బంగారాన్ని శుద్ధి చేసేందుకు హంద్రీనీవా కాలువ నుంచి 20 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా ఏర్పాటు చేశారు.

ఉపాధి, ఆర్థిక ప్రయోజనాలు

ప్రస్తుతం సుమారు 800 మంది ఈ ప్రాజెక్టులో పని చేస్తున్నారు. వారిలో 80 శాతం మంది స్థానికులే కావడం విశేషం. త్వరలో మరో 1,500 మందికి ఉపాధి కల్పించనున్నారు. భవిష్యత్తులో 5 వేల మందికి జేజీఎఫ్‌లో ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. భూములు అందించిన రైతు కుటుంబాలకు నేరుగా ఉపాధి కల్పించడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. మైనింగ్ ప్రాంతంలో భారీ వాహనాలు నడిపేందుకు సిమ్యులేటర్ యంత్రాలపై స్థానిక మహిళలకు, యువతకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ కేంద్రాన్ని ముఖ్యమంత్రి స్వయంగా సందర్శించి అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ ప్రాజెక్టు ద్వారా బంగారు విలువపై 4 శాతం రాయల్టీ లభిస్తుంది. తొలి ఏడాదిలోనే సుమారు రూ. 57 కోట్ల రాయల్టీ ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

మార్కెట్‌లో జొన్నగిరి బంగారానికి ఆదరణ

జియో మైసూరు కంపెనీ ఉత్పత్తి చేసిన జేఎఫ్

సింబల్‌తో కూడిన బంగారు బిస్కట్‌కు మార్కెట్‌లో విపరీతమైన ఆదరణ నమోదవుతున్నది. 50,100, 500 గ్రాముల ప్యాకెట్లలో అందుబాటులో ఉన్న ఈ బంగారంలో తొలి 500 గ్రాముల 24 క్యారెట్ ముక్కను కర్నూలుకు చెందిన జ్యువెలరీ వ్యాపారి జగదీష్ కొనుగోలు చేశారు.

ముఖ్యమంత్రి స్వయంగా ఆ బంగారు ముక్కను ఆయనకు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ మ్యాప్‌తో అలంకరించిన ఈ బంగారు బిస్కట్ వ్యాపారుల్లో భారీ ఉత్సాహాన్ని రేకెత్తిస్తున్నది. విదేశాల నుంచి బంగారం దిగుమతికి అయ్యే ఇబ్బందులకు ఇది పరిష్కారం చూపుతుందని వ్యాపారులు భావిస్తున్నారు. దేశం ఏటా 800 నుంచి 1,000 టన్నుల బంగారాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో, జొన్నగిరి ఉత్పత్తి ఆ భారాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషించగలదని భావించవచ్చు.

కుప్పం పరిధిలో కొత్త అడుగులు

జొన్నగిరి స్ఫూర్తితో రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లోనూ ఖనిజ అన్వేషణ మొదలైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోని గుడుపల్లి మండలంలో చిగురుగుంట, బిసానతం గ్రామాల వద్ద దశాబ్దాల నాటి బంగారు నిక్షేపాలు ఉన్నాయని 1970 దశకంలోనే నిర్ధారణ అయింది. మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్వేషణలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. 1982లో భారత్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ ఈ గనులను కొనుగోలు చేసి 2001 వరకు నిర్వహించింది. ఆర్థిక నష్టాల కారణంగా ఆ గనులకు లాక్‌అవుట్ ప్రకటించే నాటికి వెయ్యి మందికి పైగా కార్మికులు పని చేస్తుండేవారు.

మూడేళ్ల క్రితం నిర్వహించిన టెండర్లలో ఎన్ఎండీసీ రూ. 500 కోట్లకు ఈ గనులను సొంతం చేసుకున్నది. జొన్నగిరిలోని జియో మైసూరు సంస్థ 260 హెక్టార్ల భూమిలో నిర్వహించిన సర్వేలో టన్నుకు 5.5 గ్రాముల బంగారు సాంద్రత ఉన్నట్లు నిర్ధారించింది. అయితే సాంకేతిక సమస్యలు, టెండర్ల ప్రక్రియలో ఎదురైన ఆటంకాల కారణంగా రెండుసార్లు పని వాయిదా పడింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొత్త ఉత్సాహంతో మూడోసారి టెండర్ ప్రక్రియ చేపట్టింది. జులై 9వ తేదీని తుది గడువుగా పేర్కొంటూ టెండర్లు జారీ చేశారు. స్థానిక భూవివాదాలను కూడా అధికారులు పరిష్కరించారు. దీంతో 2వేలమంది కార్మికులు, మరో వెయ్యి మంది నిపుణులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

రాష్ట్ర ఆదాయ పెంపు, ఉపాధి కల్పన, పారిశ్రామిక అభివృద్ధి...ఇవన్నీ ఒకే ప్రాజెక్టు ద్వారా సాధించడం రాయలసీమ చరిత్రలో నిజంగా సువర్ణాధ్యాయమే. అంతర్జాతీయ స్థాయిలో కూడా జొన్నగిరి పేరు వినిపించే అవకాశం ఉందని నిపుణులు చెప్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఖనిజ రంగంలో అంతర్జాతీయ గుర్తింపు లభించడమే కాకుండా, భవిష్యత్తులో మరిన్ని విదేశీ పెట్టుబడులు ఆకర్షించే అవకాశాలు కూడా పెరుగుతాయి. 'రాయలు ఏలిన సీమ రత్నాల సీమ' అనే పాట మాటల్లోని కవి స్వప్నం ఇప్పుడు నిజమవుతోంది.

తురగా నాగభూషణం
సీనియర్ జర్నలిస్ట్

వర్ష బీభత్సంలో

ఒకప్పుడు భాగ్యనగరంలో వర్షం అంటే చల్లని గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం, ఉక్కపోత నుంచి ఉపశమనం ఉండేవి. ఇప్పుడు మాత్రం వర్షం మాట వినగానే, ఆకాశంలో మేఘాలు కనిపించగానే నగరవాసుల గుండెల్లో గుబులు మొదలవుతోంది. ఇంటి నుంచి బయటకు వెళితే ఎక్కడ ట్రాఫిక్‌లో చిక్కుకుంటామో, రోడ్డుపై నీటిలో ఇరుక్కుపోతామో, ఇంటికి సురక్షితంగా చేరతామో లేదో, కరెంటు తీగలు ఎక్కడైనా తెగిపడి ప్రాణాలు తీస్తాయేమో అన్న భయం వెంటాడుతోంది. ఇళ్లలోకి వర్షం నీరు చేరుతుందేమో, విద్యుత్ సరఫరా నిలిచిపోతుందేమో అన్న ఆందోళన కూడా ఆవహిస్తోంది.

వర్షం ప్రకృతి ధర్మం, వరం. ప్రకృతి తన పని తాను చేస్తోంది. కానీ, హైదరాబాద్‌కు మాత్రం పరీక్షగా మారుతోంది. ఆ పరీక్షలో వైఫల్యానికి కారణం ప్రకృతి కాదు...మహానగర పాలనా వ్యవస్థ పనితీరు, ప్రభుత్వ యంత్రాంగం ప్రణాళికా లోపంగా చెప్పుకోవచ్చు. వర్షం కురిసినప్పుడల్లా ట్రాఫిక్ స్తంభన, కాలనీల ముంపు, నాలాలు పొంగిపొర్లడం, రహదారులపై నీరు నిలవడం, విద్యుత్ సరఫరాకు అంతరాయం, విద్యుదాఘాతాలతో ప్రాణాలు కోల్పోవడం.. వంటివి సర్వ సాధారణమయ్యాయి. ప్రతి వర్షాకాలంలో ఎదురువుతున్న ఆ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వ యంత్రాంగం, పాలకులు చేస్తున్న ప్రయత్నాలు శూన్యమనే చెప్పాలి..

మౌలిక సదుపాయాలపై లేని దృష్టి

హైదరాబాద్ దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటిగా నిలుస్తోంది. ఐటీ రంగం భారీగా విస్తరించింది. కొత్త కాలనీలు, భారీ అపార్ట్ మెంట్లు, ఐటీ కారిడార్లు, వాణిజ్య సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీలు నగర రూపురేఖలను మార్చేస్తున్నాయి. నగరం నలువైపులా విస్తరిస్తోంది. జనాభా నానాటికీ పెరుగుతోంది. దానికి తగినట్లే వాహనాల సంఖ్య పెరుగుతోంది. కానీ అందుకు తగినట్లు నాలాలు, డ్రైనేజీ వ్యవస్థలు,రహదారులు, పార్కింగ్ సదుపాయాలు లేవు. ఒక్కో కుటుంబానికి రెండు, మూడు కార్లు ఉండటం ఇప్పుడు సాధారణ విషయమైంది. అయితే ఆ స్థాయిలో రోడ్ల విస్తరణ జరగలేదు. ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులోకి రాలేదు. అక్రమ పార్కింగ్‌లు రహదారులను మరింత ఇరుకుగా మార్చేశాయి. ఫలితంగా కొద్దిసేపు వర్షం కురిసినా నగరం మొత్తం ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకు పోతోంది. ప్రత్యేకంగా మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, కొండాపూర్, కోకాపేట వంటి ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో వేలాది వాహనాలు ఒకేసారి రోడ్డెక్కుతున్నాయి.

నగరంలో కొత్త వాణిజ్య సముదాయాలకు, భారీ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంలో ఏ మాత్రం వెనుకాడని ప్రభుత్వం, అందుకు అనుగుణంగా డ్రైనేజీ, రోడ్లు, పార్కింగ్, వర్షపు నీటి పారుదల వ్యవస్థలను ముందుగానే అభివృద్ధి చేయాలనే ప్రణాళికను అమలు లేదు. ఫలితంగా ఒక మోస్తరు వర్షానికి ప్రధాన రహదారులు నిమిషాల్లోనే ట్రాఫిక్ జామ్‌గా మారిపోతున్నాయి.

వర్షంతో నరకం

రహదారులపై నీరు నిలవడం, వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోవడం, గంటల తరబడి ట్రాఫిక్ కదలకపోవడం ఇప్పుడు సాధారణ దృశ్యంగా మారిపోయింది. ఇది కేవలం వాహనాల సంఖ్య పెరగుదల వల్లే కాదని, వర్షపు నీరు వేగంగా వెళ్లిపోయేలా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడమే ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. నగరంలోని చాలా ప్రాంతాల్లో నాలాలు పూడుకుపోయాయి. మరికొన్ని చోట్ల ఆక్రమణలకు గురయ్యాయి.ఫలితంగా నీరు రోడ్లపైనే నిలిచిపోతోంది.వర్షపు నీరు గంటల తరబడి, ఒక్కోసారి రోజుల తరబడి నిలిచేపోయే సందర్భాలు ఉన్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త డ్రైనేజీల్లో పేరుకు పోవడం కూడా పరిస్థితిని మరింత దిగజారుస్తోంది. వ్యర్థాల నిర్వహణను సమర్థ వంతంగా అమలు చేయడంలో ప్రభుత్వం ఉదాసీనంగా ఉంటోందనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. రూ.వందల కోట్లు వెచ్చించి ఫ్లైఓవర్లు, ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తున్న ప్రభుత్వం, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణకు అంత ప్రాధాన్యం ఇవ్వడం లేదనే విమర్శలు ఉన్నాయి.ఏటా వర్షాకాలానికి ముందు నాలాల పూడికతీత, డ్రైనేజీ శుభ్రపరిచే పనులు జరుగుతున్నాయని అధికారులు చేస్తున్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు.

కూల్చివేతల ప్రభావం ఎక్కువగా పేదలు, మధ్యతరగతి ప్రజలపైనే పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రముఖులు, రాజకీయ నాయకులు, ఆర్థికంగా బలమైన వర్గాలకు చెందిన వారి అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలు ఉండవా? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. అంతేకాదు... కూల్చివేతల తర్వాత ఆ ప్రాంతాల్లో నాలాలను విస్తరించారా? డ్రైనేజీ సామర్థ్యాన్ని పెంచారా? వర్షపు నీటిపారుదల వ్యవస్థను ఆధునీకరించారా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేవు.

యమపాశాలుగా విద్యుత్ తీగలు

వర్షాకాలంలో ట్రాఫిక్ సమస్యలు ఎంత తీవ్రమో, విద్యుత్ వ్యవస్థ కూడా ప్రజలకు అంతే పెద్ద ముప్పుగా మారుతోంది. ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగిపోవడం, స్తంభాలు ఒరిగిపోవడం, నీటిలో విద్యుత్ ప్రవహించడం వంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఫలితంగా ఏటా ప్రాణనష్టం జరుగుతోంది. బండ్లగూడలో ఈ ఏడాది తొలివర్షం పడిన రోజే జరిగిన ఘటన ఇందుకు

భాగ్యనగరం

విషాద ఉదాహరణ. ఆటో దిగిన ఇద్దరు యువకులు రోడ్డుపై పడివున్న విద్యుత్ తీగను గుర్తించలేక అడుగు పెట్టేపెట్టగానే ప్రాణాలు కోల్పోయారు. విద్యుత్ స్తంభంలో లోపాల గురించి స్థానికులు అంతకు ముందే ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. అల్వాల్‌లో ఒక ఇంటి ముందు ఉన్న చెట్టు కొమ్మలు కారుపై పడిపోగా వాటిని తొలగించే ప్రయత్నంలో దానిపై పడి ఉన్న విద్యుత్ తగిలి తండ్రీ కుమార్తె మరణించారు. భార్య తీవ్ర గాయాలతో బయటపడినా, కళ్లముందే భర్త, కుమార్తెను కోల్పోయిన విషాదం ఆమెను అచేతనంగా మార్చింది.

ఇలాంటి ప్రమాదాల సమయంలో వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సిన రక్షణ వ్యవస్థలు ఎందుకు పనిచేయడం లేదన్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం లేదు. ప్రమాదం జరిగిన తర్వాత అధికారులు సమీక్షలు నిర్వహించడం, విచారం ప్రకటించడం తప్ప ముందస్తు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. విద్యుత్ తీగ తెగి నేలపై పడిన వెంటనే రిలే ప్రొటెక్షన్ వ్యవస్థ పనిచేసి సరఫరా నిలిచిపోవాల్సి ఉండగా ఎందుకు జరగలేదు? కోట్లాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన భద్రతా వ్యవస్థల నిర్వహణలో లోపాలున్నాయా? అన్న ప్రశ్నలకు జవాబులు చెప్పేవాళ్లు లేరు.

హైడ్రా... ప్రగతి ఎక్కడ?

హైదరాబాద్‌లో వర్షాలు, ముంపు సమస్యలకు ప్రధాన కారణాల్లో ఒకటిగా చెరువులు, నాలాల ఆక్రమణలను ప్రభుత్వం గుర్తించి వాటిని తొలగించడానికే హైడ్రా అనే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేసింది. ఆ వ్యవస్థ ఏర్పడిన తర్వాత అనేక అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. చెరువులు, నాలాల పక్కన ఉన్న భవనాలు నేలమట్టం చేశారు. కానీ, ప్రతి వర్షం తర్వాత నగరంలో కనిపిస్తున్న దృశ్యాలు మాత్రం మారలేదు. అసలు హైడ్రా చర్యలు వరద ముప్పును తగ్గించడానికేనా? లేక కేవలం కూల్చివేతలకే పరిమితమయ్యాయా? అనే ప్రశ్న తలెత్తుతోంది. కూల్చివేతల ప్రభావం ఎక్కువగా పేదలు, మధ్యతరగతి ప్రజలపైనే పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు.. ప్రముఖులు, రాజకీయ నాయకులు, ఆర్థికంగా బలమైన వర్గాలకు చెందిన వారి అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలు ఉండవా? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. అంతేకాదు... కూల్చివేతల తర్వాత ఆ ప్రాంతాల్లో నాలాలను విస్తరించారా? డ్రైనేజీ సామర్థ్యాన్ని పెంచారా? వర్షపు నీటి పారుదల వ్యవస్థను ఆధునీకరించారా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేవు. వాస్తవానికి నాలాల ఆక్రమణలు ఒక్కరోజులో జరిగినవి కావు. దశాబ్దాలుగా పాలించిన ప్రభుత్వాలన్నీ ఈ సమస్యను పూర్తిగా అరికట్టలేకపోయాయి. నిర్మాణ అనుమతుల విషయంలోనూ, చెరువుల పరిరక్షణ విషయంలోనూ పాలనా వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కానీ, గత ప్రభుత్వాల తప్పులను చూపించడం మాత్రమే ప్రస్తుత ప్రభుత్వం పనిగా పెట్టుకుందన్న ఆరోపణలు వస్తున్నాయి.

ప్రభుత్వం మారినా తీరని సమస్యలు

ప్రభుత్వాలు మారుతున్నాయి. కానీ, వర్షం పడితే నగరం ఎదుర్కొనే కష్టాలు మాత్రం మారడం లేదు. ప్రతి ఏడాది పెద్ద ఎత్తున సమీక్షలు, హెచ్చరికలు, హామీలు, ప్రణాళికలు, ప్రకటనలు సర్వసాధారణంగా మారిపోయాయి. వర్షాకాలం ముగిసే వరకు అధికార యంత్రాంగం హడావిడి చేస్తూనే ఉంటుంది. ఆ తర్వాత అంతా షరా మామూలయిపోతుంది. వర్షాలు మొదలయ్యే ప్రతిసారీ అధికార యంత్రాంగం అప్రమత్తమైందని, కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామని, ప్రత్యేక బృందాలను రంగంలోకి దించామని ప్రకటనలు చేస్తుంటారు. ఇలా తాత్కాలిక చర్యలు కాదు, శాశ్వత పరిష్కారాలు అవసరం అని గుర్తించాల్సిన అవసరం ఉంది. నగరంలోని వరద ముంపు ప్రాంతాలను శాస్త్రీయంగా గుర్తించి ఆధునిక డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి, నీరు నిలిచే ప్రాంతాలలో అత్యాధునిక పంపింగ్ వ్యవస్థను శాశ్వత ప్రాతిపదికపై ఏర్పాటు, నాలాల పూడికతీతను వర్షాకాలానికి ముందే పూర్తి చేయడం, భారీ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే ముందు డ్రైనేజీ సామర్థ్యాన్ని తప్పనిసరిగా అంచనా వేయడం, అక్రమ పార్కింగ్‌లపై కఠిన చర్యలు తీసుకోవడం లాంటి వాటిని ప్రభుత్వం విస్మరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించేందుకు కార్యాలయాల పని వేళల్లో మార్పులు చేయాలంటూ ఆయా కంపెనీలకు ప్రతిపాదించడంతో పాటు.. భారీ వర్షాల సమయంలో 'వర్క్ ఫ్రమ్ హోమ్' వంటి ప్రత్యామ్నాయాలను ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉంది. అలాగే, కార్ పూలింగ్, మెట్రో, ఎంఎంటీఎస్, సిటీ బస్సుల వినియోగాన్ని పెంచే విధానాలు రూపొందించడం అత్యావశ్యకమని ప్రభుత్వం గ్రహించాలి. అన్నింటి కంటే ముఖ్యంగా విద్యుత్ వ్యవస్థలోని భద్రతా ప్రమాణాలను పూర్తిగా సమీక్షించడం, ప్రతి వర్షాకాలానికి ముందు రిలే ప్రొటెక్షన్ వ్యవస్థలు, ఫీడర్లు, విద్యుత్ స్తంభాలు, తీగల పరిస్థితిని పరిశీలించడం తప్పనిసరి చేయాల్సిన అవసరం ఉంది.

హైదరాబాద్‌కు వర్షం కొత్త కాదు. శాపం కూడా కాదు.. కానీ వర్షాన్ని ఎదుర్కొనే వ్యవస్థ లేకపోవడమే అసలు సమస్య. ప్రతి ఏడాది వర్షాలు వస్తూనే ఉంటాయి. ప్రతి ఏడాది ప్రజలు అదే భయంతో బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన అవసరం లేదు. ఒక ఆధునిక మహానగరం రెండు మూడు సెంటీమీటర్ల వర్షానికే స్తంభించిపోతుంటే, అది ప్రకృతి వైపరీత్యం కాదు... నగర ప్రణాళికలోని బలహీనతకు నిదర్శనం. వేగంగా విస్తరిస్తున్న మహానగరానికి తగ్గట్టుగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ప్రభుత్వం ప్రాథమిక బాధ్యతగా గుర్తించాల్సిన అవసరం ఉంది. భాగ్యనగరానికి వర్షం మళ్లీ హాయిని గుర్తు చేసే రోజులు రావాలంటే... మారాల్సింది కేవలం ప్రణాళికలు కాదు.. పాలనా వ్యవస్థ.

సుజాత గోపగోని
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

చరిత్ర పొడవునా... మరణమృదంగం

బాంగ్లాదేశ్ హిందువులపై ఎనిమిది దశాబ్దాలుగా కొనసాగుతున్న దాడులు పునరావృతమయ్యాయి. రాజధాని ఢాకాలో ఉద్రిక్త పరిస్థితులు మరోసారి నెలకొన్నాయి. ఉత్తర గాయిబంద జిల్లాలో శ్రీరాధాగోవింద దేవాలయ కమిటీ 81 అడుగుల శ్రీరాముడి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రంగంలోకి దిగింది. అయితే, ఉగ్రవాద అనుకూల ఇస్లామిక్ మూకల నుంచి బెదిరింపులు రావడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో గాయిబందాలో జరిగిన ఒక ప్రదర్శనలో దుండగులు శ్రీరాముడి చిత్రపటంపై కాళ్లు పెట్టి అగౌరవపరిచారు.

పలాస్ బరీలో సుమారు రూ.15కోట్ల 60లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఆలయం 80శాతం నిర్మాణం పూర్తి చేసుకుంది. 81 అడుగుల శ్రీరాముడి విగ్రహాన్ని, 50 అడుగుల కృష్ణుడి విగ్రహాన్ని, 30 అడుగుల శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సనాతన ధర్మానికి ప్రతీక అయిన శ్రీరాముడి విగ్రహాన్ని నిర్మించాలని రాధా గోవింద దేవాలయ కమిటీ చాలా కాలంగా శ్రమిస్తున్నది.

ఈ ఘటనపై హిందూ సమాజం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హిందూ మహాజోత్ పిలుపు మేరకు జూన్ 19న వేలాది మంది విద్యార్థులు, హిందూ ప్రతినిధులు భారీ ర్యాలీ నిర్వహించారు. తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని బీఎన్‌పీ ప్రభుత్వం మైనారిటీల రక్షణలో విఫలమైందని నిరసనకారులు మండిపడ్డారు.

నిందితులపై 72 గంటలలోపు చర్యలు తీసుకోక పోతే దేశవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఒకవేళ రాముడి విగ్రహ స్థాపనను పునఃప్రారంభించనివ్వకపోతే, బాంగ్లాదేశ్‌లోని 64 జిల్లాల్లో ఒక్కొక్కటిగా రామాలయాలను నిర్మిస్తామని హిందూ మహాజోత్ ప్రతిజ్ఞ చేసింది.

పరిస్థితి అదుపు తప్పుతుందని గ్రహించిన రాధాగోవింద దేవాలయ కమిటీ చివరకు ఆలయ నిర్మాణాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తామని కూడా ప్రకటించింది.

1971లో మొదలైన హిందువుల ఊచకోత నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంది. బాంగ్లా విముక్తి ఉద్యమ సమయంలో పాకిస్థాన్ సైన్యం, ఇస్లామిక్ మిలీషియా ఉమ్మడిగా హిందువులను అత్యంత దారుణంగా హతమార్చారు. చరిత్ర పొడవునా ఈ హత్యాకాండ దఫదఫాలుగా కొనసాగుతూనే ఉంది. అయోధ్య ఉద్యమ సమయంలో 1992లో బాంగ్లాదేశ్ వ్యాప్తంగా సుమారు 3వేల ఆలయాలు ధ్వంసమయ్యాయి. హిందువులపై దాడులు, ఆస్తుల దహనం యథేచ్ఛగా కొనసాగాయి. 2001లో పెద్ద ఎత్తున దాడులు, ఆస్తుల విధ్వంసం కొనసాగింది. వందల మంది హిందువులు ఈ దాడుల్లో గాయపడ్డారు. 2013-16 మధ్య వందలాది ఆలయాలను ఇస్లామిక్ మూకలు నేలమట్టం చేశాయి. 2021లో దుర్గాపూజ సందర్భంగా పెద్ద ఎత్తున ఆలయాలపై దాడులు, విగ్రహాల విధ్వంసం జరిగింది. ఖురాన్‌ను అవమానించారనే అబద్ధపు ప్రచారం నేపథ్యంలో ఈ అల్లర్లు చెలరేగాయి. 2024 ఆగస్టులో ప్రధాని షేక్ హసీనా పదవీచ్యుతురాలైన తర్వాత గడచిన రెండేళ్లుగా హత్యాకాండ కొనసాగుతోంది.

ఈ సందర్భంగా రెండు పుస్తకాలను గుర్తు చేసుకోవాలి. తథాగత్ రాయ్ రాసిన 'మై పీపుల్ అప్ రూటెడ్', మరొకటి దీప్ హల్దర్, అవిషేక్ బిస్వాస్ రాసిన 'బీయింగ్ హిందూ ఇన్ బంగ్లాదేశ్'-అన్ టోల్డ్ స్టోరీ. ఈ రెండు పుస్తకాలు బాంగ్లాదేశ్ హిందువుల దైన్యాన్ని, దాడుల పరంపరను ఎంతో లోచూపుతో చర్చించాయి.

తథాగత్ రాయ్ రాసిన 'మై పీపుల్ అప్ రూటెడ్' పుస్తకంలో నాటి ఊచకోత ఉదంతాలను కళ్లకు కట్టినట్టు వివరించారు. ముస్లిం మెజారిటీ ప్రాంతంలో ఒడియా మాట్లాడే హిందువులపై జరిగిన మారణకాండను చదివితే ఎవరికైనా గుండెలు మండిపోతాయి. దేవీ దేవతలు కొలువైన ప్రతి ఇంట్లో మరణమృదంగం మోగింది. సిందూరం పెట్టుకున్న ప్రతి స్త్రీ అత్యాచారానికి గురైంది. హంతకులంతా యువకులు. ముసీం లీగ్ నినాదాలిస్తూ.. మందలు మందలుగా హిందువులపై పడ్డారు. ఓ బెంగాలీ హిందూ కుటుంబం భీతితో పారిపోయేందుకు రైల్వే స్టేషన్‌లో కూర్చున్నది. జిహాద్ మూకలు వీరిని చూడగానే వరిగెత్తుకొచ్చి చుట్టుముట్టాయి. కుటుంబంలోని వదిహేనేళ్ల బాలిక మూకను చూడగానే చేష్టలుడిగి కూర్చున్నది. బాలికను బలవంతంగా లేపి నిలబెట్టి వివస్త్రను చేశారు. పట్టపగలు నడిరోడ్డున అలాంటి స్థితిని ఎదుర్కొన్న బాలిక మానసిక స్థితి ఏమై ఉంటుందో ఊహించుకోవచ్చు.

రాయ్ సాహెబ్ నాగేంద్ర కుమార్ సుర్ 1946 ప్రాంతంలో నౌఖాలీ జిల్లాకు చెందిన ప్రముఖ న్యాయవాది. పాకిస్థాన్ అనుకూల అల్లర్లు చెలరేగిన సమయంలో ఆయనను ముస్లింలీగ్ మూకలు అవహరించాయి. మూరుమూల ప్రదేశానికి తీసుకెళ్లి....నీ సమాధి నువ్వే తవ్వుకో.. పూడ్చిపెడతామంటూ ఆదేశించారు. రాయ్ సాహెబ్ ఏమాత్రం భయపడకుండా 'నన్ను మీరెలాగూ చంపుతున్నప్పుడు మీమాట వినడంలో అర్థం లేదన్నారు. హంతక మూకలు రాయ్ సాహెబ్ మరో హెచ్చరిక జారీ చేశారు. ఆ తర్వాత దుండగులు ఆయన తల నరికివేశారు. రావు సాహెబ్ కుమారుడు అక్కడి నుంచి పారిపోయి కలకత్తాకు వచ్చాడు. రావు సాహెబ్ కుమారుణ్ని రచయిత తథాగత్ రాయ్ సంప్రదించే నాటి సంఘటనల గురించి వాకబు చేసే ప్రయత్నం చేస్తే...వాటిని గుర్తు చేసుకుంటే వెన్నులో వణుకు పుడుతుందన్నారట.

నౌఖాలీ జిల్లా కరవు బారిన పడిన రోజుల్లో హిందువులు రోజంతా ఆహారం కోసం తిరిగి తిరిగి రాత్రి కాగానే మార్కెట్ ప్రాంతంలోనో లేదో వీధుల్లోనే

నిద్రించేవారట. ఉదయం లేచే సరికి కొంతమంది ఆకలిచావుకు గురయ్యేవారట. చనిపోయినవాళ్లు ముస్లింలా హిందువులా అని తనిఖీ చేసిన తర్వాత వారు ముస్లింలు అయితే జనాజా నమాజ్ చేసి ఖననం చేసేవారట. హిందువులైతే వారి శవాలను నదుల్లో చేపలకు, పీతలకు ఆహారంగా వేసి ఆనందించేవారట. తూర్పుబెంగాల్‌లోని డెల్టా ప్రాంతంలో చిన్న వృత్తు చేసుకుంటూ జీవనం సాగించే చాలామంది ముస్లిం మూకలు తమ స్త్రీలను పెళ్లి చేసుకోవడం అనివార్యమనుకునే రోజుల్లో తమ ప్రాణాలకంటే తమ గృహిణుల రక్షణ విషయంలో చాలా భయపడేవారని రచయిత తన పుస్తకంలో రాశారు.

దేశ విభజన సమయంలో బాంగ్లాదేశ్‌లోని ఖుల్నా జిల్లా 1950లో హిందూ మెజారిటీ జిల్లా.

విభజన ఖరారైన తర్వాత ఖుల్నాను పాకిస్థాన్‌కు ఇచ్చి ముస్లింమెజారిటీ జిల్లా అయిన ముర్షీదాబాద్‌ను భారత్ కు అప్పగించారు. ఆ తర్వాత ఖుల్నా జిల్లాలోని హిందువులపై దాడులు మొదలయ్యాయి. ఈ పాంతక దాడుల్లో హిందువులంతా చెల్లాచెదురయ్యారు.

నాటి పరిస్థితుల తీవ్రతను అర్థం చేసుకోవడానికి తథాగతా రాయ్ వాస్తవ ఘటనల ఆధారంగా వెలువడిన 'లొజ్జా' అనే నవల కథను క్లుప్తంగా ప్రస్తావించారు. వాస్తవ ఘటనల ఆధారంగా రాసిన ఈ నవల ఇతివృత్తమంతా భీతిగొలిపేది. 1952లో ఢాకాలోని లైటన్ మెడికల్ కాలేజీలో సుధామయి సహధ్యాయులందరూ తమ తమ ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. సుధామయి సైతం తన మెడికల్ డిగ్రీ తీసుకుని వెళ్లాలని నిర్ణయించుకున్నప్పుడు మిత్రులు హెచ్చరిస్తూ ఇది ముస్లింల మాతృభూమి. ఇక్కడ మనకెలాంటి భద్రత ఉండదు. అది గుర్తుంచుకో. లేదంటే తర్వాత పశ్చాత్తాప పడాల్సి వస్తుందన్నారు.

సుధామయి సహా ఆయన తండ్రి ఈ సూచనను ఖాతరు చేయలేదు. డాక్టర్ పట్టా పుచ్చుకుని మైమెన్ సింగ్ పట్టణానికి సుధామయి వెళ్లిపోయాడు. ఎస్.కే.ఆసుపత్రిలో ఉద్యోగంతో పాటు స్వదేశీ బజార్‌లో ప్రైవేట్ ప్రాక్టీసు ప్రారంభించాడు. బ్రాహ్మణ బరియాకు చెందిన ఓ న్యాయవాది కూతురైన కిరణ్మయిని పెళ్లిచేసుకున్నాడు. అందరూ భారత్ వెళ్లిపోతున్నా సుధామయి మాత్రం బాంగ్లాదేశ్ వదిలిపెట్టకూడదని నిర్ణయించుకున్నాడు. 1971లో పాకిస్థాన్ సైన్యం దాడి చేసిన తర్వాత పరిస్థితులు మారిపోయాయి.

ఓ రోజు రాత్రి సుధామయిని ముగ్గురు పాకిస్థానీ సైనికులు బంధించారు. పేరడిగారు. భయం భయంగా నిరాజుద్దీన్ హుస్సేన్ అన్నాడు. తడబాటును గ్రహించిన పాకిస్థానీ సైనికులు ప్యాంటు విప్పమన్నారు. ముస్లిం కాదని గ్రహించిన తర్వాత ఓ కాలు విరిచేశారు. మరో ఇద్దరు సైనికులు డొక్కల్లో తన్నారు. అక్కడి నుంచి లాక్కెళ్లి క్యాంపులో వేశారు. విపరీతంగా కొట్టడంతో పాటు మూత్రం తాగించారు. కల్మా చదవాలని బలవంతపెట్టారు. మతం మార్చుకోవాలంటూ హింసించారు. ఆరేడు రోజుల తర్వాత పాకిస్థానీ సైనికులు సుధామయి పురుషాంగాన్ని కోసేసి, నాలాలోకి విసిరేశారు. క్యాంప్‌లోని మిగతా వాళ్లు ఈ ఘటనను చూసిన తర్వాత తామంతా ముస్లిం మతం స్వీకరిస్తామని పాకిస్థానీ సైనికులను ప్రాధేయపడ్డారు. నిర్దాక్షిణ్యంగా వారందరినీ సైనికులు హత్య చేశారు.

దీప్ హల్దర్, అవిషేక్ బిస్వాస్ రాసిన 'బీయింగ్ హిందూ ఇన్ బాంగ్లాదేశ్–అన్ టోల్డ్ స్టోరీ' పుస్తకంలో ఏముందో తెలుసుకుందాం. చరిత్ర భారాన్ని సాంతం ఆర్థంగా ప్రయాసపడి కుదిస్తే ఎలా ఉంటుందో చెప్పాలంటే 'బీయింగ్ హిందూ ఇన్ బాంగ్లాదేశ్–అన్ టోల్డ్ స్టోరీ' పుస్తకం గురించి మాత్రమే చెప్పాలి. ఎనిమిది దశాబ్దాలుగా బాంగ్లాదేశ్ హిందువులు మోస్తున్న గాయాల గతాన్ని తడుముతుందీ పుస్తకం. పుస్తకం వెంటాడే వాక్యాలతో మొదలవుతుంది.

90 ఏళ్ల స్మృతికాంత బిస్వాస్ హిందువుల ఊచకోతలకు ప్రత్యక్ష సాక్షి. ఆయనను ఇంటర్వ్యూ చేశారు రచయితలిద్దరూ. తప్పుడు వార్తలు వ్యాపించగానే పొరుగువారే అల్లరిమూక లుగా, హంతకులుగా మారి హిందులపై నరమేధానికి పాల్పడిన ఉదంతాలను రచయితలు ఎంతో ఆర్థంగా రాశారు. తనకు 12 ఏళ్ల వయసు ఉన్నప్పుడు తన తండ్రి సోదరిని అల్లరిమూకల బారినుండి కాపాడేందుకు ఏం చేశారో స్మృతికాంత బిస్వాస్ చెప్పడంతో పుస్తకం ఆరంభమవుతుంది.

చరిత్ర భారాన్ని సాంతం ఆర్థంగా ప్రయాసపడి కుదిస్తే ఎలా ఉంటుందో చెప్పాలంటే 'బీయింగ్ హిందూ ఇన్ బాంగ్లాదేశ్–అన్ టోల్డ్ స్టోరీ' పుస్తకం గురించి మాత్రమే చెప్పాలి. ఎనిమిది దశాబ్దాలుగా బాంగ్లాదేశ్ హిందువులు మోస్తున్న గాయాల గతాన్ని తడుముతుందీ పుస్తకం. పుస్తకం వెంటాడే వాక్యాలతో మొదలవుతుంది. 90 ఏళ్ల స్మృతికాంత బిస్వాస్ హిందువుల ఊచకోతలకు ప్రత్యక్ష సాక్షి. ఆయనను ఇంటర్వ్యూ చేశారు రచయితలిద్దరూ.

ఆ తర్వాత జనాభా నిష్పత్తిలో వచ్చిన తీవ్రమైన మార్పులను పుస్తకం చర్చిస్తుంది. 1947లో ముప్పైశాతం హిందు జనాభా ఉంటే 9శాతానికి పడిపొయిన తీరును, సంపన్న హిందువులు సైతం తమ ధార్మిక విశ్వాసాలను వ్యక్తం చేసేందుకు జంకిన గతాన్ని, బెంగాలీ దళిత నాయకుడు జోగేంద్రనాథ్ మండల్ చారిత్రక పాత్రను, దేశ విభజన సమయంలో ముస్లింలీగ్‌ను సమర్థించి తర్వాత పశ్చాత్తాపపడిన తీరును చర్చిస్తుంది.

మొత్తంగా ఎనభై ఏళ్లుగా సాగుతున్న బాంగ్లాదేశ్ హిందువుల ఊచకోతలో చరిత్రకెక్కని హృదయ విదారక గాథలెన్నో ఉన్నాయి. 2021 నుంచి ఆరేళ్లుగా ఇది మరింత తీవ్రమైంది. 2024లో అధికార మార్పిడి తర్వాత దాడుల తీవ్రత పెరిగింది. భారత ప్రభుత్వం బాంగ్లాదేశ్ హిందువుల గురించి అవసరమైన చర్యలు తీసుకోవాలంటే అందుకు సాంకేతికమైన అవరోధాలున్నాయి. వారంతా బాంగ్లాదేశ్ పౌరులు కావడం ప్రథమ అవరోధం. దీన్ని ప్రభుత్వం ఎలా అధిగమిస్తుంది? ఎలాంటి చర్యలు తీసుకుంటుంది? రాబోయే రోజుల్లో తిరిగి షేక్ హసీనా ప్రభుత్వం ఏర్పడితే అప్పుడేమైనా బాంగ్లాదేశ్ హిందువులకు ఉపశమనం–ప్రాణాలకు హామీ లభిస్తుందా? ఇలాంటి ప్రశ్నలన్నిటికీ కాలమే సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

ప్రశాంత్ జోషి
సీనియర్ జర్నలిస్ట్

గణపతిదేవుడు

43

మత్తి భానుమూర్తి

యుద్ధ స్కంధావారం వద్ద నున్న భవంతి లోనికి ప్రవేశించింది రుద్రమ.

మందిరాల నిండా రకరకాల వస్తువులు ఉన్నాయి కానీ మనుష్యుల అలికిడి లేదు. అసలు గణపతిదేవుని బంధించిన ఆనవాలు కూడా కనపడటం లేదు. ఏమైనా ఆనవాలు ఉన్నదేమో కానీ ఈ జన ప్రభంజనం వల్ల రుద్రమకు కించిత్ కూడా లభించలేదు.

ఉసూరుమంటూ రుద్రమ, లెంకలు బయటకు వచ్చారు.

జనం దొరికిన వస్తువులు పట్టుకుని పరుగులు పెడుతున్నారు..

క్షణక్షణానికి ఆమెకు ఆందోళన పెరిగిపోతోంది. ఎక్కడ తన కన్నతండ్రి? ఎక్కడ కాకతీయ రాజ్యాధినేత??

ఆ జనసందోహం నుండి దూరంగా వెళ్లి ఓ రాతిపై కూలబడింది. లెంకలు ఇంకా లోపల వెదకుతున్నారు.

ఉన్నట్టుండి లోపలినుండి ఓ గావుకేక వినబడింది. అది పశుపతిలెంకది.

చివ్వున లేచి జనాన్ని తోసుకుంటూ లోపలికి పరుగుపెట్టింది. భవనం వెనుక చావడిలో ఇద్దరు కాకతీయ పల్లకి బోయలు శవాలై పడిఉన్నారు.ఒకడు కొనఊపిరితో ఉన్నాడు.ఒళ్లంతా రక్తసిక్తం. ఊపిరి పీల్చడానికి ఆయాస పడుతున్నాడు. లెంకలు అతనిని కాపాడడానికి విశ్వయత్నం చేస్తున్నారు. రుద్రమను చూడగానే వాడు చేతులు జోడించడానికి యత్నించాడు కాని రుద్రమ కిందకువంగి అతని చేతులు పట్టుకుంది.

"ఏమైంది.. తండ్రిగారు ఎక్కడ? ఎటు తీసుకు పోయారు? మీరంతా ఎంతవరకు వెంబడించారు.' ప్రశ్నల వర్షం కురిపించింది.

అతడు ఒక్కొక్క మాటే కూడబలుక్కుంటూ, "ఆ యమ్మ ఎవరో దుర్మార్గురాలు. మహారాజుగారిని అనరాని మాటలు అంటూ చేయి చేసుకుంటోంది. అక్కడే కొందరు లెంకలను చంపేసింది. కొందరు లెంకలు, పల్లకి బోయిలం వెంటపడ్డాం. కాని వాళ్ల ధాటికి ఆగలేకపోయాం. చస్తూనే వెంట పడుతూనే ఉన్నాం. చివరికి మేం ముగ్గురం ఇక్కడివరకూ పోరాడాం. కానీ ఓడిపోయాం యువరాణీ! మహా రాజులవారిని తాళ్లతో కట్టేసి ఈడ్చుకుపోయారు." చెబుతూనే స్పృహ తప్పాడతను.

నవనాడులు కుంగిపోయాయి రుద్రమకు.

లెంకలు అతనికి శుశ్రూష చేస్తుండగా ఆమె బయటకు వచ్చింది. అప్పటికి జనం కోష్టాగారం అంతా కొల్లగొట్టుకుని పోయారు. సందడి తగ్గింది. ఆ రాక్షసి ఎదురయితే ఖండఖండాలుగా నరికేయాలనివుంది. కానీ ఎలా?ఎప్పుడు?ఎక్కడ ఆ పిశాచి ఎదురౌతుంది?

మరి కాసేపటికి కాస్త కోలుకున్న ఆ బోయీ, "ఆమె మహారాజుగారిని చిత్రహింసలు పెట్టి చంపుతుందట. తన సోదరిని చంపిన చోటే మహారాజుల వారిని ముక్కలు ముక్కలుగా నరికి చంపుతుందట. ఇంకా ఏవేవో.."

రుద్రమకు అర్థమైంది. అగ్నిపర్వతం బద్దలై లావా ఎగిసిపడుతోంది.

బోయీ చెప్పిన వైనం.. చెవుల్లో గింగుర మంటోంది.

"ఆమె సోదరిని చంపిన చోటే మహారాజుల వారిని ముక్కలు ముక్కలుగా..."అంటే అంటే.. తండ్రిని దేవగిరికోటలోని ఆ కోష్టాగారం వద్ద??

"దేవుడా..!!" కుప్పకూలిపోయింది.

లెంకలు మొత్తంగా బయటకు వచ్చారు. "బోయీ కోలుకుంటున్నాడు యువరాణీ.." చెప్పాడు పశు పతిలెంక.

ఆమెకు ఏమీ వినిపించడం లేదు. కనిపించడం లేదు.. అంతా శూన్యం! చీకటి!!

"మహారాజుగారి లెంకలు, బోయీలు కొందరు ఎవరైనా ఇంకా ఆ కిరాతకుల వెంట పడుతున్నారేమో.. ప్చ్.. తెలియదు. మనం కదలాలి యువరాణీ.."

ఆమె కరచరణాలు కదలడం లేదు. ఎంత కిరాతకురాలు ఆ కవ్వల??!!

పశుపతి మళ్లీ అన్నాడు. "మహారాజుగారు ఏమాత్రం ప్రతిఘటించడం లేదట. ఆమె కొడితే భరిస్తున్నారట.ఎంత అవమానం..ప్చ్.."

రగిలిపోతున్నాడు పశుపతి. మిగిలినవాళ్లూ అదే ఉద్వేగంతో కదలాడు తున్నారు.

తెలియవస్తున్న ప్రతి మాటా.. ప్రతి పనీ రుద్రమను నిర్ఘాంతపరుస్తున్నాయి. దిమ్మెరపోయేలా చేస్తున్నాయి.

దిగ్భ్రమతో కాలు చెయ్యి కదలడం లేదు. వెర్రిచూపులు చూస్తోంది.

'ఎంత పగ పెంచుకుంది?' లిప్తకాలంలో వెయ్యిసార్లు అనుకుంటోంది.

కళ్ల ముందు కవ్వల పిశాచిలా ఉవ్వెత్తున ఎగసి ఆకాశమంతా ఆక్రమించి వికటాట్టహాసాలు చేస్తోంది.

"రా.. చూసుకుందాం.. చేతనైతే నీ తండ్రిని కాపాడుకో. నువ్వొచ్చేసరికి నీ తండ్రిని ముక్కలు ముక్కలుగా నరికి కట్టగట్టి అందిస్తాను. నెత్తిన పెట్టుకుని అనుమకొండ తీసుకుపో.."

ఇలాంటివే ఏవేవో.. చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

ఆ శత్రువే రుద్రమకు కొత్త ఉత్తేజాన్ని ఇచ్చినట్లయ్యింది. చివ్వున లేచి నిలుచుంది.

'శహభాష్. నువ్వు నాకు తగిన శత్రువ్వి. తేల్చుకుందాం..నువ్వో నేనో. వస్తున్నాను. నువ్వు దేవగిరిలోనే కాదు. హిమాలయాల్లో దాగినా వదలను. నా తండ్రిని రక్షించి తీరుతాను. ఆయనను తెలుగు ప్రజలకు అందిస్తాను. నేను ఈ పోరాటంలో ఆహుతి అయినా సరే.. నా తండ్రిపై ఈగ వాలనివ్వను. నిన్ను వదలను..'

లేచి కళ్లు తుడుచుకుని..."మనం దేవగిరి వెళ్లాలి. తండ్రిగారిని అక్కడికి తీసుకుపోతోంది ఆ పాపిష్టిది. మనం వీలయినంత వేగంగా వెళితే ఆ పిశాచిని, దాని కిరాతక బృందాన్ని పట్టుకోవచ్చు కూడా. కాకపోతే మన చావో గెలుపో తేలేది దేవగిరి కోటలోనే" చెప్పింది.

ఎక్కడ బెలగావి.. ఎక్కడ దేవగిరి.. వేల

'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన

యోజనాల దూరం!

కాని వెళ్లక తప్పదు. మరో మార్గం లేదు.

పూర్తి నిర్ణయంతో రుద్రమదేవి అశ్వాన్ని అధిరోహించింది. లెంకలు ఆమె ముందు వెనుకగా గుర్రాలను పరుగెత్తిస్తున్నారు.

ఏకైక లక్ష్యం మహాపురుషుడు గణపతిదేవుని తెలుగు సామ్రాజ్యాధినేతగా తెలుగు సమాజానికి అందించాలి!!

కానీ దైవం మరొకటి తలచినట్లుంది!!

* * *

ఎక్కడో దారి తెన్నూ తెలియని కీకారణ్యం..

బాలభగవానుని లేత కిరణాలతో పక్షుల కిలకిలరావాలు.. గాలిదేవుడు ఉదయమే ఉత్సాహంగా గంతులేస్తున్నట్లు.. మహావృక్షాలు ఉదయమే వ్యాయామం చేస్తున్నట్లు తీవ్రంగా కదలాడుతూ రివ్వురివ్వున గాలి..

రాత్రి తాలూకూ నిద్ర మగత విడివడి మెలకువ వచ్చింది గణపతిదేవునికి. కదిలి లేచి కూర్చున్నాడు. రాత్రి గొల్లన నిర్మించి లోపల అడవి గడ్డిపై ఏదో దుప్పటి లాంటిది పరచి తల్పంగా చూపించినప్పుడు తలవొంచుకుని దానిపై మెల్లగా కూలబడ్డాడు. కాసేపటి తర్వాత మెల్లగా ప్రక్కకువాలగా మరి కాసేపటికి నిద్ర పట్టింది.

తెల్లవారినట్లుందని గుర్తించాడు. లేచి మెల్లగా గొల్లెనకున్న తెర తొలగించుకుని బయటకు వచ్చాడు.

ఎదురుగా తిమ్మప్ప, గౌరయ్య..

తన బృందం నుండి తన కోసం కవ్వల నిర్దేశించిన ఇద్దరు పరిచారకులు. పరిచారకులైనా, స్నేహితులైనా, శత్రువులైనా వాళ్లే!!

ఆయనను చూసి ఇద్దరూ వినయంగా బాగా వంగి నమస్కరించారు.

పరిచారికలకు జవాబు చెప్పే సంప్రదాయం మహారాజులకు ఉండదు కాబట్టి పలకరింపులాగా చిన్నగా శబ్దించి విశాలంగా వొళ్ళు విరుచుకున్నాడు గణపతి దేవుడు.

తిమ్మప్ప అన్నాడు మెల్లగా తగ్గుస్వరంతో, "కాలకృత్యాలకు.. వెళదామా.. మహారాజా?!!"

"ఊ.." అని దీర్ఘంగా నిశ్వసించి కాస్త కదిలాడు. వాళ్లిద్దరూ ఆయనకు దారి చూపుతున్నట్లు ముందు కదిలారు. వాళ్లను అనుసరిస్తూ, మౌనంగా చిన్నచిన్న అడుగులతో నడక ప్రారంభించి.. చుట్టూ పరీక్షగా చూస్తూ ముందుకు పోతున్నాడు.

అది కారడవి.. సందేహంలేదు. దగ్గరలో మానవ నివాసాలు, మానవ కదలికలు ఉండే అవకాశం లేని దట్టమైన కీకారణ్యం. ఎందుకు? ఏవిటి? ఎక్కడికి? అనే ప్రశ్నలకు జవాబులు ఆయన వద్ద లేవు. అసలు ఆ ప్రశ్నలే రాత్రి చచ్చి పోయాయి.

జరిగింది ఏవిటో, తనిక్కడకు ఏలా వచ్చాడో.. కవ్వల బృందం ఎలా తనను ఇక్కడికి తెచ్చిందో గుర్తు చేసుకుంటే గుండేలవిసిపోతున్నాయి అ మహా యోధునికి.

ఎవరైనా దాడిచేసి శరీరంపై ఉన్న ఆభరణాలు దోచుకుని పారిపోయే నిర్జన పరిస్థితుల్లో లేడు. పూర్తి స్థాయి యుద్ధ క్షేత్రంలో కాకతీయ స్కంధావారంలో ఉన్నాడు. తోడుగా క్షణక్షణం యుద్ధ వార్తలను అందుకుని చర్చిస్తున్న తిక్కనామాత్యులున్నారు. చుట్టూ ఎంతోమంది సాధారణ సైనికులున్నారు. అందరిని మించి మహాయోధులైన తన అంగరక్షకులున్నారు. ఏ కీడు శంకించిందో.. రుద్రమ రెండంచెల భద్రతను ఏర్పరచింది. గోల్లెనదాటి యుద్ధ క్షేత్రానికి రావద్దని గౌరవంగానూ, ఆజ్ఞగానూ చెప్పింది. తను అలాగే కేవలం తిక్కనామాత్యునితో కలసి యుద్ధ తంత్రాలు చర్చిస్తూ లోపలే ఉన్నాడు గాని బయటకు రాలేదు. అలాంటిచోట ఓ ఆడది తన యోధులతో గోల్లెనలోకి ప్రవేశించి తిక్కనామాత్యుని కొట్టి, పక్కకు నెట్టి తన అంగరక్షకులను అతి కిరాతకంగా చంపేస్తూ తనను పట్టి ఈడ్చుకుంటూ లాక్కెళ్లి పల్లకిలో పడేసి అడ్డొచ్చిన సైనికులను, తన పల్లకి బోయీలను నిర్దాక్షిణ్యంగా ఖడ్గాలతో నరికేస్తూ ముందుకు దూసుకుపోతూ స్కంధావారం నుండి బయటకు తీసుకుపోయారంటే ఆమె తెగువ, ప్రణాళిక, వాళ్ల మొరటుదనం వణుకు పుట్టిస్తోంది.

అడవిలో నడుస్తూ నిన్న జరిగిన సన్నివేశాలను గుర్తుచేసుకుంటున్నాడు గణపతిదేవుడు. శత్రువులను ఇలా అపహరించి తీసుకుపోవడం ఆయనకు తెలియని అనుభవం. యుద్ధ క్షేత్రాలలో ఎదురెదురుగా నిలబడి ధర్మయుద్ధం చేయడమే ఆయనకు తెలిసిన యుద్ధనీతి. మరో విధానపు శత్రుత్వం ఆయనకు తెలియనిది.

ఓ చెరువు వద్దకు వచ్చాక కాలకృత్యాల నిమిత్తం ఆ ఇద్దరు పరిచారకులు ఆయనను వదలి కాస్త దూరం వెనక్కు వెళ్లారు.

కాలకృత్యాలు తీర్చుకున్నాడు గణపతిదేవుడు.

తనను కవ్వల అపహరించి బంధించి తన గుప్పిట పెట్టుకోవడం ఆయనకు సంభ్రమంగా ఉంది.

ఆలోచనలన్నీ నిన్న జరిగిన సంఘటనలే మళ్లీ మళ్లీ మనోఫలకంపై కదలాడుతున్నాయి.

ఈ కవ్వల పటాలం యుద్ధ స్కంధావారం నుండి తనను మూడు నాలుగైదు చోట్లకు తీసుకు పోయారు. ఎదిరించిన తన అంగరక్షకులను నిర్దాక్షిణ్యంగా చంపేశారు. తన ప్రియతమ పల్లకి బోయీలు కూడా తిరగబడగా, ఆ కిరాతక బృందం వాళ్లను కూడా వదలలేదు. కొందరిని చంపేశారు.

రుద్రమ రెండు అంచెల అంగరక్షక బృందాలను ఏర్పాటు చేసింది.

కాని కవ్వల మరింత తెలివి మీరిన దుర్మార్గురాలు. గతంలో గణపతిదేవుని అంగరక్షకుల ప్రతిభను చూసిన కవ్వల ఈసారి సాధారణ యోధులైన తన అంగరక్షకులను తొలగించింది. నరభక్షకుల్లాంటి

కిరాతకులను ఏర్పాటు చేసుకుని గొల్లెనపై దాడి చేసిందని ఆయనకు అర్థమైంది. వాళ్లు ఎక్కడో సమాజానికి దూరంగా మనుష్యులను నిర్దాక్షిణ్యంగా చంపడానికే పుట్టిన్నట్లున్నారు. సైనికుల కంటే మరింత బలిష్ఠంగా చూపులకే భయం కొల్పుతున్నారు. యుద్ధ శిక్షణ పొందిన ఆయన అంగరక్షకులంతా ఆ దురాత్ములపై ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయారు. ఆయనను రక్షించలేక పోయారు. కొందరు అక్కడికక్కడే చనిపోయారు. కొందరు పల్లకి వెంట పరుగులు పెడుతూ కత్తులు ఝళిపించినా.. పల్లకిని ఆపలేకపోయారు. కాళ్లు, చేతులు తెగి రహదారులలో క్రిందపడి గిలగిల కొట్టుకున్నారు.

అన్ని అడ్డంకులను లాఘవంగా తొలగించు కుంటూ పగలల్లా ప్రయాణించి రాత్రి కూడా ప్రయాణిస్తూ వచ్చి వచ్చి అర్ధరాత్రి వేళ ఇక్కడ ఆగింది.

గాడాంధకారం.. మిణుగురుల మిలమిలల్లో ఎవ్వరూ స్పష్టంగా తెలియడం లేదు. పల్లకి పరుగులతో ఒళ్లంతా మాంసపు ముద్ద అయ్యింది. తన అనుయాయులతో ఆమె దూరంగా వెళ్లింది. కిరాతకుల్లో ఇద్దరు గణపతిదేవుని వద్ద ఆయనకు సహాయకుల్లా ఉండి, అప్పటికప్పుడు గుర్రాల మీదున్న గోల్లెన సంచులను తెచ్చి గొల్లెన నిర్మించారు. గడ్డిలాంటిది లోపల పరచి దానిపై ఓ కంబళి పరిచారు.

"విశ్రమించండి ప్రభూ" అన్నారు.

ఆయన కవ్వల కోసం తలతిప్పి అన్నివైపులా చూశాడు.

కాస్త ఆవలగా తన అంగరక్షక బృందంతో తీవ్రంగా చర్చిస్తూ కనపడుతోంది బాలకవ్వల.

ఓ ఇద్దరూ తినడానికి ఏవో ఆకులలో అందించారు.

మౌనంగా తిన్నాడు.

రాత్రి ఆమెను అడిగాడు. "మనం.. నన్ను ఎక్కడికి తీసుకుపోతున్నావ్ కవ్వలా.." అని.

"ఏం.. ఎక్కడికో నీకు చెప్పి తీసుకుపోవాలా??" పాము చివ్వున పడగ విప్పినట్లు కెవ్వున అరచింది.

నిరుత్తరుడై మౌనాన్ని ఆశ్రయించాడు.

చాలామంది స్థితప్రజ్ఞులలాగే గణపతిదేవుడు కూడా ఎదుటివారు రెచ్చిపోయినప్పుడు స్వరం తగ్గించి,లేదా మౌనంగా ఉంటాడు. సర్వశక్తి మంతుడైన మహాపాలకుడు అయినా పరిస్థితులకు తగ్గట్లు మసలుకోవడం అతనికి పుట్టుకతో వచ్చిన ప్రజ్ఞ.

అసలు ఇప్పటి ఈ ప్రత్యేక పరిస్థితి చాలా చాలా విచిత్రమైనది.

తన హృదయంలో మధురోహలు ఏమైనా ఉన్నాయంటే అవి పెద్దకవ్వల సృష్టించినవి. అవి నిత్యనూతనం. ఆ మనోహర మహిమాన్విత మధుర లోకం నుండి ఆయన బయటకు రావడానికి ఇష్ట పడడు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా, దండించినా అన్నీ భరించడానికే ఆయన మనస్సు, శరీరమూ సన్నద్ధం కాని ఆ మధురలోకాన్ని విడిచి రాడు.. ఎప్పటికీ!!

రాజ్యపాలక వ్యవస్థపై అతనికున్న చులకన భావన వల్ల రాజకుటుంబ స్త్రీలంటే నానప్పకు వల్లమాలిన వ్యామోహం ఏర్పడింది. సాధారణ వ్యభిచారుణులు, గణికలను సొమ్ముతో తేలిగ్గా కొనగలడని అతనికి నూనూగు మీసాల రోజులలోనే అనుభవమయ్యింది. దాంతో వారిపై మోజు ఇప్పుడు లేదు. మహారాణులు, రాచకుటుంబ స్త్రీలు అంటే శృంగార పైత్యం ఎక్కువయ్యింది. ఇప్పుడు అతని కంటికి నదరుగా.. అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తోంది దేవగిరి రాజ్య వాణిజ్య సందివిగ్రహి బాలకవ్వల!!

అందుకే ఆయన ఈ బాలకవ్వల నిర్వహిస్తోన్న పగ అనే కార్యకలాపాన్ని మౌనంగా భరిస్తున్నాడు. మరింతగా భరించడానికి.. అవసరం అయితే అందుకు తన ప్రాణాలను అర్పించడానికి సిద్ధమై ఉన్నాడు. ఆయనకు తన రాజ్యం, తన కుటుంబం, తన బాధ్యతలు బరువులు అన్నీ తెలుసు. వాటిని మర్చిపోయినవాడు కాదు. కానీ వాటికి ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. తను లేకపోతే రాజ్యపాలన, కాకతీయ వంశం ఆగిపోదు. తను లేకపోతే ఆంధ్ర రాజ్యస్థాపన ఆలస్యం అవుతుందేమో కాని పూర్తిగా ఆగిపోదు.

కానీ కానీ.. కవ్వల ప్రేమ లోకాన్ని అతడు వదలుకోలేదు.

అందుకే బాలకవ్వల చర్యలకు ఆ మహా ప్రేమికుడు గణపతిదేవుడు సహకరిస్తున్నాడు. అవన్నీ అతనికి వినోదంగా,ఆమె తత్వానికి.. అంటే ఆమెలో జీర్ణించుకుపోయిన పిచ్చి పగకు తగినట్లుగా అనిపిస్తున్నాయి.

అవును మరి.. ఆమె అక్క కోసం ఆమె ఇలా చేయడం సబబేనేమో..'

గణపతిదేవునిలో ఉదాసీనతతో కూడిన ఓ తాత్విక ధోరణి ఉవ్వెత్తున ఎగసి నిలిచిపోయింది.

అందుకు అతడు తన రాచరికాన్ని శౌర్య పరాక్రమాలను కూడా కాసేపు పక్కన పెట్టి బాల కవ్వలకు సహకరిస్తున్నాడు.

* * *

మహాఘటికుడు బెలగావి మహావణిజుడు నానప్పశెట్టి..

ఘటికుడు అంటే అతనికి నీతి, నియమాలు, అనుబంధాలపై గౌరవం తక్కువ. సమాజం పట్ల, విలువల పట్ల హేళన, తూష్ణీభావం ఎక్కువ. వాణిజ్యంతో సమస్త ప్రపంచాన్ని కొనగలమన్న ధోరణి అప్పుడప్పుడే పెరుగుతున్న మహా వణిజులకు ప్రతినిధి ఈ నానప్ప.

గతంలో మహారాజులు వణిజులను అంతగా గౌరవించేవారు కాదు. విదేశీ వర్తకులతో అమాత్యులు నిర్ణయించిన ఓ విధానాన్ని అనుసరించి ఏదో తూతూ మాత్రంగా మాట్లాడేవారు. అలాంటిది ఇటీవల సమాజంలో వణిజులకున్న పట్టును గుర్తించిన మహారాజులు వారికి రాచవంశస్తులతో సమాన స్థాయి, గౌరవ మర్యాదలు ఇస్తున్నారు. మహారాజులు, చక్రవర్తులు కూడా తనతో స్నేహం చేస్తారంటే కారణం తన మహత్తర వాణిజ్య సామ్రాజ్యమేనని అతని గట్టినమ్మకం. తన అఖండ వ్యాపార సామ్రాజ్యం ముందు సాధారణ రాజులు తలవంచు తారని అతని అనుభవం!! మహారాజులకు భయపడటం, తలవాల్చడం,వినయం చూపడం కేవలం మర్యాదపూర్వకమైన అతి నటన మాత్రమే!!

రాజ్యపాలక వ్యవస్థపై అతనికున్న చులకన భావన వల్ల రాజకుటుంబ స్త్రీలంటే నానప్పకు వల్లమాలిన వ్యామోహం ఏర్పడింది. సాధారణ వ్యభిచారుణులు, గణికలను సొమ్ముతో తేలిగ్గా కొనగలడని అతనికి నూనూగు మీసాల రోజులలోనే అనుభవమయ్యింది. దాంతో వారిపై మోజు ఇప్పుడు లేదు. మహారాణులు, రాచకుటుంబ స్త్రీలు అంటే శృంగార పైత్యం ఎక్కువయ్యింది.

ఇప్పుడు అతని కంటికి నదరుగా.. అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తోంది దేవగిరి రాజ్య వాణిజ్య సందివిగ్రహి బాలకవ్వల!!

ఆమెను ఎలా స్వంతం చేసుకోవాలి?తన అంతఃపురంలో ఎలా బంధించాలి? తను ఆమె లావణ్యాన్ని తనివి తీరా ఎలా అనుభవించాలి?అనే ఊహల్లో నిరంతరమూ విహరిస్తుంటాడు.

ఇలా విహరిస్తున్న నానప్పశెట్టి ఓ అడవిపందికి శెట్టిల సంప్రదాయ దుస్తులు తొడిగినట్లుంటాడు. నంగినంగిగా మాట్లాడతాడు. మాటకు మాటకు మధ్య నాలుక అడ్డుపడుతుంటుంది.అతనికి పుట్టుకతో వచ్చిన వైకల్యాలపట్ల అతడు సిగ్గుపడడు. పైగా మరింత అనహ్యంగా వాటిని ప్రదర్శిస్తాడు. ఎదుటివారు ఆ నత్తి మాటలకు స్పందిస్తూ జవాబివ్వడం అతనికి మరింత రంజుగా ఉంటుంది. అనవసరంగా నవ్వుతాడు. నవ్వినప్పుడు అతని బంగారు పళ్లు కనిపించాలని తహతహలాడతాడు.

అందరు వణిజ ప్రముఖుల్లాగే నానప్పశెట్టి తనకు అందిస్తున్న సహకారం పట్ల బాలకవ్వల ముగ్ధురాలై పోయింది. కోరింది 'ఎందుకు ఏవిటి'.. అని ఎదురు ప్రశ్నించకుండా లిప్తల కాలంలో అన్నీ ఏర్పాటు చేయడం ఆమెను సంతోషపరచింది. తన పగ

తీర్చుకోవడానికి ఇతగాడు మరింత ఉపయోగ పడుతున్నాడు అని లోలోన మురిసిపోయింది. అదంతా దేవగిరి ప్రభువులపై గౌరవంతో అతడు చూపిస్తున్న సహకారంగా భావించింది కాని లోలోపలి కాముకదృష్టిని ఆమె గుర్తించలేదు. వగ, ప్రతీకారాలతో కళ్లు మూసుకుపోయిన వారికి బుర్ర, బుద్ధి కూడా మూసుకుపోయి ఉంటాయి.

ఆమె తన ఆంతరంగిక సహాయ, అంగరక్షక బృందాలుగా సంప్రదాయ యుద్ధవీరులకు బదులు అతి దుర్మార్గులైన నరరూప రాక్షసులను ఏర్పాటు చేయాలని కోరగా.. ఎందుకు? అని అడగకుండా ఏర్పాటు చేశాడు నానప్ప. ఆమె కోసమే అన్ని చేస్తున్నా... లోలోపల ఆమె కోరికల పట్టిక అతనిని ఆశ్చర్యపరచింది.

ఆమె కేవలం దేవగిరి వాణిజ్య విగ్రహిగా ప్రవర్తించడంలేదు. యోధురాలిలా నిరంతరం యుద్ధతంత్రాలు మాత్రమే కాదు.. ప్రత్యేకించి కాకతీయరాజ్యం, దాని సామంతరాజ్యాల నాశనం, తెలుగుప్రజలను హింసించడం.. తెలుగువారిపై కక్షకట్టి వారి నాశనాన్ని కోరడం.. అందుకు వణిజులను రెచ్చగొట్టి, తెలుగుభాష మాట్లాడేవారికి దైనందినంలో ఇబ్బందులు కలగజేయడం.. అన్నీ గమనిస్తూనే ఉన్నాడు కానీ ఆమె ఆశయం ఏవిటో.! ఏమి సాధించాలని అనుకుంటోందో అతనికి ఓ పట్టాన స్ఫురించలేదు.

అందుకే అతడు తన మనుష్యులు ఇద్దరిని ఆమె బృందంలో చేర్చాడు.

వాళ్లే తిమ్మప్ప, గౌరయ..

వాళ్లిద్దరూ గణవతిదేవుని వ్యక్తిగత సహాయకులుగా బాలకవ్వలే నియమించేలా తెలివిగా ప్రవర్తించి.. విజయవంతంగా నిరంతరం ఆయన సరసన ఉంటున్నారు.

ఈ అతి తెలివితేటలే నానప్పను ఎవ్వరూ చూడని.. వినని దారుణమైన చావుకు గురిచేశాయి.

* * *

"మహారాజా.. తెల్లవారింది.."

"మహారాజా.. తెల్లవారింది.."

చటుక్కున మెలకువ వచ్చింది మహారాజు గణవతిదేవునికి. మునగదీసుకుని వల్లకిలో నిద్రపోతున్నవాడల్లా కదిలి లేచాడు. ఒళ్లు విరుచుకోవాలన్నా బయటకు రావాలి.. మెల్లగా తెర తొలగించుని చూశాడు. ఎప్పటిలాగే కీకారణ్యం.. దగ్గరగా కమ్ముకున్న బలిష్టమైన చెట్లు.. ఆకాశాన్ని తాకుతున్నట్లున్న వాటి కొమ్మలు, రెమ్మలు, ఆకులు. కింద ఎందు కట్టెలు.. పెద్ద పెద్ద ఆసనల్లా బలిష్టమైన పెద్ద వృక్షాల మొదళ్లు .

అప్పుడప్పుడే ఉదయిస్తున్న సూర్యుడు.. చల్లని ఉదయరాగాలకు స్పందనగా తలలూపుతున్నట్లు దగ్గరగా తాకుతూ కదలాడుతున్న లేత కొమ్మల ఆకులు.. ఏదో కమ్మని ధ్వని అంతటా పరచుకుని తెలుస్తోంది.

రాజప్రాసాదంలో ఉదయం నిద్రలేపే మహా సంగీతజ్ఞుల గానాలాపన నుండి ఈ సహజ ప్రకృతి గానాలావనకు నిద్ర లేవడం ఇవ్వుడివ్వుడే అలవాటౌతోందా మహారాజుకు.

దగ్గరగా తిమ్మప్ప, గౌరయ.. ఎప్పటిలాగే చేతులు కట్టుకుని తలవాల్చి నిలబడి ఉన్నారు.

నేలపై ఆన్చిన పల్లకి గుడ్డ నుండి బయటకు వచ్చాడు.

అప్పుడు చూశాడు ఎదురుగా ఓ కొత్త వ్యక్తిని. ఉలిక్కిపడి కళ్లు చికిలించి చూశాడు. ఆ కొత్త వ్యక్తి కూడా అప్పటికే నోరు తెరచి గణపతి దేవుని అబ్బురంగా చూస్తున్నాడు. చొంగ కారుతున్నా గుర్తించడం లేదు. అది దిక్కులు తెలియని కీకారణ్యం కావడంతో అక్కడ కనిపించిన ప్రతివ్యక్తి అక్కడికి ప్రత్యేకించి పని ఉంటేనే వస్తారని ఆయనకు తెలుసు.

గణపతిదేవుడు అటూఇటూ నలుదిక్కులా గబగబా తలతిప్పి చూశాడు. కవ్వల ఎక్కడ? అన్నట్లు.

ఆమె, ఆమె బృందం ఎవ్వరూ కనిపించలేదు.

అప్పుడు కదిలి ముందుకు వచ్చాడు తిమ్మప్ప.

"మహారాజా.. వారు మహావణిజులు నానప్ప శెట్టిగారు. శెట్టిగారూ.. వారే కాకతీయ మహా ప్రభువులు శ్రీశ్రీశ్రీ గణపతిదేవులవారు."

ఒకరినొకరు చూస్తూ ఉండిపోయారొక క్షణం..

ముందుగా మేల్కొన్నవాడు గణపతిదేవుడు.

"కవ్వల మహారాణీవారు.. ఆమె ఎక్కడ తిమ్మప్పా.?." అడిగాడు.

"ఆమె .. ఆమె ఇక్కడ లేరు ప్రభు.." తల వంచుకుని చెప్పాడు తిమ్మప్ప.

చొంగ కార్చుకుంటూ చూస్తున్న నానప్ప, కిసకిసా వెకిలిగా నవ్వి,"నిన్ను ఎక్కడికో ఎత్తుకుపోతున్న దాని దగ్గర నుండి నిన్ను నా దగ్గరికి రప్పిచ్చా. ఇక్కడ నేను తప్ప ఎవ్వరూ లేరుగా.."

మళ్లా ఒళ్ళంతా ఊపుతూ నవ్వాడు నానప్ప.

అప్పటివరకు నానప్పను.. అతని వికార శరీరాన్ని.. అతడు తనను చూస్తున్న రోత చూపును భరిస్తున్న గణపతిదేవుడు చివ్వున కదిలి తల మరింత ఎత్తాడు.

'అది? అది... అని ఎవరిని అంటున్నాడు వీడు?'

నానప్ప మాటలకు ఆయన స్పందన ఏమైవుంటుందోనన్నట్లు చివ్వున చూశాడు తిమ్మప్ప. చూసిన తిమ్మప్ప భయంతో బెరుకుగా అడుగు వెనక్కు వేశాడు.

వణిజుడు నానప్పశెట్టి వెకిలి మాటలకు గణపతిదేవుడు ఉద్రిక్తుడౌతున్నాడు.

ఇది గమనిస్తున్నాడు తిమ్మప్ప.

ముడుచుకుని మౌనముద్రలో నున్న ఓ మహాపర్వతం ఏదో అనుకోని సంఘటనకు చటుక్కున కదిలి తల ఎత్తినట్లుంది తిమ్మప్పకు. వారం రోజులుగా గణపతిదేవుని దగ్గరగా చూస్తోన్న తిమ్మప్పకు ఆయనపై ఓ ఆరాధనాభావం మనస్సంతా ఆక్రమించుకుని ఉంది. ఆయన ప్రతి కదలిక, ప్రతి చూపు, ప్రతి నవ్వు మహోదాత్తంగా ఉంటాయి తిమ్మప్పకు. ఎప్పుడూ మహారాజులను దగ్గరగా చూడని ఆ అడవి మూర్ఖ బలాధ్యునికి.. ఓ రాజ్యానికి మహారాజు, ఓ మహా మేధావి అయిన వీరాధివీరుడు, వేల లక్షల సైన్యాలపై సైన్యాధిపతులకే సైన్యాధిపతి అయినవాడు, అనేకానేక మండలాల పాలకులకే పాలకుడైన మహా మండలేశ్వరుడు, విస్తృతమైన అనేకానేక రాజ్యాలను జయిస్తూ తన రాజ్యంలో కలుపుకుంటూ మహాసామ్రాజ్యజైత్రయాత్రగా సాగిపోతున్న ఓ చారిత్రక మహాపురుషుని సమక్షంలో తాను ఉన్నానన్న స్పృహ అతనికి అప్పుడప్పుడే తెలుస్తోంది.

(సశేషం)



స్టార్మర్ రాజీనామా: యు.కె. కొత్త ప్రధాని

బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తన పదవికి రాజీనామా చేయడానికి సొంత పార్టీ (లేబర్ పార్టీ) నుంచే ఎదురైన తీవ్ర వ్యతిరేకత, అంతర్గత రాజకీయ సంక్షోభమే ప్రధాన కారణం. పార్టీ ఎంపీల నుంచి, మంత్రుల నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగా 100 మందికి పైగా లేబర్ పార్టీ ఎంపీల మద్దతును ఆయన కోల్పోయారు. అధికార లేబర్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పడిపోవడం, అంతర్గత అసంతృప్తి పెరగడంతో స్టార్మర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

స్టార్మర్

ప్రజాభిప్రాయ సేకరణలో దారుణమైన రేటింగ్‌లు, గత సంవత్సరం పీటర్ మాండెల్సన్‌ను యూఎస్ రాయబారిగా నియమించాలన్న ఆయన నిర్ణయం తర్వాత వచ్చిన వరుస ఇబ్బందుల నేపథ్యంలో, లేబర్ నాయకుడిపై కొంతకాలంగా ఒత్తిడి పెరుగుతూ వచ్చింది. మే నెలలో వేల్స్, స్కాట్లాండ్ పార్లమెంట్‌లకు, అలాగే ఇంగ్లాండ్‌లోని కొన్ని ప్రాంతాల స్థానిక కౌన్సిళ్లకు జరిగిన ఎన్నికలను, పరిస్థితులను చక్కదిద్దగలనని నిరూపించుకోవడానికి ఆయనకు లభించిన చివరి అవకాశంగా తీవ్ర నిరాశలోవున్న లేబర్ ఎంపీలు చాలాకాలంగా భావించారు. కానీ ఈ ఎన్నికల్లో నిరాశాజనక ఫలితాలు రావడం, నైజెల్ ఫరాజ్ నాయకత్వంలోని వలస వ్యతిరేక, తీవ్ర మితవాద లేదా జాతీయవాద రిఫార్మ్ యూకే పార్టీ బాగా పుంజుకోవడం లేబర్ పార్టీ నాయకులకు ఆశనిపాతమైంది. లేబర్ పార్టీ 1,496 కౌన్సిల్ సీట్లను కోల్పోగా, రిఫార్మ్ పార్టీ 1,453 కౌన్సిలర్ స్థానాలను (వీటిలో అధికభాగం లేబర్ పార్టీ నుండే) కైవసం చేసుకుంది, 14 కౌన్సిళ్లపై నియంత్రణ సాధించింది. ఈ ఎన్నికలను స్టార్మర్‌పై జరిగిన ప్రజాభిప్రాయ సేకరణగా పరిగణించారు. 'రిఫార్మ్ యూకే' వేగంగా ఎదుగుతున్న నేపథ్యంలో, పార్టీ ఎన్నికల అవకాశాలపై లేబర్ ఎంపీలు, క్యాబినెట్ మంత్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇదే సమయంలో వలసలపై కఠినమైన వైఖరిని అవలంబించడానికి స్టార్మర్ చేసిన ప్రయత్నాలు, మాజీ కన్జర్వేటివ్ ఓటర్లలో, అలాగే లేబర్ పార్టీ సాంప్రదాయ కార్మికవర్గ మద్దతుదారులలో, ముఖ్యంగా ఉత్తర ఇంగ్లాండ్‌లో రిఫార్మ్ పార్టీకి పెరుగుతున్న ఆదరణను ఆపడంలో విఫలమయ్యాయి. చివరికి, ఫలితాలు తీవ్ర నిరాశాజనకంగా రావడంతో, వెస్ట్ స్ట్రీటింగ్ ఆరోగ్య కార్యదర్శి పదవికి, అలాగే పలువురు జూనియర్ మంత్రులు రాజీనామా చేశారు. రక్షణ వ్యయంపై తెరవెనుక దీర్ఘకాలంగా కొనసాగుతున్న వివాదం కారణంగా, లేబర్ పార్టీ సీనియర్ నాయకుడు జాన్ హీలీ ఇటీవల రక్షణ మంత్రి పదవికి రాజీనామా చేయడంతో, ప్రధాని ప్రతిష్ఠ మరింత క్షీణించింది. దీనికి తోడు ఇటీవల మేకర్‌ఫీల్డ్‌లో బర్న్‌హామ్ సాధించిన నిర్ణయాత్మక విజయం, రిఫార్మ్ యూకేపై లేబర్ పార్టీ మెజారిటీని పెంచడంతో, చాలా మంది ఎంపీలకు ఆయనపై ఆదరణ మరింత బలపడింది. తన క్యాబినెట్ మంత్రులలో చాలామంది రహస్యంగా రాజీనామా చేయమని కోరినప్పటికీ, సర్ కీర్ తన నాయకత్వానికి ఎదురయ్యే సవాలును ఎదుర్కొంటానని మొదట పట్టుబట్టారు. కానీ లేబర్ ఎంపీలలో తనకు తగినంత మద్దతు లేదని ఆయనకు అంతిమంగా నిర్ధారణ కావడంతో రాజీనామా తప్ప మరో మార్గంలేకపోయింది.ఆయన రాజీనామాతో గ్రేటర్ మాంచెస్టర్ మేయర్ ఆండీ బర్న్‌హామ్‌ను డౌనింగ్ స్ట్రీట్‌లోకి తీసుకువెళ్లే అవకాశాలు మెరుగుపడ్డాయి. ఫలితంగా గత పదేళ్లలో యూకేకు ఏడవ ప్రధాని రానున్నారు.

ఆండీ బర్న్‌హామ్ మిత్రుడొకరు మేకర్‌ఫీల్డ్ ఎంపీ పదవికి రాజీనామా చేయడంతో, అప్పటి గ్రేటర్ మాంచెస్టర్ మేయర్‌కు, లేబర్ పార్టీ కిరీటం కోసం పోటీపడటానికి వెస్ట్‌మిన్‌స్టర్‌కు తిరిగి రావాలన్న తన ఆశయాన్ని నెరవేర్చుకోవడానికి మార్గం సుగమమైంది. ఫిబ్రవరిలో జరిగిన ఉప ఎన్నికలో బర్న్‌హామ్ పోటీ చేయకుండా సర్ కీర్ గతంలో అడ్డుకోగలిగారు. కానీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ఎంపీలు ఆయన రాజీనామాను డిమాండ్ చేయడంతో, బర్న్‌హామ్‌ను అడ్డుకునే అధికారం ఆయనకు లేకుండా పోయింది. దీంతో ఇటీవల ఉత్తర ఇంగ్లాండ్‌లోని మేకర్‌ఫీల్డ్‌లో జరిగిన ఉప ఎన్నికలో గెలిచి పార్లమెంటుకు తిరిగి వచ్చిన బర్న్‌హామ్, ఈ అర్హతను సాధించడానికి అవసరమైన మద్దతును కూడగట్టగలిగినట్టు తెలుస్తోంది.

తదుపరి ప్రధాని బర్న్‌హామ్?

స్టార్మర్ స్థానాన్ని భర్తీ చేసే ప్రధాన అభ్యర్థిగా అధికశాతం మంది పరిగణిస్తున్నారు. ఇటీవల జరిగిన మేకర్‌ఫీల్డ్ ఉప ఎన్నికలో ఆయన సాధించిన విజయం ఇందుకు ప్రధాన కారణం. ఒకరకంగా చెప్పాలంటే ఈ విజయం ఆయన స్థానాన్ని మరింత బలోపేతం చేసింది. బర్న్‌హామ్ 55 శాతం ఓట్లను గెలుచుకుని, రిఫార్మ్ యూకేకు చెందిన రాబర్ట్ కెన్యాన్ కంటే 9,200 ఓట్లకు పైగా ఆధిక్యం సాధించారు. నిజానికి ఈ పోటీ చాలా తీవ్రస్థాయిలో వుంటుందని వేసిన అంచనాలను బర్న్‌హామ్ తల్లక్రిందులు చేశారు. గ్రేటర్ మాంచెస్టర్ మేయర్‌గా, బర్న్‌హామ్ లేబర్ పార్టీలో అత్యంత సుపరిచితమైన, ప్రజాదరణ పొందిన రాజకీయ నాయకులలో ఒకరిగా పేరు సంపాదించుకున్నారు. వ్యాపార అనుకూల విధానాలను, నిత్యావసర సేవలపై అధిక ప్రజా నియంత్రణను మిళితం చేసే, తాను పనిచేసిన ఒక నమూనా అయిన "మాంచెస్టర్‌వాదం" నుండి వెస్ట్‌మిన్‌స్టర్ నేర్చుకోవచ్చని ఆయన అన్నారు. లేబర్

పార్టీలోని సాంప్రదాయ కార్మికవర్గ ఓటర్లలో బర్న్‌హామ్‌కు ఉన్న ఆదరణ, రిఫార్మ్ యూకే వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్న ''రెడ్ వాల్'' నియోజకవర్గాలను తిరిగి గెలుచుకోవడానికి లేబర్ పార్టీకి ఉన్న బలమైన ఎంపికలలో ఒకరిగా పార్టీలోని చాలామంది ఆయన్ను పరిగణించేలా చేసింది. స్థానిక ఎన్నికలలో రిఫార్మ్ పార్టీ సాధించిన గణనీయమైన విజయాల తర్వాత బర్న్‌హామ్ ఒక్కసారి వెలుగులోకి వచ్చారు. ఇటీవలి సంవత్సరాలలో దూరమైన ఓటర్లతో తిరిగి సంబంధాలు ఏర్పరచుకోగల నాయకుడు పార్టీకి అవసరమని భావిస్తున్న లేబర్ పార్టీ ఎంపీలకు ఆయన ఒక ఆశాకిరణంలా కనిపిస్తున్నారు. స్టార్మర్‌ను సవాలు చేయాలనే స్పష్టమైన

బర్న్‌హామ్?

ఉద్దేశ్యంతోనే బర్న్‌హామ్ పార్లమెంటులో ప్రవేశించారన్నది సుస్పష్టం. ప్రధాని పదవికి పోటీలో బర్న్‌హామ్ గట్టి పోటీదారుగా ఉన్నారు, వాస్తవానికి స్టార్మర్‌ను ఒక రకమైన నిర్ణయం తీసుకునేలా ఆయన ఒత్తిడి చేశారనే చెప్పాలి.

ఇతర అభ్యర్థుల పరిస్థితేంటి?

ఆరోగ్య శాఖ మాజీ కార్యదర్శి వెస్ స్ట్రీటింగ్ చాలా కాలంగా బర్న్‌హామ్‌కు ప్రధాన ప్రత్యర్థిగా నిలవడమే కాదు, నాయకత్వ పోటీలో పాల్గొంటానని గతంలో సూచించారు. విచిత్రంగా తర్వాత తన మనసు మార్చుకొని ఆయన బర్న్‌హామ్‌కు మద్దతు ప్రకటించారు. మరొక సాధ్యమైన అభ్యర్థిగా లేబర్ పార్టీ మాజీ డిప్యూటీ ప్రధాని ఏంజెలా రేనర్ పేరు తరచుగా వినిపించేది. అయితే, ఆమె కూడా బర్న్‌హామ్‌కే మద్దతు ఇస్తానని సూచించారు. రేనర్ లేబర్ పార్టీలోనూ, కొంతమంది ఎంపీల మధ్యనూ మంచి ఆదరణ కలిగి ఉండటమే కాదు 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో కీలక పాత్ర పోషించారు కూడా. భవిష్యత్తులో పోటీ పడే అవకాశం ఉన్న వ్యక్తిగా రక్షణ శాఖ మాజీ మంత్రి అల్ కార్న్స్ పేరుకూడా ప్రచారంలో వుంది. అయితే, పోటీకి దిగే ముందు ఆయనకు జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు అవసరం కావచ్చు. అందువల్ల ప్రస్తుతం వెనక్కి తగ్గి, భవిష్యత్తులో నాయకత్వ పదవి కోసం పోటీ పడే అవకాశం ఉంది.

ఇంకా ప్రకటించని కాలపట్టిక

ఇక అధికారిక పార్టీ కాలపట్టిక ఇంకా ప్రకటించలేదు, కానీ తన రాజీనామా ప్రసంగంలో సర్ కీర్, తన స్థానాన్ని భర్తీ చేయాలనుకునే అభ్యర్థులు పోటీ చేయడానికి అవసరమైన మద్దతును కూడగట్టుకోవడానికి జూలై 9 నుండి 16 వరకు సమయం ఉంటుందని చెప్పారు. పార్టీ నియమావళి ప్రకారం, అభ్యర్థులను 81మంది లేబర్ ఎంపీలు, అలాగే లేబర్ పార్టీకి చెందిన 634 స్థానిక శాఖలలో 32, లేదా పార్టీకి అనుబంధంగా ఉన్న మూడు సంస్థలు నామినేట్ చేయాలి.

ఒకవేళ బర్న్‌హామ్ మాత్రమే పోటీ చేసినా లేక తగినంత మద్దతు పొందిన నేతగా నిలిచినా అప్పుడు ఆ పోటీ అక్కడితో ముగిసిపోతుంది. ఇతర పోటీదారులు ముందుకు వస్తే, ప్రాధాన్యతా బ్యాలెట్ ద్వారా ఎన్నిక జరుగుతుంది. ఎన్నికలు జరగడానికి కనీసం ఆరు నెలల ముందు నుండి లేబర్ పార్టీలో సభ్యుడిగా ఉన్న ఏ వ్యక్తి అయినా ఓటు వేయవచ్చు. ఏ అభ్యర్థికీ 50 శాతానికి మించి మొదటి ప్రాధాన్యతా ఓట్లు రాకపోతే, తక్కువ ర్యాంకులో ఉన్న అభ్యర్థులను తొలగించి, విజేత తేలేవరకు వారి ఓట్లను పునఃపంపిణీ చేస్తారు. పోటీ ప్రణాళిక ప్రకారం జరిగితే, సెప్టెంబరులో పార్లమెంట్ తిరిగి సమావేశమయ్యేలోపు కొత్త నాయకుడు పదవిలోకి వస్తారని లేబర్ పార్టీ ఆశిస్తోంది. వారసుని ఎంపిక చేసిన తర్వాత, స్టార్మర్ ప్రధాన మంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్టు కింగ్ చార్లెస్‌కు లాంఛనంగా తెలియజేస్తారు, ఆ తర్వాత రాజు కొత్త లేబర్ నాయకుడిని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆహ్వానిస్తారు.

దశాబ్దకాలంగా రాజకీయ అనిశ్చితి

గత దశాబ్ద కాలంగా బ్రిటన్ రాజకీయాల్లో అనిశ్చితి నెలకొనడంతో పాటు వరుస ఆర్థిక సంక్షోభాలు, బ్రెగ్జిట్ ప్రభావం, సొంత పార్టీలోనే అంతర్గత కుమ్ములాటలు వంటి సమస్యల కారణంగా ప్రధానులు పదే పదే రాజీనామా చేయాల్సి వస్తోంది. గత దశాబ్ద కాలంగా (2016 నుండి) యూకే ప్రధాన మంత్రులు వరుసగా రాజీనామా చేయడానికి గల ప్రధాన కారణం రాజకీయ అస్థిరత అనే చెప్పాలి. 2016లో యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలగాలన్న ప్రజాభిప్రాయ సేకరణ నిర్ణయం బ్రిటన్ రాజకీయాలను, ఆర్థిక వ్యవస్థను కుదిపేసింది. ఈ నిర్ణయాన్ని సరిగ్గా అమలు చేయలేక డేవిడ్ కామెరాన్, థెరిసా మే వంటివారు పదవులను వదులుకోవాల్సి వచ్చింది. బ్రెక్సిట్ ప్రజాభిప్రాయ సేకరణ (రిఫరెండం)లో యూకే ప్రజలు యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుండి విడిపోవడానికి ఓటు వేయడంతో, దానికి వ్యతిరేకంగా ప్రచారం చేసిన కామెరాన్ రాజీనామా చేశారు. బ్రెక్సిట్ ఒప్పందాన్ని బ్రిటన్ పార్లమెంట్‌లో ఆమోదింపజేయడంలో వరుసగా విఫలం కావడంతో, స్వంత పార్టీ ఒత్తిడి తట్టుకోలేక థెరిసా మే రాజీనామా చేయాల్సి వచ్చింది. అధికార కన్జర్వేటివ్ (టోరీ) పార్టీలో వివిధ సిద్ధాంతాల మధ్య తీవ్రమైన అంతర్గత విభేదాలు ఉన్నాయి. ప్రధానుల విధానాలు నచ్చనప్పుడు సొంత పార్టీ ఎంపీలే తిరుగుబాటు చేసి, నాయకత్వ మార్పు కోసం ఒత్తిడి తెచ్చారు. ఎందుకంటే బ్రిటన్‌లో ఓటర్లు నేరుగా ప్రధానమంత్రిని ఎన్నుకోరు. అధికార పార్టీలోని ఎంపీలు తమ నాయకుడిని ఎన్నుకుంటారు. సొంత పార్టీ సభ్యుల మద్దతు కోల్పోయినా లేదా బలమైన ప్రత్యర్థులు పార్టీలో తిరుగుబాటు చేసినా ప్రధాని పదవి నుంచి తప్పుకోవాల్సి వస్తుంది. ఉదాహరణకు, బోరిస్ జాన్సన్, కీర్ స్టార్మర్ వంటి వారు సొంత పార్టీ సభ్యుల ఒత్తిడి వల్లే రాజీనామా చేశారు. కోవిడ్-19 లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘించి డౌనింగ్ స్ట్రీట్‌లో పార్టీలు చేసుకోవడం ('పార్టీగేట్' సంక్షోభం), ఇతర లైంగిక ఆరోపణల వివాదాల వల్ల సొంత మంత్రులు వరుసగా రాజీనామా చేయడంతో బోరిస్ జాన్సన్ పదవి నుండి తప్పుకున్నారు. కోవిడ్ మహమ్మారి, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాల ప్రభావంతో బ్రిటన్‌లో జీవన వ్యయం విపరీతంగా పెరిగింది. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడంలో, ఆర్థిక వృద్ధిని సాధించడంలో గత ప్రభుత్వాలు విఫలం కావడం పెద్ద మైనస్‌గా మారింది.

లిజ్ ట్రస్ ప్రవేశపెట్టిన 'మినీ-బడ్జెట్' తీవ్ర ఆర్థిక సంక్షోభానికి దారితీసింది. పౌండ్ విలువ దారుణంగా పడిపోవడంతో కేవలం 45 రోజుల్లోనే ఆమె రాజీనామా చేయాల్సి వచ్చింది (బ్రిటన్ చరిత్రలోనే అత్యంత తక్కువ కాలం పనిచేసిన ప్రధానిగా ఆమె మిగిలిపోయారు). తర్వాత ఆర్థిక ఇబ్బందులు, దేశంలో జీవన వ్యయం పెరగడం వల్ల కన్జర్వేటివ్ పార్టీ ప్రజాదరణ కోల్పోయింది. చివరకు 2024 సార్వత్రిక ఎన్నికలలో లేబర్‌పార్టీ చేతిలో ఘోర పరాజయం పాలవడంతో రిషి సునక్ రాజీనామా చేశారు.

జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

సవాళ్లు, 'ప్రపంచ

దేశ ప్రగతికి, పతనానికీ కారణం జనాభా. అడ్డూ అదుపు లేని జనాభా పెరుగుదల ఆకలి, దారిద్ర్యాలను మిగులుస్తుంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలకు కారణమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా పట్టణీకరణ శరవేగంగా పెరుగుతుంటే మరోవైపు వనరుల లేమి వెంటాడుతోంది. సకాలంలో ప్రభుత్వాలు సరైన నిర్ణయాలు తీసుకోని పక్షంలో మౌలిక వసతుల లేమి, నిరుద్యోగం వంటి సమస్యలు ప్రగతికి ఆటంకంగా మారతాయి.

సైన్స్, మెడిసిన్ రంగాల్లో వచ్చిన అభివృద్ధి కూడా జనాభా పెరుగుదలకు ఒక కారణం. వీటి కారణంగానే శిశు మరణాల రేటు తగ్గిపోవడంతో పాటు (ఎక్కువమంది పిల్లలు యుక్త వయస్సు వరకు), చాలామంది వృద్ధాప్యంలో కూడా మనుగడ కొనసాగిస్తున్నారు. ఇకముందు కూడా ఇదే కొనసాగనున్న నేపథ్యంలో 2050 నాటికి ప్రపంచ సగటు ఆయుర్దాయం 77.2 సంవత్సరాలుగా ఉండనుంది.

భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా అవతరించింది. ఐక్యరాజ్య సమితి అంచనా ప్రకారం ప్రస్తుతం మన దేశ జనాభా 146.39 కోట్లుగా ఉంది. 1901లో దేశ జనాభా 23.6 కోట్లు. 1911లో 25.2 కోట్లు, 1921లో 25.1 కోట్లు, 1951లో 36.1 కోట్లు, 2001లో 102.8 కోట్లు, 2011లో 121కోట్లుగా ఉంది. భారతదేశంలో పూర్వం రాజుల కాలంలోనూ జనగణన జరిగేదని చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. అవి రాతపూర్వకంగా లేకపోవడమో లేదా ఆధారాలు లభించకపోవడంతో పాటు దేశమంతా చిన్న రాజ్యాలుగా ఉండటం వల్ల నాటి వివరాలేవీ లభ్యం కాలేదు.

రుగ్వేదకాలంలో జనగణన జరిగినట్టు కొన్ని ఆధారాలున్నాయి. 4,5 శతాబ్దాల్లో జనాభా లెక్కింపు జరిగినట్టు బౌద్ధ సాహిత్యంలో ప్రస్తావన ఉంది. అలెగ్జాండర్ దండయాత్ర సమయంలో భారతదేశ జనసాంద్రత క్రిక్కిరిసి ఉండేదని అలెగ్జాండర్ సేనలు ప్రస్తావించాయి. మౌర్య సామ్రాజ్యంలో జనగణన జరిగినట్టు కౌటిల్యుడు రాశాడు. ఒక అంచనా ప్రకారం సాధారణ శకం 1600లో దేశ జనాభా 10కోట్లు. ఇది 1800లో 12కోట్లకు చేరింది. 1841లో 13కోట్లు, 1871లో 22.5కోట్లకు చేరింది. 1871 నుంచి 2011 వరకు దేశంలో 15 సార్లు జనగణన జరిగింది. ప్రస్తుతం 16వ జనగణన జరుగుతోంది. 1901–21 మధ్య కాలంలో అంటే 19వ శతాబ్దంలో జనాభా పెరుగుదల నెమ్మదిగా సాగింది. 1901–11 మధ్య కాలంలో పెరుగుదల రేటు కేవలం 5.42 శాతం మాత్రమే. 1921–51 మధ్య కాలంలో దేశ జనాభా 25.1 నుంచి 36.1 కోట్లకు పెరిగింది.

మూడు దశాబ్దాల కాలంలో 47.3శాతం జనాభా వృద్ధిరేటు నమోదైంది. దీన్ని స్థిరమైన వృద్ధిరేటుగా పరిగణిస్తారు. 1951–81 మధ్య కాలంలో జనాభా విస్ఫోటనం జరిగింది. 1951లో 36.1 కోట్ల నుంచి ఏకంగా 68.33 కోట్లకు పెరిగింది. 30 ఏళ్ల కాలంలో 89.36శాతం వృద్ధి రేటు నమోదైంది. 1981–2011 మధ్య కాలంలో వృద్ధి రేటు ఎక్కువగా ఉన్నప్పటికీ 1981తో పోలిస్తే తక్కువనే చెప్పాలి.

భారతదేశం కేవలం జనాభా పెరుగుదల వల్ల ఎదురవుతున్న సవాళ్లనే కాదు, జనాభా నిష్పత్తిలో మతపరమైన ప్రాబల్యాలు మారుతుండటంతో అధిగమించలేని సమస్యల వైపు పయనిస్తోంది. కేంద్ర ప్రభుత్వం 'డెమోగ్రఫీ'లో వస్తున్న మార్పులపై ఇటీవలే దృష్టి సారించింది. చొరబాట్లు, ఇతర కారణాలతో ఏర్పడే జనాభా మార్పు ఏ దేశానికైనా పెను సవాలే. జనాభా నిష్పత్తుల్లో వస్తున్న మార్పులను అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఇటీవలే నియమించింది. రిటైర్డ్ జడ్జి ప్రకాశ్ ప్రభాకర్ నవ్‌లేకర్ ఈ కమిటీకి నేతృత్వం వహించనున్నారు.

కమిటీలో మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి, జనగణన కమిషనర్ సభ్యులుగా ఉంటారు. అక్రమ వలసలు, సరిహద్దుల్లో చొరబాట్లు, ఇతర అసాధారణ కారణాలతో దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న మార్పులతో పాటు మత, సామాజికవర్గాల వారీగా జనాభా మార్పుల నరళిని ఈ కమిటీ సమగ్రంగా విశ్లేషించనుంది. దీనికి తగిన పరిష్కారాల్ని కూడా కమిటీ సూచించనుంది.

సరిగ్గా ఇదే సమయంలో కేంద్ర ఎన్నికల కమిషన్ దేశ వ్యాప్తంగా 'ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ'–సర్ ప్రక్రియను చేపట్టింది. సకాలంలో కేంద్రం సంస్కరణలకు నడుం బిగించింది. ఇప్పటికే 16 రాష్ట్రాల్లో 'సర్' ప్రక్రియ పూర్తయింది. కొన్ని కోట్లమంది అక్రమ ఓటర్ల పేర్లను ఈసీ తొలగించింది. సరైన పత్రాలు సమర్పించిన వారిని తిరిగి ఓటరు జాబితాలో చేర్చింది. జాతీయ పౌర పట్టిక–ఎన్.పి.ఆర్.పై కసరత్తు జరుగుతోంది.

దేశ నికర జనాభా ఎంతో తేల్చేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక ప్రయత్నాలు, ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 2019లో పౌరసత్వ చట్టానికి సవరణలు ప్రతిపాదించి, తదుపరి చట్టం చేసింది. అక్రమ వలసల సమస్య భారతదేశ సార్వభౌమత్వానికి, జాతీయ భద్రతకు, సామాజిక సమతుల్యతకు, గిరిజన సమాజాల పరిరక్షణకు పెనుసవాలుగా పరిణమించింది. త్రిపుర, అసోం, బెంగాల్ రాష్ట్రాల్లో అక్రమ చొరబాట్ల సమస్య తీవ్రంగా ఉండటంతో కేంద్రం ఉన్నత స్థాయి కమిటీని నియమించింది.

ఈ తరహా విధాన నిర్ణయాలకు ప్రాతిపదిక దేశ జనాభాపై, అక్రమ చొరబాట్లపై అదుపు కలిగి ఉండటం కోసమే అని గతంలోనే కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. నికరం తేలితే తకరారు తీరుతుంది. ఇదీ కేంద్రం అనుసరిస్తున్న సూత్రం. ప్రపంచవ్యాప్తంగా జనాభా 800 కోట్లను ఎప్పుడో దాటేసింది. కొన్ని దేశాల్లో జనాభా సంఖ్య భారీగా తగ్గిపోతోంది. యూరప్ దేశాల్లో జననాల రేటు వేగంగా తగ్గిపోతోంది. అలాగే వృద్ధుల జనాభా విపరీతంగా పెరిగిపోతోంది. దీంతో ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నం అవుతున్నాయి.

ప్రపంచంలో అత్యంత అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలున్న దేశాలు ఇప్పటికే జనాభా క్షీణతను ఎదుర్కొంటున్నాయి. జనాభా క్షీణతలో ప్రపంచంలోనే దక్షిణ కొరియా మొదటిస్థానంలో ఉంది. ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఫ్యూచర్ నివేదిక ప్రకారం, 2125 నాటికి దక్షిణ కొరియా జనాభా 11.15 మిలియన్లకు, అంటే 15%కి తగ్గుతుందని అంచనా. ఇది ప్రపంచంలో అతి తక్కువ జనన రేటు. జపాన్ కూడా జనాభా క్షీణత సమస్యను ఎదుర్కొంటోంది. తక్కువ జనన రేటు, ఎక్కువ జీవనకాలం వల్ల జపాన్ జనాభాలో వృద్ధాప్యం రేటు పెరుగుతోంది.

సంస్కరణల మధ్య జనాభా దినోత్సవం'

జపాన్‌లో 100 ఏళ్లు దాటిన వృద్ధుల సంఖ్య భారీగానే ఉంది. చైనా జనాభా 2100 నాటికి 63 కోట్ల 30 లక్షలకు తగ్గుతుందని అంచనా. భారత్ జనాభా 2061నాటికి 1.7 బిలియన్లకు చేరుకుని, ఆ తర్వాత క్రమంగా తగ్గి 2100 నాటికి 1.5 బిలియన్లకు చేరుకుంటుందని అంచనా. ఇక మరోవైపు ప్రపంచవ్యాప్తంగా ముస్లిం జనాభా శరవేగంగా పెరుగుతోంది. భారత్‌లో సైతం ఇదే ధోరణి వ్యక్తమవు తోంది. ముస్లిం జనాభాలో మన దేశం ఇండోనేసియాను దాటిపోయింది. ముస్లింల జనాభా 23.9% నుంచి 25.6శాతానికి పెరిగింది. ఇంచుమించుగా క్రైస్తవ జనాభాకు సమానంగా ఎదుగుతోంది. హిందువులు 15% నుంచి 14.9శాతానికి తగ్గిపోయారు. 2010లో భారత్‌లో హిందువుల జనాభా 80% కాగా.. 2025నాటికి ఇది 79 శాతానికి పడిపోయింది. అదే సమయంలో భారత్‌లో ముస్లింల జనాభా14.3% నుంచి 15.2 శాతానికి పెరిగింది. కజకిస్తాన్, బెనిన్, లెబనాన్, ఒమన్, టాంజానియా దేశాల్లో ముస్లింల జనాభా గణనీయంగా పెరిగింది. యూరప్‌లో ఫ్రాన్స్, జర్మనీ, యూకేల్లో సైతం ముస్లిం జనాభా రోజు రోజుకూ పెరుగుతోంది. 1950తో పోల్చుకుంటే 2015లో హిందువుల జనాభా వాటా 7.82శాతం తగ్గిందని గణాంకాలు చెపుతున్నాయి. అదే సమయంలో ముస్లిం జనాభా వాటా 43 శాతం పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా 38 ఇస్లామిక్ దేశాల్లో మెజారిటీ మతస్తుల సంఖ్య పెరిగింది. భారతదేశంలో వేగవంతమైన జనాభా పెరుగుదల నిరుద్యోగ సమస్యను సృష్టిస్తోంది. ఉద్యోగాల లభ్యత కంటే ఉద్యోగార్థుల సంఖ్య విపరీతంగా ఉంది. దీంతో విపరీతమైన పోటీ ఏర్పడింది.

ప్రపంచంలో ఏ దేశానికీ లేని అద్భుతమైన అనుకూలత మన దేశానికి ఉంది. జనాభా అత్యధికంగా ఉన్నప్పటికీ యువ జనాభా అధికంగా ఉంది. శ్రమశక్తిని, మేధాశక్తిని వెచ్చించే యువత ఉండటంతో మన దేశంలోని ఉత్పాదక పరిశ్రమలు లాభాల బాటలో నడుస్తాయి. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి పథంలో ఉన్నప్పుడు శ్రమశక్తిని, మేధాశక్తినీ వెచ్చించే యువతను సద్వినియోగం చేసుకోవడం ద్వారా దేశం ప్రగతిపథంలో పయనిస్తుంది. దేశంలో సుమారు 41శాతానికి పైగా 20 ఏళ్లలోపు వయసువారే ఉన్నారు. స్వల్పకాలంలోనే దేశ స్వరూప, స్వభావాలు గుణాత్మకంగా మారిపోనున్నాయి. జనాభాలో యువకుల సంఖ్య ఎక్కువ ఉన్న ప్పుడు 'పాపులేషన్ డివిడెండ్' అనే భావనకు ప్రాధాన్యత ఏర్పడు తుందంటారు 'డెమోగ్రఫర్లు. ఈ కారణంగానే కేంద్ర ప్రభుత్వం యువ జనాభాపై దృష్టి సారించింది. అందుకే 'స్కిల్ డెవ్‌లప్‌మెంట్ 'అనే మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది. యువ జనాభా ఉండటం మాత్రమే కాదు, వారికి అవసరమైన నైపుణ్య అభివృద్ధి తప్పనిసరిగా ఉండాలనే ఉద్దేశంతో దేశవ్యాప్తంగా స్కిల్ డెవ్‌లప్ మెంట్‌ను ప్రోత్సహిస్తోంది. 2016లోనే కేంద్ర ప్రభుత్వం 50కోట్ల మంది యువకులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్య నిర్దేశం చేసుకుంది. స్టార్టప్, మేక్ ఇన్ ఇండియా వంటి విధాన నిర్ణయాలు అందులో భాగమనే చెప్పాలి.

2025, డిసెంబర్ 15న భారత ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వ్యక్తుల నిరుద్యోగిత రేటు 2025, నవంబర్‌లో 4.7శాతం తగ్గింది. 15 సంవత్సరాలు అంతకంటే ఎక్కువ వయసున్న వ్యక్తుల మొత్తం కార్మిక జనాభా నిష్పత్తి (వర్కర్ పాపులేషన్ రేషియో) 2025, అక్టోబర్ నాటికి 52.5 శాతం నుంచి 53.2శాతానికి మెరుగుపడింది. ప్రపంచ బ్యాంకు 2025, ఏప్రిల్‌లో భారతదేశంలో పేదరిక గణాంకాలను ప్రకటించింది. పదేళ్లలో 17.1 కోట్లమంది ప్రజలు పేదరికం నుంచి బయటపడినట్లు ప్రకటించింది. రోజుకి 2.15 డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో జీవించే ప్రజల శాతం 2011-12లో 16.2శాతం ఉండగా 2022-23లో 2.3శాతానికి తగ్గిందని తేల్చింది. గ్రామీణ ప్రాంతాల్లో 2011-12లో 18.4 శాతంగా ఉన్న తీవ్ర పేదరికం 2022-23 నాటికి 2.8శాతానికి తగ్గింది. అదే కాలంలో పట్టణ ప్రాంత పేదరికం 10.7శాతం నుంచి 1.1శాతానికి తగ్గింది.

2011-12లో దేశంలో అత్యంత పేదరికంలోని 65శాతం మంది 5 అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్‌లో ఉన్నారు. 2022-23నాటికి ఈ రాష్ట్రాల్లో తీవ్ర పేదరికం మూడింట రెండో వంతుకు తగ్గింది. ఇలాంటి పరిస్థితుల్లో జనాభా నియంత్రణ మేలా, నిర్వహణ ప్రయోజనకరమా అనేది భారత్ ముందున్న సవాలు. అయితే నియంత్రణతో పాటు నిర్వహణకు ప్రాధాన్యమివ్వా లని కేంద్రం భావిస్తోంది. ఉపాధి కల్పన, నైపుణ్య శిక్షణపై దృష్టి సారించింది. అంటే కేంద్ర ప్రభుత్వం ద్విముఖ వ్యూహాన్ని అనుసరిస్తోంది. జనాభా నియంత్రణ, నిర్వహణ శాస్త్రీయంగా నిర్వహించేం దుకు తగు చర్యలు తీసుకుంటోంది. సమగ్రమైన, శాస్త్రీయమైన చర్యలవైపు అడుగులు వేస్తోంది.

పద్మావతి గంధవరపు, స్కాలర్

కథ

అమ్మనెవ్వరివి

గౌతమ్ లింగా (దక్షిణాఫ్రికా)



నా పేరు దుర్గ, అమ్మవారి పేరు. రూపం కూడా అలాంటిదే అని అందరూ అంటుంటే మా నాన్న మురిసిపోయే వారు. అమ్మానాన్నలకు నేనొక్కదాన్నే. నాన్న మా ఊర్లోనే మాకున్న ఇటుకబట్టీలు పొలాలు చూసుకునే వారు. సరిపోయినంత ఆస్తి దానితో పాటు స్వతహాగా నాకున్న అల్లరి కారణంగా అల్లారుముద్దుగా పెరిగాను. పెళ్లయ్యేదాకా కనీసం వంటగదికి వెళ్లాల్సిన అవసరమైనా రాలేదు. మా ఇంట్లో నా మాటకి అడ్డుగోడలుండవు. ఎక్కువసార్లు నవ్వడం, కొన్నిసార్లు నవ్వించడం,అన్నిసార్లూ అల్లరిపనులు చేయడంతో నా బడి చదువు మా ఊర్లోనే పూర్తయింది. కాలేజీ చదువుకి బస్సులో వెళ్లేదాన్ని. మొదటి ఆర్నెల్లు చాలా సరదాగా గడిచాయి. కొత్త స్నేహితులు, రెక్కలొచ్చిన వయసు కొత్త ఉత్సాహాన్ని మోసుకొచ్చింది. నాకెందుకో ఆ రోజులు చాలా నచ్చాయి. పెద్దగా చదవకపోయినా మంచి మార్కులే వచ్చేవి. నా కొచ్చే గొప్ప మార్కుల కోసం మా ఊర్లోనో, మా ఇంట్లోనో ఎదురుచూసే వాళ్లెవ్వరూ లేరు కాబట్టి నేను కూడా వాటికోసం ప్రయత్నించ లేదు.

ఒకరోజు బస్సులో కిటికీ పక్కన కూర్చొని చిన్నగా నిద్ర ఒళ్లోకి వెళ్లబోతున్నాను, పక్కనే ఉన్న అనిత నన్ను సున్నితంగా లేపి "దుర్గమ్మా! రోజూ నీ కిటికీ పక్కనే బండి మీద వచ్చే వాడెవడమ్మా?"అనడిగింది.

నాకేమీ అర్థం కాలేదు. "ఏంటీ??" అన్నాను.

"నువ్వు కిటికీ పక్కనే కూర్చోవడం, నీ పక్కనే ఎవడో రోజూ బండిమీద నిన్నే చూసుకుంటూ రావడం నేను రోజూ చూస్తున్నా" అని అనిత అనగానే ముందు భయమేసింది. తరువాత అబద్ధం అనిపించి బయటకు చూస్తే.. నిజంగానే ఎవరో బండి మీద నా పక్కనే వస్తున్నాడు. ఒక్క క్షణం గుండె ఆగినంత పనయ్యింది. వెంటనే కిటికీ మూసేసి వేరే సీట్లోకి మారిపోయాను. కానీ ఏదో ఉత్సుకత నన్ను వెంటాడుతూనే ఉండేది. నిజంగానే నాకోసం వస్తున్నాడా? నేనే తప్పుగా అర్థం చేసుకుంటున్నానా? అనే సందేహం కలిగినా, మళ్లీ అటువైపు చూసే ధైర్యం చేయలేదు. వారం రోజులు గడిసే దాకా ఎప్పుడూ కిటికీ పక్కన కూర్చోలేదు.

కానీ ఒకరోజు 'నేనేమీ తప్పుచేయలేదు, నాకు నచ్చిన చోట నేను ఎందుకు కూర్చోకూడదు' అనిపించి. అదే కిటికీ సీటులో కూర్చున్నా. ఓ అరగంటకి నా పక్కన ముదురు నీలంరంగు బైక్ ప్రత్యక్షమైంది. అతని ముఖం చూసే ధైర్యం చేయలేదు. కానీ పొడుగుగా పెరిగిన నల్లని జుట్టు, వీపుకి తగిలించుకున్న ముదురు ఖాఖీ రంగు బ్యాగు, గేర్లు వేయడానికి ముందుకీ వెనక్కీ ఆడిస్తున్న కాళ్లు, వాటికి తగిలించిన నలుపు తెలుపు కాన్వాస్ షూస్, మణికట్టుకు ఏవో పూసలదండ ఇవన్నీ కనిపించాయి. 'నాకోసమే వస్తున్నాడు' అని నేను అనుకోవడం వల్లనే నాకు భయం భయంగా ఉంది. కానీ నేను అలా అనుకోకపోతే ఏ సమస్యా ఉండదని అటువైపు చూడడం మానేసాను.

నేను బస్సు దిగే సమయానికి ఆ బండి అక్కడే ఉండేది. నన్నే చూస్తుంటే ఇబ్బందిగా కూడా అనిపించేది కానీ నిజంగా నన్ను ఎప్పుడూ ఇబ్బంది పెట్టలేదు కనీసం నాతో మాట్లాడడానికి కూడా ఆతను ప్రయత్నించలేదు కాబట్టి నాకే సమస్యా కనబడలేదు. రోజులు ఎన్ని గడుస్తున్నా ఇదే జరుగుతూ వస్తుంది. నా పక్కనే నాకు తెలియని వాడొకడు నన్నే గమనిస్తూ ఉండడం ఒక్కోసారి విచిత్రంగా ఆశ్చర్యంగా కూడా అనిపించేది. ఎప్పుడైనా అతను లేడు అనిపిస్తే ఏదో కోల్పోయినట్టు అనిపించేది. ఒకరోజు బస్సుదిగి త్వరత్వరగా నడుచుకుంటూ మా ఇంటికి వెళ్లి పైన అంతస్తులో నా గది కిటికీ లోంచి బయటకు చూస్తే మా ఇంటినే చూస్తున్న బండివాడు కనిపించాడు. అందమైన ముఖం, చురుకైన కళ్లు. అలా రెండుమూడు నిమిషాలు అతన్నే చూస్తుండి పోయాను. కొంతసేపటి తరువాత ఇంకెప్పుడైనా బయట కనిపిస్తే గట్టిగా అడిగెయ్యాలనిపించింది. నాకు కూడా భయమే కానీ ఇలానే ఉండడం మరీ కష్టం. గట్టిగా కడిగిపారేద్దామని నిశ్చయించుకొని పొద్దున్నే కాలేజీకి బస్సెక్కాను. బస్సు దిగగానే ఆ బండి నా పక్కనుంచి వెళుతోంది. నేనే అతన్ని "ఆగు" అన్నాను.

"ఎందుకు మీరు నా వెంట వస్తున్నారు, చాలా రోజులనుంచీ చూస్తున్నా.. నాతో ఏమైనా పనా?

నేను మీకు తెలుసా?" ఇలా పదుల సంఖ్యలో ప్రశ్నలు అడుగుతూనే ఉన్నా. ఏ సమాధానం లేదు అడిగే అడిగే నేనే వెళ్లిపోయా. నేనేవైనా తప్పుగా ప్రవర్తించానా అని భయమేసింది. ఇంతకుముందు ఎవరి మీదా అలా చనువుగా అరచినట్టు నాకు గుర్తులేదు ఒక్క మా నాన్నతో తప్ప. అతనితో మాట్లాడేటప్పుడు బయటకి ధైర్యంగా ఉన్నా లోపల నా ఒళ్లంతా చమటలు పట్టి వణికినట్టు అనిపించింది. కానీ ఎలానో అడిగేసా. అతను బాధపడి ఉంటే మళ్లీ రాడు అనుకుని నా దారిలో నేను వెళ్లిపోయా.

కానీ సాయంత్రం మళ్లీ అదే తంతు. మాటలురాని ఆ బండి, మాట్లాడని ఆ నడిపేవాడు నన్నే అనుసరిస్తున్నారు. నాకెందుకో ఒక్క నిమిషం జాలేసింది. పాపం నేనే లోకమైనట్టు నన్నే చూస్తూ ఒకమనిషి ఉండడం ఇదే మొదటిసారి. ఈ సారి వీలయితే మంచిగా మాట్లాడాలి అనిపించింది. కొన్ని రోజుల తరువాత ఒకరోజు సాయంత్రం అంతపనీ చేసాను. ఈ విషయంలో నాకు ధైర్యం ఎక్కువేనేమో? నాకు కూడా తెలియదు. అతని మాటల్లో "నేనంటే తనకు ఇష్టమనీ. అందుకే నా వెంట పడుతున్నాడనీ, అతని భాషలో ఆ వెంటబడడాన్ని 'ప్రేమ' అంటారనీ'' చెప్పాడు. నేను ఏం మాట్లాడకుండా ఇంటికి వెళ్లిపోయా. మంచివాడి లాగానే అనిపిస్తున్నాడు. ఏం చేయాలో అర్థం కాలేదు.

నాకు పెళ్లి చేయాలని ఒకరోజు మా ఇంట్లో మాట్లాడుకుంటున్నారు. ఇది ఇంతకుముందు కూడా చాలాసార్లు జరిగింది. కొన్నిసార్లు నన్ను చూసి వెళ్లారు కూడా. ఏవో కారణాల వల్ల అవి ముందుకు జరగలేదు. నన్ను చూడడానికి ఎవరో వస్తున్నారని ఆరోజు కాలేజీకి వెళ్లకుండా ఇంట్లో ఉండమనగానే మొదటిసారి కంగారుగా అనిపించింది. వాళ్లెవరో వచ్చారు చూసి వెళ్లారు. ఏ కారణం లేకుండానే నాకు నచ్చలేదు. సాయంత్రం నా గదిలోంచి చూస్తే బయట



ఆతను ఉన్నాడు. ఏవో ఆలోచనల్లో ఎప్పటికో నిద్రపోయాను.

పొద్దున్నే లేచి మా నాన్నతో "నేను పెళ్లి చేసుకోను" అన్నాను.

"ఎందుకు?" అన్నారు?

" ఇష్టంలేదు" అన్నాను.

మంచి సంబంధమని ఏవేవో చెప్పారు. ఒక్కసారిగా ఎందుకో నేను ఒకతన్ని ప్రేమించాను. సాయంత్రం ఇంటికి తీసుకొస్తానని చెప్పాను. మా అమ్మానాన్న ఒక్కమాటకూడా మాట్లాడలేదు. మాట్లాడలేకపోయారేమో? నేను నిజంగా ప్రేమిస్తున్నానా? లేదో కూడా నాకు తెలియదు. ఆ క్షణం ఎందుకు అలా అన్నానో కూడా ఇప్పుడు అర్థం అవ్వట్లేదు. కానీ ఆ ధైర్యం, చనువు మాత్రం మా నాన్న ఇచ్చిందే. చిన్నప్పటి నుంచీ నా మీద ప్రేమే మా నాన్నని నడిపిస్తుంది. నేనే మా నాన్నకు లోకం. నేను ఏం చేసినా సమర్థించేవాడు. బహుశా ఇప్పుడు కూడానేమో? ఆ రోజు సాయంత్రం అతన్ని ఇంటికి తీసుకొచ్చాను. ఎన్నో మాటలు ఏడ్పులూ అలగడాలూ తరువాత మా నాన్న అతనితో నా పెళ్లి చేయడానికి ఒప్పుకున్నాడు. నా చదువుని విసిరి పారేసి పెళ్లి పీటలెక్కాను. అంతకుముందుండెన్నడూ ఆ చుట్టుపక్కల జరగనంత వైభవంగా జరిగింది నా పెళ్లి.

మూడు ముళ్లేసుకొని మూడు నెలలైంది. మా మామయ్య ఎప్పుడో చని పోయారు. అత్తయ్య ఒక్కత్తే ఉన్నారు. మా ఆయన పదోతరగతి కూడా పూర్తి చేయలేదని నాకు పెళ్లయ్యాక తెలిసింది. వాళ్లకి ఉన్న మూడెకరాల పొలం చూసుకుంటూ ఉండేవారు. కానీ చాలా మంచివారు. ఎవ్వరినీ ఒక్కమాటకూడా అనరు. వాళ్ల ఊళ్లో ఆయనకి సౌమ్యుడిగా మంచి పేరుంది. కానీ మా అత్తయ్య గయ్యాళి. ఏదో ఒక కారణంగా మా ఇద్దరితో గొడవలు పెట్టుకునేది. కొన్నాళ్లు విడిగా ఉన్నాం. ఆవిడ ఆరోగ్యం బాలేదనీ వాళ్లతో వీళ్లతో చెప్పించి మమ్ముల్ని మళ్లీ ఇంటికి రప్పించింది. ఇక్కడ వ్యవసాయం సరిగా జరగక మా పుట్టింటి నుంచే డబ్బులు వస్తుండేవి. అయినా ఎందుకో మా అత్తయ్య నన్ను ఎప్పుడూ ఏదో ఒక కారణంగా తిడుతూ ఉండేది. ఈ లోపు మేము ముగ్గురం నలుగురం అవ్వబోతున్నామని తెలిసింది. ఆ కారణంగా నేను మా పుట్టింటికి వెళ్లాను. మాకు కొడుకు పుట్టాడు. వాడిని తీసుకొని అత్తగారింటికి రావాలంటే కష్టంగా అనిపించింది. వచ్చిన నెలకి నాకూ మా అత్తయ్య మధ్య పెద్ద గొడవ జరిగింది. నేను కూడా సహనం కోల్పోయి గట్టిగట్టిగా అరిచాను. మా అయన అన్నీ విని ఆ రాత్రి ఎటో వెళ్లాడు. ఆయనే వస్తాడులే అని నేనూ, బాబూ పడుకున్నాము.

ఈ మాటలు రాయడం తప్పించుకుందామని చాలా ప్రయత్నిస్తున్నాను. రాస్తుంటే ఏడుపు కట్టలు తెంచుకొని వస్తుంది. మరుసటిరోజు పొద్దున్న పదిమంది ఎవర్నో మోసుకుంటూ వస్తున్నారు. వచ్చీ వచ్చీ మా ఇంటి ముందు ఆ మనిషిని పడుకోబెట్టారు. ఆ పడుకున్న మనిషి నాకు తెలుసు. అతనే నేను కాలేజీకి వెళ్తుంటే నా పక్కన బండి వేసుకొచ్చింది. అతనే నేను మా నాన్నముందు నిలబెడితే కనీసం ఇంట్లో అడగకుండా నన్ను పెళ్లి చేసుకుంటా అని ప్రమాణం చేసింది. అతనే నన్ను నా బిడ్డని వందేళ్లు

జాగ్రత్తగా చూసుకుంటానని నమ్మించి మోసం చేసింది. ఇలా నిర్దాక్షిణ్యంగా నన్ను వదిలేసి ఆత్మహత్య చేసుకొని తప్పించుకొని వెళ్లిపోతే నేను ఏం చేయను? భూమి పగిలి అందులో నేను కూరుకుపోతున్నానా? ఆకాశం నామీద కూలిపోతుందా? అర్థం అవ్వలేదు. బాధ ఇంత తీవ్రంగా ఉంటుందని ఆ క్షణం దాకా నాకు తెలియదు. ఇంట్లో తలకొరివి పెట్టడానికి కూడా ఎవరూ లేరు. మా నాన్నే అల్లుడికి తలకొరివి పెట్టాడు. పదినెలల పిల్లాడితో నన్ను తనతో పాటు మా ఇంటికి తీసుకెళ్లాడు.

ఓ చీకటి గదిలో ఎన్నో నెలలు గడిసిపోయాయి. నేను అల్లరిగా చనువుగా తిరిగిన ఈ ఇల్లు నా బాధని చూడడం ఇదే మొదలు. వందల తుపాన్లకి తట్టుకున్న మా ఇల్లు కూడా నా కన్నీరు కురవకుండా మాత్రం ఆపలేకపోయింది. ఏడ్చి ఏడ్చి ఒక్కోసారి రాత్రిళ్లు, పగళ్లు నా కన్నీటిలో పడి కనబడకుండా పోయేవి. దీనికి కారణం నేనా? మా అత్తయ్యా? బతకడానికి ధైర్యంలేని మా ఆయనా? ఎవరో కూడా నాకు అర్థం కాలేదు. నెలలు సంవత్సరాలు అవుతున్నాయి. బాబుని చూసుకుంటూ బతకడం ఒక్కటే ఇప్పుడు నేను చేయాల్సిన పని.

బాబుకి ఇప్పుడు మూడు సంవత్సరాలు. ఎందుకో బాగా లావు అవుతున్నాడనిపించి ఒకరోజు హాస్పిటల్‌కు తీసుకెళ్లాము. చాలా పరీక్షల తరువాత, చాలామంది డాక్టర్లకు చూపించాక బాబుకి ఆటిజం అనే మానసిక సమస్య అని తేల్చారు. ఎందుకు వచ్చిందో ఎవ్వరూ చెప్పలేక పోయారు..కానీ తగ్గించే మందులు లేవనీ ఉన్న మందులు కేవలం బతకడానికి సహాయం చేస్తాయనీ చెప్పారు. నా జీవితంలో రెండోసారి కుప్పకూలిపోయాను. ఇంకెంత లోతుకి నన్ను తీసుకెళ్తావు దేవుడా అని ఏడ్చి మొరపెట్టుకున్నా ఏ లాభం లేదు. ఒక మనిషి కళ్ల ముందు లేకుండా పోయి బాధపెడితే ఒకడు ఉండి ఇంకాస్త ఎక్కువ బాధ పెడుతున్నాడు. ఆ మూడు సంవత్సరాలు ఏం

బాబుకి ఇప్పుడు మూడు సంవత్సరాలు. ఎందుకో బాగా లావు అవుతున్నాడనిపించి ఒకరోజు హాస్పిటల్‌కు తీసుకెళ్లాము. చాలా పరీక్షల తరువాత, చాలామంది డాక్టర్లకు చూపించాక బాబుకి ఆటిజం అనే మానసిక సమస్య అని తేల్చారు. ఎందుకు వచ్చిందో ఎవ్వరూ చెప్పలేక పోయారు..కానీ తగ్గించే మందులు లేవనీ ఉన్న మందులు కేవలం బతకడానికి సహాయం చేస్తాయనీ చెప్పారు. నా జీవితంలో రెండోసారి కుప్పకూలిపోయాను. ఇంకెంత లోతుకి నన్ను తీసుకెళ్తావు దేవుడా అని ఏడ్చి మొరపెట్టుకున్నా ఏ లాభం లేదు.

నేర్చుకున్నాడో జీవితమంతా కేవలం అవే గుర్తుపెట్టుకుని ఏమీ తెలియని అమాయకుడిని జీవితాంతం నేను చూసుకోవాలి. చూసుకుంటాను.. నేను అమ్మని కదా? పిల్లల బాల్యం ఏ తల్లికైనా అయిదారేళ్లే కానీ నాకు ఈ మూడేళ్ల మానసిక వయసున్న పిల్లాడే నా జీవితమంతా ఉంటాడు. మొదటి రెండు మూడు సంవత్సరాలు ప్రతి క్షణం బాధ, కోపం, విసుగు వచ్చేవి. క్రమంగా అవి కూడా పోయేవి. మానసికంగా నా అంత దృఢంగా లేని మా అమ్మానాన్న ఒక్కొక్కళ్లుగా వెళ్లిపోయారు. ఈ కళ తప్పిన ఇంట్లో నేనూ, నాతో పాటు అరుస్తూ అందర్నీ కొడుతున్న నా కొడుకూ. కొన్నాళ్లకు మా ఇంటివైపు ఎవ్వరూ రావడం మానేశారు. వచ్చిన వాళ్ల మీదకి రాళ్లు విసిరేస్తుంటే ఎవరైనా ఎందుకొస్తారు? ఒకరోజు బడికెళ్లే పిల్లలమీద రాళ్లు విసిరేస్తే వాళ్ల తలలు పగిలి రక్తమొచ్చింది. వాళ్ల అమ్మానాన్నా మా ఇంటిమీదకి గొడవకొచ్చారు. వాళ్ల కాళ్లు పట్టుకొని బతిమిలాడినా ఊరుకోకుండా నా కొడుకుని కర్రతో కొట్టి వెళ్లారు. నాకు చాలా బాధేసింది. చాలాసార్లు ఇద్దరం చనిపోతే బాగుండు అనిపించింది.

నాన్న చనిపోయాక పొలం చూసుకునేవాళ్లు డబ్బులు ఇవ్వడం మానేశారు. ఆర్థికంగా బాగా బతికిన మేము ఇప్పుడు పిల్లాడి మందులకు, ఇంట్లో సరుకులకు ఇబ్బంది పడడం బాధేసింది. కొంత మంది బంధువులు నా కొడుకుని ఏదో ఆశ్రమంలో వదిలేసి వచ్చి వేరే పెళ్లి చేసుకొమ్మని సలహాలిచ్చారు. ఒకసారి బలవంతంగా వాడిని తీసుకెళ్లి ఏదో పిచ్చోళ్ల హాస్పిటల్లో వదిలేసి వచ్చారు. ఆ రోజు రాత్రి ఇంటి నిండా నిశ్శబ్దం వాడి అరుపులకంటే భయంకరంగా ఉంది. పొద్దున్నే నేను వెళ్లి నా కొడుకుని తెచ్చుకున్నాను. వయసు పెరుగుతున్నా, దేహం పెరుగుతున్నా వాడి మనసు మాత్రం మూడు సంవత్సరాలదే. చూస్తుండగానే కాలం కదిలి వాడికి ఇరవైనాలుగేళ్లు వచ్చాయి. ఈ వయసు కొడుక్కి స్నానం చేయించడం. మలమూత్రాలు కడగడం కన్నా బాధ ఏ తల్లికైనా ఇంకోటేదైనా ఉంటుందంటే నేను నమ్మను. ఒక్కోసారి నన్ను కొడితే రెండుమూడు రోజులు లేవడం నడవడం కూడా కష్టమయ్యేది. కానీ లేచి "వాడిని చూసుకోవాలి" అనే ఒకే ఒక్క సంకల్పం నాది. నాకు ఇప్పుడు ఏ కోరికా లేదు. నేను చనిపోతే వీడు ఏమైపోతాడా అన్న భయం తప్ప.

ఇరవై అయిదు సంవత్సరాల నుంచీ మందులు వాడుతూనే ఉన్నా వాడిలో ఏ మార్పూ లేదు. నేను తిన్నా తినకున్నా వాడి మందులు, ఆరోగ్యం విషయంలో ఏ లోటూ చేయలేదు. మందులవల్లనో ఎందుకో తెలియదు గత రెండేళ్లుగా బాగా లావయ్యాడు. నేను మోయలేక పోయేదాన్ని. ఆ రోజు రాత్రి వాడు పడుకున్న గంటకే నాలుగైదు సార్లు గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు. ఇలా ఎప్పుడూ జరగలేదు నావైపు తిప్పుకొని పడుకోబెట్టుకున్నాను. వాడి చేయి తీసి నామీద వేసుకున్నాను. వాడి తల నా చెంపకి ఆనిచ్చుకొని పడుకున్నాను. ఇల్లంతా నిశ్శబ్దం. రాత్రంతా అలానే పడుకోబెట్టుకున్నాను. ఏవేవో కథలు చెప్పాను. వాడు వింటూ పడుకున్నాడు. వాడి శ్వాస నాకు తగలట్లేదు. గుండె చప్పుడు నాకు తెలియట్లేదు. నా మూడేళ్ల కొడుకు చనిపోయాడు. తెల్లవారబోతోంది. దూరంగా "కౌసల్యా సుప్రజా రామా..." వినిపిస్తోంది.

మనసారా దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకున్నాను. నాకన్నా ముందు వాడిని తీసుకెళ్లినందుకు. నాకు చాలా సంతోషంగా ఉంది ఎందుకో చాలా రోజుల తరువాత నాకు నవ్వొచ్చింది. ★



భాగం-43

ధర్మము – స్వేచ్ఛ

'సర్వం పరవశం దుఃఖం సర్వమాత్మవశం సుఖమ్' (మనుస్మృతి 4.160)... పరాధీనతయే దుఃఖం, స్వాధీనతయే సుఖం. కనుక స్టూవర్ట్ మిల్ చెప్పిన వ్యక్తిగత స్వేచ్ఛ అనేది నిస్సందేహంగా గౌరవించాల్సిన విషయమే. కానీ మద్యపానం, జూదం వంటి వాటి విషయంలోనూ స్వేచ్ఛ ఉండాలని వాదిస్తే... ఆత్మహత్య చేసుకునేందుకు కూడా స్వాతంత్ర్యం ఉండాల్సి వస్తుంది.

ఆహార, నిద్ర, భయ, మైథునాలు మనుషులకు, పశువులకు ఒకేరీతిగా ఉం టాయి. ధర్మపాలనలోనే మనిషికి విశిష్టత లభిస్తుంది. ధర్మవిహీన స్వాతంత్ర్యం అనేది స్వేచ్ఛాచారిత లేదా విశృంఖల రూపాన్ని సంతరించుకుంటుంది. సర్వోపాధుల నుంచి వినిర్ముక్తమైన బ్రహ్మాత్మభావం ప్రాప్తించడం కంటే ముందుగా ప్రతి ప్రాణి ధార్మిక, ఆధ్యాత్మిక, సామాజికాంశాలలో విభిన్న నియంత్రణల ద్వారా పరతంత్రాన్ని అనుభవించవలసే వస్తుంది. వాస్తవిక పూర్ణ స్వాతంత్ర్యాన్ని పొందడం కోసం అన్ని ప్రాణులూ తమ స్వాతంత్ర్యాన్ని బలిదానం చేయాల్సి వస్తుంది.

అపౌరుషేయమైన వేదంతో పాటు దానిని అనుసరించి వచ్చిన శాస్త్రాలు పేర్కొన్న విధివిహితమైన కార్యాలను నెరవేర్చడమే ధర్మంగా చెప్పాయి. భోజనం, నిద్ర, విశ్రాంతి, సంతానోత్పత్తి వంటి అన్ని కార్యాక్రమాలనూ శాస్త్రవిధిని అనుసరించి జరపడమే ధర్మం. ధర్మనియంత్రితమైన జీవనంలోనే పూర్ణ స్వాతంత్ర్య ప్రాప్తి సంభవం అవుతుంది. ఇదే ప్రకారంగా, 'ఉన్మత్తులైన వారికి కూడా ఆలోచనలు పంచుకోవడానికి, మాట్లాడడానికి స్వేచ్ఛ ఉండాలి' అని చెప్పడం కూడా హాస్యాస్పదమే అవుతుంది. ఉన్మత్తులలో కూడా ఎవరైనా యోగ్యులు, ప్రయోజనకారులైన వారు ఉంటే ఉండవచ్చు. కానీ వారందరికీ సంపూర్ణ స్వాతంత్ర్యం ఇవ్వడం వల్ల సమాజంలో శాంతి భద్రతలకు ముప్పు ఏర్పడుతుంది.

ఇదేవిధంగా తర్కాన్ని గౌరవించడం ఆవశ్యకమే. కానీ కొన్ని నియమాలను అంగీకరించినప్పుడే తర్కాన్ని ప్రయోగించాల్సి ఉంటుంది. అంతేకాదు, తర్కానికి ఎవ్వటికీ అంతమంటూ ఉండదు. జీవితంలో విశ్వాసానికి ఎక్కడో ఒకచోట స్థానం ఉంటుంది. బజారులో నిలబడి, రాజద్రోహానికి సంబంధించిన చర్చలు, తర్కం సాగించడానికి కూడా స్వాతంత్ర్యాన్నిస్తే దేశ శాంతి సమగ్రతలు సురక్షితంగా ఉండగలవా? ఇలాంటివే నిశ్చిత విషయాలు ఇంకా అనేకం ఉన్నాయి. తల్లిదండ్రులు, గురుజనుల ద్వారా వాటిని తెలుసుకుని ముందడుగు వేయాలి. నిశ్చిత విషయాల్లో కూడా తర్కాన్ని ఉపయోగిస్తే, తన సమయాన్ని దుర్వినియోగం చేసుకున్నవాడు అవుతాడు. శాస్త్రవేత్తలు కొన్ని శాస్త్రీయ నియమాల ఆధారంగా కొత్త ఆవిష్కరణలు చేయడానికి పూనుకోవాలి. గతంలోని ఆవిష్కరణలను తన అనుభవంతో మళ్లీ ఆవిష్కరించడం వ్యర్థమే. ఎవరైనా తన అనుభవంతోనే విషపదార్థపు రుచి, గుణాలను నిర్ణయించాలని పట్టుబడితే అలాంటి వ్యర్థపు పనికి లక్షలాదిమంది ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. ఏమీ లాభం ఉండదు. నల్లతాచు కాటు ఎలా ఉంటుందో, దాని విషం తాలూకు పరిణామం ఏమిటో స్వీయాను భవం ద్వారా తెలుసుకోవాలనుకోవడం మూర్ఖత్వం. ఇలాంటి విషయాలలో శిష్టుల అనుభవాన్ని సద్వినియోగం చేసుకోవడం ఉచితం అనేది స్పష్టమే.

ఇదేవిధంగా ముందుతరాల వారి అనుభవాల ద్వారా దురాచారాలు, దుర్గుణాలు, పాపాలు చేయకూడదని గ్రహించుకోవాలని నిరూపితం అయినప్పుడు, వారి మాటలపై విశ్వాసం లేకుండా పాపం, దురాచారం చేసే స్వేచ్ఛ ఇవ్వడం అమాన వీయం. హిందూశాస్త్రాల ప్రకారం మద్యపానం వల్ల బ్రాహ్మణుని బ్రాహ్మణత్వం నశిస్తుంది. తిరిగి రావడం అసంభవమే అవుతుంది. ఒకసారి పతివ్రత సతీత్వం నశిస్తే తిరిగిరావడం అనేది ఉండదు. అందువల్ల పాపాల దుష్పరిణామాన్ని చూడడం కోసం పాపం చేసే స్వేచ్ఛ పొందడం బుద్ధిమంతుల లక్షణం కాదు.

సంప్రదాయం ప్రకారం, ఒక విధమైన సంస్కారం ఏర్పడిన తరువాత, దానికి విరుద్ధమైన ప్రకృతి ఏర్పడదు. అయినప్పటికీ, విరుద్ధ ప్రవృత్తులను కలిగించి, వాటి దుష్పరిణామాలను అనుభవించేలా చేసి, మళ్లీ వాటి నుంచి నివృత్తి పొందే వ్యవస్థను రూపొందించడం ఎలా ఉంటుందంటే...ముళ్లు గుచ్చుకోవడం అనే అనుభవాన్ని కలిగించి, మళ్లీ ఆ ముళ్లను తీసేయడం ద్వారా స్వస్థ స్థితికి తీసుకు రావడంలాంటిది. దీనికంటే ఏదైనా ఇతర ఉపయోగకరమైన పనుల్లో బుద్ధిని, సమయాన్ని వెచ్చించడం శ్రేయస్కరం అవుతుంది. ఎవరి సంప్రదాయాలలో మద్య, మాంసాల స్వీకరణ ప్రచలితంగా ఉండదో, ఆ సంప్రదాయంలోని పిల్లలకు వాటికి సంబంధించిన సంస్కారాలు లేదా ఇష్టాలు ఉండనే ఉండవు. వాటిపై నిషేధమే వారి సంస్కారం అయి ఉంటుంది. అలాంటివారిని తమ సంస్కారాలలో దృఢంగా నిలిచేలా చేయడమే శ్రేయస్కరం. అతిగా తర్కించేవాడు సర్వత్ర సంశయించేవానిగా రూపొందుతాడు. అప్పుడు అతనికి తాను తీసుకునే ఆహారంలో విషం ఉందేమో అనే అనుమానం కలుగుతూ ఉంటుంది. చాలామంది వ్యక్తులు చిన్నచిన్న పనులకు కూడా లాక్కుంటూ పీక్కుంటూ ఉంటారు. వారు తమ సమయాన్నే కాకుండా ఇతరుల సమయాన్ని కూడా వృథాచేస్తుంటారు. చాలామంది పట్టుదల కలవారికి తర్కం చేయడానికి అవకాశం ఇస్తే తత్వనిర్ణయం చేయడానికి బదులుగా వివాదాలే ముదురుతూ ఉంటాయి. వ్యక్తుల చరిత్రల మధ్య భిన్నత్వం, విచిత్ర ప్రవర్తన కలవారి సంఖ్య పెరగడం ప్రగతి లక్షణం కాదు. నిశ్చితత్వం, ఉపయోగకరమైన గుణాల సమృద్ధి మాత్రమే ప్రగతికి లక్షణం. యోగ్యమైన వాతావరణం, ఉన్నత శ్రేణికి చెందిన విద్య, సదాచారాలను నెలకొల్పడం ద్వారా ఉన్నతస్థాయి చారిత్రాత్మక నిర్మాణం సాధ్య పడుతుంది. అదే దేశపు ప్రగతి అవుతుంది.

హిందీమూలం : కరపాత్రీ స్వామి
అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ

పాదాభివందనం...

ఇటీవల క్రికెట్ మైదానంలో కనిపించిన ఒక చిన్న దృశ్యం ఎంతోమందిని ఆలోచింపజేసింది. అసాధారణ బ్యాటింగ్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంటున్న యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ, సీనియర్ క్రికెటర్, శ్రీలంక మాజీ కెప్టెన్ అనుర టెన్నెకూన్ పాదాలకు నమస్కరించాడు. అది కేవలం కెమెరా కోసం చేసిన చర్యలా కనిపించలేదు. సహజంగా వచ్చిన సంస్కారంలా అనిపించింది. ప్రతిభతోపాటు వినయం ఉంటేనే వ్యక్తిత్వానికి పూర్తి అందం వస్తుందనే సందేశాన్ని ఆ దృశ్యం ఇచ్చింది.

అతని బ్యాటింగ్ మ్యాచ్‌లను గెలిపించవచ్చు. కానీ ఆ వినయం ఎంతోమంది హృదయాలను గెలుచుకుంది. చిన్న వయసులోనే పేరు, గుర్తింపు, ప్రశంసలు వస్తున్న సమయంలో కూడా పెద్దల పట్ల గౌరవం తగ్గకపోవడం మంచి పెంపకానికి నిదర్శనం. విజయానికి చేరువవుతున్న ప్రతి యువతరం నేర్చుకోవాల్సిన విషయం కూడా ఇదే.

మన దేశంలో తల్లిదండ్రులు, తాతమ్మలు, గురువులు, పెద్దలు, ఆధ్యాత్మిక గురువుల పాదాలకు నమస్కరించడం అనాదిగా ఉన్న ఆచారం. కానీ దీన్ని కేవలం "పెద్దలను గౌరవించడం" అనే ఒకే అర్థానికి పరిమితం చేయడం సరైంది కాదు. పరీక్షకు వెళ్లేముందు పిల్లలు తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించడం, కొత్త ఉద్యోగానికి బయలుదేరే యువకుడు ఇంటి పెద్దల ఆశీస్సులు తీసుకోవడం, వివాహ సమయంలో వధూవరులు పెద్దలకు నమస్కరించడం, విద్యార్థి గురువును గౌరవించడం... ఇవి అన్నీ మన జీవితంలో మనకంటే ముందుగా నడిచిన వారి పాత్రను గుర్తించే సందర్భాలు.

"మీరు నడిచిన దారిని నేను గౌరవిస్తున్నాను. మీరు నాకు చేసిన మేలును గుర్తిస్తున్నాను. నేను ముందుకు సాగుతున్నప్పుడు మీ దీవెనలు కావాలి" అని మాటల్లో చెప్పకుండానే తెలియజేసే సంస్కారం పాదాభివందనం.

ఇది చిన్నవారు పెద్దవారికంటే తక్కువవారని చెప్పే ఆచారం కాదు. ఎవరూ ఒంటరిగా ఎదగరనే సత్యాన్ని గుర్తుచేసే చర్య. ఒకరి ఎదుగుదల వెనుక తల్లిదండ్రుల త్యాగం, గురువుల బోధన, కుటుంబం ఇచ్చిన రక్షణ, సమాజం అందించిన అవకాశాలు ఉంటాయి. అందుకే పాదాలకు నమస్కరించడం అంటే అహాన్ని కాసేపు పక్కన పెట్టి, మన ఎదుగుదల వెనుక ఉన్న అనుబంధాలను గుర్తించడమే.

అయితే ఈ ఆచారంలో మనం మరిచిపోతున్న ఒక ముఖ్యమైన భాగం ఉంది– అది పెద్దలు ఇచ్చే ఆశీర్వాదం.

కుటుంబ సమావేశాల్లో, స్నేహితుల ఇళ్లలో, పండుగల సందర్భంగా నేను తరచూ చూసే దృశ్యం ఇది. చిన్నవాడు లేదా యువకుడు పాదాలకు నమస్కరించగానే కొందరు పెద్దలు ఇబ్బందిగా పక్కకు తప్పుకుంటారు. కొందరు నవ్వేస్తారు. ఇంకొందరు "గాడ్ బ్లెస్ యూ" అని హడావిడిగా చెప్పి ఆ క్షణాన్ని ముగించేస్తారు. మరికొందరు ఏం చెప్పాలో తెలియక మౌనంగా ఉంటారు. ఇది వారి తప్పు మాత్రమే కాదు. పాదాభివందనం చేయడం నేర్పాం కానీ, దానికి ఎలా స్పందించాలో నేర్పుకో లేదు. పెద్దల ఆశీర్వాదం కూడా ఒక బాధ్యత అని మనం మరచిపోయాం.

ఆశీర్వదించడం పెద్దల బాధ్యతే

ఆశీర్వాదం అంటే ఆడంబరంగా సంస్కృత పదాలు చెప్పడం కాదు. ఎదుటి వ్యక్తి మంచిని మనస్ఫూర్తిగా కోరడం. "ఆరోగ్యంగా ఉండు", "నీ ప్రయత్నాలు ఫలించాలి", "మంచి మార్గంలో ఎదుగు", "ఉద్యోగం రావాలి", "సుఖంగా ఉండాలి", "నిన్ను మించి నువ్వే ఎదగాలి" అని చెప్పడమే ఆశీర్వాదం.

పాదాభివందనం చేస్తున్నప్పుడు దాని వెనుక భావం ఉండాలి. బంధువులు చూస్తున్నారు కాబట్టి చేసే నాటకం కాకూడదు. ప్రతి ఒక్కరి ముందు, ప్రతి సందర్భంలో, కేవలం వయసు ఎక్కువగా ఉందన్న కారణంతో చేయాల్సిన యాంత్రిక చర్యగా మారకూడదు. వయసు పెరిగినంత మాత్రాన ప్రతి ఒక్కరూ గౌరవానికి అర్హులవుతారని చెప్పలేం. దయ, త్యాగం, జ్ఞానం, నైతికత, కుటుంబం పట్ల బాధ్యత– ఇవి ఉన్నప్పుడు ఆ గౌరవానికి నిజమైన అర్థం ఉంటుంది. పాదాభివందనం ఎవరికి పడితే వారికి చేసే హావభావం కాదు.

అలాంటి మాటలు చెప్పడానికి కొన్ని క్షణాలే పడుతుంది. కానీ అవి ఒక పిల్లవాడిలో, ఒక యువతిలో, ఒక ఉద్యోగార్థిలో గొప్ప నమ్మకాన్ని నింపగలవు. ఒక పరీక్షకు బయలుదేరుతున్న బాలుడికి "ధైర్యంగా రాయి, బాగా రాస్తావు" అని పెద్దలు చెప్పడం, ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న యువకుడికి "నీకు సరైన అవకాశం వస్తుంది" అని ప్రోత్సహించడం, కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్న జంటకు "సుఖసంతోషాలతో ఉండండి" అని దీవించడం వంటివన్నీ మాటలకంటే ఎక్కువ.

సంస్కృతంలో తెలిసినవారు సందర్భానుసారంగా "దీర్ఘాయుష్మాన్‌భవ", "విజయీ భవ", "సుఖీభవ", "ఉద్యోగప్రాప్తిరస్తు", "ఇష్టకార్యసిద్ధిరస్తు" వంటి పదాలను ఉపయోగించవచ్చు. కానీ సంస్కృతం తప్పనిసరి కాదు. తెలుగు మాటలో చెప్పిన ఆశీర్వాదానికీ అదే బలం ఉంటుంది. భాష కంటే మనసు ముఖ్యం.

ఈ ఆచారం ఎందుకు చేయాలో యువతరానికి చెప్పకుండా, కేవలం చేయమని చెప్పడం వల్లే అది యాంత్రికంగా మారుతోంది. కొందరు సగం వంగుతారు. కొందరు పాదాలను తాకకుండానే చేతిని అటూ ఇటూ ఊపుతారు. ఇంకొందరు "చరణ్ స్పర్శ్", "పాయ్ లాగూ" అని మాత్రమే అంటారు. మరికొందరు చుట్టూ ఉన్నవారు చూస్తున్నారు కాబట్టి చేస్తారు. ఇవన్నీ తప్పే అని చెప్పలేం. ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికి తనకు నచ్చిన పద్ధతి ఉంటుంది. చేతులు జోడించి నమస్కరించడం, తలవంచి పలకరించడం, ఆలింగనం చేసుకోవడం,

పరమార్థం!

శ్రద్ధగా వినడం, సేవ చేయడం, మర్యాదగా మాట్లాడటం... ఇవన్నీ గౌరవానికి రూపాలే.

అయితే పాదాభివందనం చేస్తున్నప్పుడు దాని వెనుక భావం ఉండాలి. బంధువులు చూస్తున్నారు కాబట్టి చేసే నాటకం కాకూడదు. ప్రతి ఒక్కరి ముందు, ప్రతి సందర్భంలో, కేవలం వయసు ఎక్కువగా ఉందన్న కారణంతో చేయాల్సిన యాంత్రిక చర్యగా మారకూడదు. వయసు పెరిగినంత మాత్రాన ప్రతి ఒక్కరూ గౌరవానికి అర్హులవుతారని చెప్పలేం. దయ, త్యాగం, జ్ఞానం, నైతికత, కుటుంబం పట్ల బాధ్యత– ఇవి ఉన్నప్పుడు ఆ గౌరవానికి నిజమైన అర్థం ఉంటుంది. పాదాభివందనం ఎవరికి పడితే వారికి చేసే హావభావం కాదు. ప్రేమ, ఆప్యాయత, జ్ఞానం, సేవాభావం, నైతిక గౌరవం ఉన్న సంబంధాల్లోనే దానికి నిజమైన స్థానం ఉంటుంది.

ఇక్కడ మరో తేడా స్పష్టంగా తెలుసుకోవాలి. వినయం వేరు, లొంగుబాటు వేరు. ప్రేమతో తాతమ్మల పాదాలకు నమస్కరించే మనవడు ఒకరు, అహంకారంతో వ్యవహరించే అధికారి ముందు భయంతో వంగే ఉద్యోగి ఇంకొకరు. గురువు ఆశీర్వాదం కోరే విద్యార్థి ఒకరు, తనను తాను గొప్పవాడిగా ప్రకటించుకున్న వ్యక్తి ముందు ఒత్తిడితో నమస్కరించే అనుచరుడు ఇంకొకరు.

ఏ సంప్రదాయమూ గుడ్డి విధేయతను కోరడానికి, ప్రశ్నలను అణచివేయడానికి, కులం లేదా హోదా ఆధిపత్యాన్ని నిలబెట్టడానికి ఉపయోగపడకూడదు. తన పాదాలకు నమస్కరిస్తేనే తనను గౌరవిస్తున్నట్టుగా భావించే వ్యక్తి ఈ సంప్రదాయం అసలు అర్థాన్ని గ్రహించలేదని చెప్పాలి.

నిజమైన పెద్దలు గౌరవాన్ని అడగరు, తమ ప్రవర్తనతో సంపాదిస్తారు. పిల్లవాడు పాదాలకు నమస్కరించినప్పుడు "నా గొప్పతనం గుర్తించాడు" అని అనుకోరు. "ఈ బిడ్డ నా దీవెన కోరుతున్నాడు. నేను ప్రేమతో స్పందించాలి" అని భావిస్తారు. "మమ్మల్ని మించి ఎదుగు", "విజయం వచ్చినా మంచితనం విడువకు", "ఎవరినీ చిన్నచూపు చూడకు" అని చెప్పగలిగినప్పుడు పెద్దరికానికి అసలు అర్థం వస్తుంది.

సినీ ప్రముఖుల వేదుకల్లో పాదాభివందనాన్ని సరదాగా మార్చిన వీడియోలు కూడా మనం చూస్తూనే ఉన్నాం. ఒక నటుడు మరొకరి పాదాలకు నమస్కరించబోతున్నట్లు చేయడం, ఇంకొకరు తప్పించుకోవడం, చుట్టుపక్కలవారు నవ్వడం, చప్పట్లు కొట్టడం ఇప్పుడు సాధారణమైపోయింది.

హాస్యానికి స్థానం ఉంది. కానీ తరాలమధ్య గౌరవానికి ప్రతీకగా ఉన్న ఆచారాన్ని మళ్లీ మళ్లీ చవకబారు వినోదంగా మార్చినప్పుడు, ప్రజల మనసుల్లో దాని విలువ తగ్గిపోతుంది. ఈ ఆచారంలో ఉన్న కృతజ్ఞత, ఆశీర్వాదం, పరస్పర బాధ్యత, అనుభవానికి ఇచ్చే గౌరవం వంటి అంశాలు కనిపించకుండా పోతాయి.

మన సమాజం వేగంగా మారుతోంది. యువతకు కొత్త జ్ఞానం, కొత్త అవకాశాలు, కొత్త ప్రపంచం అందుబాటులో ఉన్నాయి. అది మంచి పరిణామమే. కానీ ఆధునికత అంటే మూలాలను వదిలేయడం కాదు. అలాగే సంప్రదాయం అంటే స్వేచ్ఛను వదులుకోవడం కూడా కాదు.

యువత ఉత్సాహం, ఊహాశక్తి, ధైర్యం, కొత్త ఆలోచనలను తీసుకొస్తుంది. పెద్దలు అనుభవం, దూరదృష్టి, జీవిత పాఠాలను అందిస్తారు. ఈ రెండు తరాల మధ్య అనుబంధం బలంగా ఉన్నప్పుడే కుటుంబం బలపడుతుంది; సమాజం ఆరోగ్యంగా ముందుకు సాగుతుంది.

వైభవ్ సూర్యవంశీ పాదాభివందనం ఎంతో మందిని ఆకట్టుకున్నది అందుకే. అది ప్రదర్శనలా కనిపించలేదు. సహజంగా కనిపించింది. అతని తల్లిదండ్రులు అతనిలో నాటిన వినయం ప్రశంసించదగ్గది. అదే సమయంలో, ఎవరికి, ఎప్పుడు, ఎంతవరకు గౌరవం చూపాలో గుర్తించే వివేకం కూడా అతనితో పాటు ఎదగాలని ఆశించాలి.

పాదాభివందనం అనే సంప్రదాయాన్ని పూర్తిగా వదిలేయడమో, ప్రశ్నించకుండా ప్రతి రూపాన్ని సమర్థించడమో రెండూ సరైన మార్గాలు కావు. దాని అసలు అర్థాన్ని మళ్లీ నేర్పాలి.

తల్లిదండ్రులు పిల్లలకు ఇది తమను తాము చిన్నచూపు చూసుకోవడం కాదని చెప్పాలి. ఇతరులు తమ కోసం చేసిన సేవను, త్యాగాన్ని గుర్తించే పరిపక్వత అని వివరించాలి. పెద్దలు స్పందించడం నేర్చుకోవాలి. ఆశీర్వాదం ఇవ్వాలి. యువత దీన్ని స్వచ్ఛందంగా, ఆత్మగౌరవంతో, ఎంపికతో ఆచరించాలి.

చిన్నవారు గౌరవాన్ని అందిస్తారు. పెద్దలు దీవెనలు అందిస్తారు. ఆ క్షణంలో ఇద్దరూ మరింత మానవీయంగా మారతారు. పాదాభివందనం వెనుక ఉన్న అసలు పరమార్థం కూడా అదే.

– హరికృష్ణ నిబనుపూడి



ప్రపంచమంతటా సృష్టి గాథలు ఒక్కలాగానే ఉంటాయి. ఆదిలో అంతా జలమయమే. ఎందుకని? బ్రహ్మాండమంత కుండతో ఎత్తిపోసినట్టు నిరంతరం ధారాపాతాలు. ఆ తర్వాత ఎప్పుడో సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు పుట్టాయి. భూమిపైకి తేలింది. జీవి పుట్టింది. మనిషి సహా రకరకాల రూపాల్లోకి పరిణామం చెందింది. వర్షం పడుతూనే ఉంది కానీ, నిర్విరామం నుండి విరామానికి మారింది.

ప్రపంచ సాహిత్యంలో వర్షానుభవాన్ని చిత్రించని కథ, కావ్యం, నవలా దాదాపు ఉండవు. తెలుగులో పాలగుమ్మి పద్మరాజు "గాలివాన" (ప్రపంచ కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ). కథలో కథానాయకుడు రావుగారు. చీదరించుకున్న బిచ్చగత్తెను ఒకచోటకు చేర్చి వారి మధ్య కథను నడిపాడు. గాలివానలో బిచ్చగత్తె ఆలింగనం వెచ్చదనం అందించి, అతనిలోని అరవై ఏళ్ల అజ్ఞానాంధకారాలను ఒక్క గాలివాన కూకటివేళ్లతో కూల్చి అతని బతుకు పలకను స్వచ్ఛ జలంతో ప్రక్షాళించింది. మానవత్వపు కొత్త ఓనమాలు దిద్దించింది.

దాశరథి రంగాచార్యుల "తామరపూలు"లో చిట్టిపంతులకు తామరలే లోకం. రుతుభ్రమణం గురించిన జ్ఞానంలేని ఆ అబ్బాయి ఎండాకాలంలో అవి కనిపించక కలవర పడిపోయాడు. వానలు పడి తిరిగి కనిపించే వరకూ వాటికోసం నిరీక్షణ. మహేంద్ర రచించిన "హోగినేకల్". ఓ కుటుంబం కావేరి జలపాతాన్ని చూడటానికి చిన్నపాపను తీసుకుని, వానను వెంటబెట్టుకొని వెళ్లింది. కావేరి వరదెత్తడంతో అందులో పాప కొట్టుకుపోయింది. జీర్ణించుకోవడం కష్టమే కానీ ఇదే ప్రకృతి, ఇదే దాని ధర్మం. ఇది మంచి, ఇది చెడు అని కాదు...దాని దృష్టిలో అన్నీ సమానమే. సృష్టిని అంగీకరించే మనిషి లయను కూడా అంగీకరించాల్సిందే. కుప్పిలి పద్మ 'గోడకథ", 'తూర్పు సముద్ర కెరటాల నురగల మీద వాన, యూరాడ కొండ గరికల మీద వాన, రుషికొండ ఎగుడు దిగుడుల మీద వాన' అని మొదలవుతుంది. స్వతంత్ర భావాలు కల అబ్బాయిని ఓ అమ్మాయి ప్రేమిస్తుంది, అనుకోకుండా ఓ వర్షపురాత్రి అబ్బాయి గదిలో గడపాల్సి వస్తుంది. అతనిలోని మగాడు నిద్రలేచి హద్దుమీరబోతే ఆ అమ్మాయి గట్టిగా బుద్ధి చెబుతుంది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం. ఇవన్నీ ఆధునికం, కాని దోనయామాత్యుడు 11వ శతాబ్దంలోనే "సస్యానందం" అనే వర్షశాస్త్రాన్ని రాశాడు. అది భారతీయ సాహిత్యంలోనే తొలి శాస్త్రీయ గ్రంథం.

ఏరువాక కర్షకులకు ముఖ్యమైనది. ఏరు అంటే నాగలి, 'ఏరువాక సాగుట' అంటే దున్నడం ప్రారంభించడం, జ్యేష్ఠ పూర్ణిమ నాడు ఎద్దులను కడిగి రంగులతో అలంకరించి, నాగలికి ఎర్రమన్ను సున్నం పట్టెలు వేసి, నూనె రంగులు పూసి చీరలు కట్టించి సొమ్ములు పెట్టి సాయంత్రం మంగళ వాయిద్యములతో నాగళ్లను, గొర్రులను భుజాన వేసుకొని, ఎద్దులతో ఊరేగుతూ పొలాలకు వెళ్లి దుక్కి ప్రారంభిస్తారు. ఆనాడు భక్ష్యభోజ్యాలతో వాటికి నైవేద్యమిస్తారు. ఇది ఏరువాక పున్నమి పండుగ. ఇది వైదికోత్సవమే.

మనం నడిచే నేల ఒక్కో చోట ఒక్కో రంగులో ఉంటుంది. ప్రకృతిలో ఎన్నో వింతలు దానిలో ఇదొకటి. మట్టిలో రకరకాల రాళ్లు, ఖనిజాలు ఉంటాయి. ఇవే మట్టికి రంగులనిస్తాయి. నల్లమట్టికి కారణం ఆ నేలలో ఇనుము, అల్యూమినియం, టైటానియం వంటి ఖనిజాలు ఉండడమే. ఈ మట్టి చాలా సారవంతమైంది. ఇనుము ఎక్కువగా ఉండటంవల్ల ఆ మట్టి ఎర్రగా మారుతుంది. ఈ నేలలు చాలా ప్రాంతాలలో కన్పిస్తాయి. విశాఖ జిల్లా భీమిలి ఎర్రమట్టిదిబ్బలు ఒక ప్రత్యేక ఆకర్షణ (ఇప్పుడు లేవు). గోధుమ రంగు మట్టికి కారణం రకరకాల ఖనిజాలు, మొక్కలు కుళ్లిపోయి మట్టికి గోధుమరంగు నిస్తాయి.

మట్టి ఒక్కో రంగులో ఉంటుంది. ఒక్కొక్క రకం మట్టిలో ఒక్కొక్క రకం మొక్క పెరుగుతుంది. అయితే వీటికి ప్రధానంగా కావల్సింది వర్షం (నీరు). అయితే వర్షం ఎలా వస్తుందో, ఎప్పుడు వస్తుందో ఎలా చెప్పగలం? విధులను శాసించటం, విషయాలను ప్రకటించడం వంటి పనులు చేసే వాటిని శాస్త్రాలు అంటారు. శాస్త్రం మనకున్న అన్ని సందేహాలను తీరుస్తుంది. ప్రపంచాన్ని చూపించే కన్నులాంటిది శాస్త్రం. శాస్త్రజ్ఞానం లేనివాడే గుడ్డివాడని హితోపదేశకర్త నిర్వచించాడు.

వేద భగవానునికి ఛందస్సు కాళ్లు అని, కల్పసూత్రాలు చేతులని, జ్యోతిష్యం కళ్లని, నిరుక్తం చెవులని, శిక్ష ముక్కు అని, వ్యాకరణం నోరు అని పాణిని పండితుడు పేర్కొన్నాడు. గర్గ మహర్షి, పరాశరుడు, జైమిని, భృగువు, వశిష్ఠుడు, మొదలైన మహర్షులు జ్యోతిష్యంపై అధ్యయనం చేశారు, గర్గ సంహిత, పరాశర సంహిత, బృహత్పరాశరహోర, భృగుసూత్రాలు, వృద్ధ వాసిష్ఠము (జ్యోతిర్వాసిష్ఠము) మొదలైన ప్రామాణిక గ్రంథాలూ రాశారు. తరువాత కాలంలో ఆర్యభట్టు, వరాహమిహిరుడు, బ్రహ్మగుప్తుడు, భాస్కరాచార్యులు మొదలైనవారు జ్యోతిష్య శాస్త్రాభివృద్ధికి కృషి చేశారు. కాళిదాసు పేరుతో జ్యోతిర్విధాభరణము, కాలామృతము అనే గ్రంథాలు వెలిశాయి. వరాహమిహిరుని 'బృహత్ సంహిత'లోని లఘుజాతకాన్ని అల్‌బెరూనీ అనే ఖగోళ శాస్త్రవేత్త

పర్షియన్ భాషలోనికి అనువదించాడు.

గ్రహాలు, నక్షత్రాలు, భూభ్రమణము మొదలైనవాటి ఆధారంగా ముహూర్తాలనే కాక వాన రాకపోకలను కూడా మన ప్రాచీన రుషులు పరిశోధించి తమ గ్రంథాలలో పొందుపరిచారు. వ్యవసాయశాస్త్రంపై కూడా సంస్కృతంలో మంచి పుస్తకాలు వచ్చాయి. పరాశరమహర్షి "కృషి సంగ్రహః" అన్నది ప్రసిద్ధ వ్యవసాయ గ్రంథం. దీనికే 'కృషి పరాశర' అనే పేరు కూడా వుంది. పరాశరుడు క్రీ॥పూ॥ 1391 వాడని ప్రముఖ పాశ్చాత్య పండితుడు బిల్‌పోర్ట్ చెప్పగా, పుకనన్ అనే మరో పండితుడు క్రీ॥పూ॥1300 నాటి వాడని నిర్ణయించారు. ఎద్దులు, వాటి లక్షణాలు, గోమయాన్ని ఎరువుగా మార్చడం, నాగలి సామాగ్రి, ఏరుకట్ట సామాను, దుక్కి దున్నే పద్ధతి, విత్తనాలు చల్లడం, ఎరువులు వేయడం, పైరు కోయడం, ధాన్యం నూర్చి

తూర్పారబట్టి కైలు చేయడం, పాతరలలో, గాదెలలో పురుగు పట్టకుండా ధాన్యం నిలవ చేయడం, పంట తెగుళ్ల నివారణ మొదలైన విషయాలు ఈ గ్రంథంలో ఉన్నాయి. నారద మహర్షి రాసిన 'మేఘమాల' గ్రంథం గ్రహగతులను అధ్యయనం చేసి వర్షాగమనాలను వివరించింది. పాదప వివక్ష, వృక్షదోహద, వృక్షా యుర్వేద-అనేవి మరికొన్ని చెట్లకు సంబంధించిన శాస్త్ర గ్రంథాలు.

'అనాదిగా భారతీయుల ప్రధానవృత్తి వ్యవసాయం. వానలు పడితే పంటలు బాగా పండుతాయి. పంటలు బాగా పండితే ప్రజలు సుఖ

అంత ప్రాచీనం

- దోనయామాత్యుడు

సంతోషాలతో ఉంటారు. ఆ వానల రాకపోకలు తెలియడం అందరికీ అవసరం అంటాడు' దోనయామాత్యుడు. ప్రజలలో వర్ష విజ్ఞానాన్ని కలిగించడానికి ఆయన 'సస్యానందం" రాశాడు.

దోనయ్య కాలం నాటికి గర్గసంహిత, హరిభట్టు మతము, ధన్వుని మతము, శ్రీపతి మతము, మిహరసంహిత, మేఘమాలిక, నారాయణభట్టు మతము మొదలైన జ్యోతిష్య గ్రంథాలు దక్షిణ భారతంలో ప్రాచుర్యంలో ఉండేవి. వీటిని ఆధారంగా చేసుకొని రెట్ట పండితుడు (క్రీ॥శ॥ 1300) కన్నడంలో 'రెట్ట మతశాస్త్రం' రాశాడు. అందులోని కొన్ని మూఢ నమ్మకాలను విడిచి, దోనయ్య గర్గ, మిహిర, లల్ల సంహితల ఆధారంగా శాస్త్రీయంగా 'సస్యానందం' రాశాడు. ఆ గ్రంథం నాలుగు ప్రకరణలతో కూడి ఉంది. వాటిలో మేఘ నిర్ణయము, ధాతు ప్రకారము, గర్భకాలము, ద్రోణ ప్రకారము, ద్రోణ ప్రమాణము, చంద్ర యోగము, ఫలపక్షి యోగము, ఆషాఢ లక్షణము, వాయు ప్రకారము శ్రావణమాస గర్భము, గ్రహణోత్పాతము, మేఘ లక్షణము, పరివేష లక్షణము, శుక్రోదయాస్త లక్షణము, గ్రహచార లక్షణము, బుధోదయ లక్షణము, గ్రహయుద్ధము, గ్రహాదికార దేశములు, వర్షప్రశ్నోత్తరము, గురు సంచారము వివరంగా ఉన్నాయి. ఈ గ్రంథంపై ఆచార్య నిడదవోలు వెంకట్రావు, 'భారతి' మాస పత్రిక(1946 జూన్)లో 'సస్యానందము-దోనయామాత్యుడు' అనే వ్యాసం రాశారు. చాగంటి శేషయ్య దీన్ని గురించి 'ఆంధ్రకవి తరంగిణి'లో వివరించారు. ఆరుద్ర 'సమగ్రాంధ్ర సాహిత్యం' కొంత విపులంగా రాశారు.

ఆధునిక శాస్త్రవేత్తలు వర్షపాతాన్ని మిల్లీమీటర్లు, సెంటీమీటర్ల ప్రమాణంలో కొలుస్తున్నారు. ప్రాచీన శాస్త్రవేత్తలు ద్రోణ ప్రమాణాలలో కొలిచారు. దానిని కవి 'కొలువగ నరువది మూడం' (2-31) పద్యంలో (63 అంగుళాల ముఖవృత్తం గల కలశాన్ని తీసుకుని, దానిని ఆరుబయట వర్షంలో ఉంచాలి. వర్షం వెలిశాక అందులో నీరు 4 తూములుంటే ఒక ద్రోణం వర్షం కురిసిందని, రెండు తూములుంటే అరద్రోణం వర్షం కురిసిందని అర్థం)చెప్పాడు. రాత్రి కురిసిన మంచును బట్టి రాబోయే సంవత్సరం వర్షపాతాన్ని ముందుగా అంచనావేసే పద్యం (1-42)ఉంది. 'పుష్యమాసంలో పున్నమినాడు పలిమెడు దూదిని నాగలికి తగిలించి ఆరు బయట పెడతారు. దూదికి ఆకాశం మధ్య ఏ అడ్డం ఉండరాదు. మరునాడు ఉదయం దాకా ఆ దూది అలాగే ఉండాలి. పొద్దున్నే ఆ దూదిని పిండినప్పుడు అందులో నుంచి నీరు ధారగా కారితే వచ్చే సంవత్సరం వానలు పుష్కలంగా ఉంటాయి' అని ఆ పద్యం భావం. చాగంటి వారు ప్రయోగాత్మకంగా చేసి, దీనిలో నిజముందని 'ఆంధ్రకవి తరంగిణి'(నాలుగో సంపుటి)లో వివరించారు.

ఆషాఢ శుద్ధ పాడ్యమినాడు సూర్యాస్తమయ కాలంలో పడమటి వైపు మబ్బు పడితే ఆ ఏడాది కరవు ఉండదని బృహస్పతి ఆచార్యుని మతమని కూడా దోనయ్య (2-4)లో చెప్పాడు. కాళిదాసు తన మేఘ సందేశంలో ఇదే విషయాన్ని పేర్కొన్నాడు.

దోనయామాత్యుని కాలం క్రీ.శ. 1360గా ఆచార్య నిడదవోలు వెంకట్రావు, నిర్ధారించారు. కళింగ దేశంలో ఎలమంచిలి సర్వసిద్ధి మండలంలో రాజ్యపాలన చేసిన 3వ ఉపేంద్రునికి సమకాలికునిగా నిర్ధారించారు. దోనయ్య కవి శివభక్తుడు కాబట్టి తన కావ్యాన్ని శ్రీశైల మల్లికార్జునుని సంబోధిస్తూ చెప్పాడు. అయితే అవతారికలోని రెండవ పద్యం 'సింహ శైలమున తద్దయు వేడ్క..'లో 'సింహాచల' ప్రస్తావన ఉంది'. 'పాపాలు అనే పెద్ద పెద్ద కొరువు లను అణచి, దుఃఖమనే కారుచిచ్చును చల్లార్చి, చక్రపుకాంతులు అనే మెరుపులు మెరుస్తూంటే నిత్యం సింహాచలంలో ప్రేమతో పూజలందుకొంటున్న సుందరేశ్వరుడు అనే మేఘము ఈ భూమికి తన కృపామృతాన్ని వర్షించు గాక' అని ఈ పద్యం భావం. రాస్తున్నది వానల శాస్త్రం గనుక స్వామిని మబ్బులతో పోల్చాడు.

ఆనాడు మెరక వ్యవసాయం బావులపై ఆధారపడేది. దిగుడు బావుల నుండి నీటిని యాతాముతోనూ, మోటలతోనూ తోడేవారు. సింహాసన ద్వాత్రింశికలో గోపరాజు 'ఈ యెడ గర్మభూమి' (6-70) పద్య భావాన్ని బట్టి-ఆ రోజులలో చెంచులు కొండజాతివారు, సంచార జాతులవారు అడవులలోని చెట్లను నరికి పోడు వ్యవసాయం చేసేవారు. భోజరాజీయంలో, మెరకపంటలు, పొట్టి కందులు, అనుములను అనంతుడు ప్రస్తావించాడు. పంటలకు దృష్టి దోషం తగలకుండా దిష్టి పిడతలు, ఎద్దుతలలు, ఏనుగు తలలను దంతాలతో పాటు నిలిపే వారని ధూర్జటి కాళహస్తీశ్వర మహత్మ్యం వలన తెలుస్తున్నది.

పొలాలను కొలవడానికి కేసరిపాటి కర్రను వాడేవారని ప్రత్తిపాటి శాసనంలో ఉంది. క్షేత్ర గణితంలో కూడా ఈ కర్ర ప్రస్తావన వుంది. వ్యవసాయదారులు చెల్లించే పన్నును 'కృషి ప్రపంచం' ('గనులు కృషి ప్రపంచ'1-99) అంటారని మడికి సింగన 'సకలనీతి సమ్మతం' వలన తెలుస్తున్నది. 14వ శతాబ్దంలో రైతులు సేద్యానికి, పశువులకు, బండ్లకు కూడా పన్నులు చెల్లించేవారని తెలుస్తున్నది.

అభివృద్ధి ముసుగులో వాతావరణ కాలుష్యం అధికం కావడంతో ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగిపోయి ధ్రువ ప్రాంతాలలోని మంచుకరిగి, సముద్రమట్టాలు పెరిగి, తీర ప్రాంతాల ఊళ్లు మునిగిపోతాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా మనిషికి చీమకుట్టినట్లయినా లేదు. శాస్త్ర పరిజ్ఞానాన్ని విచ్చలవిడిగా ఉపయోగిస్తూ భూమిమీద ఇతర జీవుల ఉనికికి, ప్రకృతి సమతౌల్యానికి ఇబ్బందికరంగా మారాడు. పచ్చని చెట్లను పెంచి ప్రకృతి సమతౌల్యాన్ని కాపాడినప్పుడే -రుతుపవనాలు కరి మబ్బులై రైతుకు ఆనంద వర్షాన్ని ప్రసాదిస్తాయి. భూమిని సస్యశ్యామలం చేస్తాయి. అందుకు ప్రతివారు తమ పరిసరాలను అందమైన అరణ్యాలను చేయాలి.

డా. కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

కర్తవ్య నిర్వహణకు లోటు రానీయకుండా కన్నుమూసిన శ్రీ దాసరి ఆంజనేయులు

దాసరి ఆంజనేయులు 1942 లో ఆర్ఎస్ఎస్ లో చేరి అనేక బాధ్యతలు నిర్వహించారు. దశాబ్దం పాటు కృష్ణాజిల్లా కార్యవాహగా పనిశారు. తదుపరి విజయవాడ విభాగ్ సహ కార్యవాహగా పనిచేశారు. ఏ బాధ్యత తీసుకున్నా మనస్సునూ, హృదయాన్నీ లగ్నంచేసి నియమనిష్ఠలతో నిర్వహించేవారు. విజయవాడలో, కృష్ణాజిల్లాలో రా.స్వ. సంఘ కార్య విస్తరణకు, పటిష్టీకరణకు ఎంతో కృషిచేశారు. ఎందరెందరో కార్యకర్తలకు ప్రేరణగా నిలిచారు. నిత్య శాఖ నియమాన్ని అంతిమశ్వాస వరకు ఆచరించారు.

ఆంజనేయులుకు విద్యారంగంపట్ల విశేషమైన ఆసక్తి. భారతీయ విద్యాపీఠం కార్యదర్శిగా పెక్కు పాఠశాలల నిర్వహణలో మార్గదర్శనం చేస్తూ, ఆయా విద్యాలయాల ద్వారా బాలబాలికలకు ఉత్తమ సంస్కారాలు అందించడానికి ఎప్పటికప్పుడు శ్రద్ధ వహిస్తూ వాటి అభివృద్ధికి, భవనాల నిర్మాణానికి వనరులు సమకూర్చుతూ వాటిని కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చారు. విజయవాడలోని శిశువిద్యా మందిరంలో 1986 జనవరిలో జరిగిన సంఘకార్యకర్తల శిబిరానికి సర్‌సంఘ్‌చాలక్ బాలాసాహెబ్ దేవరస్ విచ్చేయడం ఆంజనేయులుకు ఎంతో ఆనందం కలిగించింది. శిబిరం ముగింపు నాటి (26వ తేదీ) సాయంత్రం విజయవాడ గాంధీజీ మునిసిపల్ హైస్కూల్‌లో జరిగిన సార్వజనికోత్సవం ప్రారంభంలో ఆంజనేయులు వేదిక ఎక్కి సభాధ్యక్షులను, సర్ సంఘచాలక్‌ను, ఇతర పెద్దలను పరిచయం చేశారు. వేదికదిగి నిలబడ్డవారు నిలబడ్డట్లే ఒక్కసారిగా ఒక దూలం క్రింద పడినట్లుగా బిగుసుకొని పడిపోయారు. తనువు చాలించారు. ఎంతటి ధన్యజీవనం!? జనవరి 26, భారతగణతంత్ర దినోత్సవంనాడు, భరతమాత సేవలోనే తల్లి ఒడిలో తనువు చాలించిన ధన్యజీవి దాసరి ఆంజనేయులు. మరునాటి ఉదయం పూజ్య సర్‌సంఘచాలక్ బాలాసాహెబ్ దేవరస్ ఆంజనేయులు ఇంటికి వెళ్లి, భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆ తర్వాత కార్యకర్తల శిబిరంలో శ్రద్ధాంజలి సభ జరిగింది. దేశ కార్యాన్ని చేస్తూ చేస్తూనే పరమపదించిన ఆంజనేయులు కర్తవ్య పరాయణతను ప్రశంసిస్తూ, సర్‌సంఘచాలక్‌జీ ప్రసంగించారు. ప్రాంత సంఘచాలకులు చిలుకూరి సుబ్రహ్మణ్యశాస్త్రి కూడా శ్రద్ధాంజలి ఘటిస్తూ, ఆంజనేయులు ఆదర్శజీవితాన్ని కొనియాడారు. శిబిరం కార్యకర్తలంతా విలపిస్తూ కన్నీళ్లతో పుష్పాంజలి ఘటించారు.

దాసరి ఆంజనేయులు

ప్రసంగిస్తూ, 'మేము మద్రాసులోని సంఘ కార్యాలయంలో భోజనానికి కూర్చున్నాం. ఆ సమయంలో విజయవాడ నుండి బాలాసాహెబ్ దేవరస్, ఆబాజీ వచ్చారు. అక్కడి కార్యకర్తలు ప్రయాణం బాగా జరిగిందా? అంతా కుశలమే గదా? అని అడుగగా, 'విజయవాడ సార్వజనికోత్సవంలో ఆంజనేయులు స్వాగతవచనాలు పలికి, వేదిక దిగి ప్రాణాలు వదిలిన విషయం' ఆబాజీ తెలియజేశారు. ఆ మాట వింటూనే నోట్లో ముద్ద పెట్టుకోవటం ఆపి నలుగురు కార్యకర్తలు ఒకే మాట పలికారు. ఆ మాటలకు అర్థం 'ఎంత గొప్ప మరణమిది!' అని అన్నారు.

ఆపై దత్తోపంత్‌జీ ఇలా కొనసాగించారు. 'ఒకసారి నెపోలియన్ తన సైనిక దళాన్ని ఒక పనిపై పంపించి, విజయవార్తకై ఎదురుచూస్తున్నాడు. చూసి,చూసి విసిగి వేసారిన సమయంలో ఒక సైనికుడు గుర్రం దిగి, కుంటుకుంటూ వచ్చి, 'జనరల్! మనం యుద్ధం గెలిచాం' అని నివేదించాడు. అయితే ఆ సైనికుని రక్త సిక్త శరీరాన్ని చూసి– 'కాని, నీవు బాగా గాయపడినావే!' అంటూ సానుభూతి ప్రకటించాడు. దానికి జవాబుగా, "లేదు జనరల్! నేను గాయపడలేదు, నేను ఇప్పటికే మరణించాను" అంటూ ఆ సైనికుడు కుప్పకూలిపోయాడు. ఆంజనేయులు మరణమూ అలాంటిదే అంటూ ముగించారు.

ఆర్ద్ర స్వభావి, ఆదర్శ అధ్యాపకులు శ్రీ యరగుడిపాటి నరసయ్య

ఆనాటి నెల్లూరు జిల్లా ప్రచారక్ ఎన్.ఎమ్. దేశపాండే సంఘశాఖలో అనర్గళంగా ఆంగ్లంలో

కర్తవ్యనిర్వహణలో ఆద

సంఘస్థాన్‌లో, భగవాధ్వజఛాయలో, సర్‌సంఘచాలక్ సమక్షంలో "త్వదర్థే పతత్వేషకాయో నమస్తే నమస్తే" అని భరతమాతను కోరుతూ స్వయంసేవకులు చేసే ప్రార్థనను సార్థకం చేసుకున్న ధన్యజీవి ఆంజనేయులు.

44 సంవత్సరాలు నిష్ఠగా, నిరంతరంగా సంఘ కార్యంచేస్తూ మరింత సమయం సంఘకార్యానికి ఇవ్వలేకపోయానే అని మనసులో బాధపడుతూ, పదవీవిరమణ వయస్సుకు ముందే విరమించుకొని దాదాపు పూర్తి సమయాన్ని సంఘ పనికి ఇవ్వడం ప్రారంభించిన కొద్దినెలలకే వారు కన్నుమూశారు.

సాధారణ రైతు కుటుంబ జన్మించి ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొనవలసి వచ్చినా,"ఋణాను బంధరూపేణ పశుపత్నీ సుతాలయాఃా" అనే సూక్తిని ఆచరణలో పెడుతూ, అలాంటి ఇబ్బందులు సమాజకార్యానికి అడ్డురాకుండా నిబ్బరంతో మెలిగిన ఆదర్శ స్వయంసేవకులు దాసరి ఆంజనేయులు.

దత్తోపంత్‌జీ శ్రద్ధాంజలి

సత్యనారాయణపురం శిశుమందిరంలో ఆంజనేయులుకు వివిధ సంస్థల తరఫున శ్రద్ధాంజలి ఘటించే సభ జరుగుతూ ఉండగా, అనుకోకుండా భారతీయ మజ్దూర్ సంఘ్ సంస్థాపకులు దత్తోపంత్‌జీ తేంగ్డీ వచ్చారు. నిర్వాహకుల అనుమతితో

ఆపై దత్తోపంత్‌జీ ఇలా కొనసాగించారు. "ఒకసారి నెపోలియన్ తన సైనిక దళాన్ని ఒక పనిపై పంపించి, విజయవార్తకై ఎదురు చూస్తున్నాడు. చూసి,చూసి విసిగి వేసారిన సమయంలో ఒక సైనికుడు గుర్రం దిగి, కుంటుంటూ వచ్చి, 'జనరల్! మనం యుద్ధం గెలిచాం' అని నివేదించాడు. అయితే ఆ సైనికుని రక్త సిక్త శరీరాన్ని చూసి– 'కాని, నీవు బాగా గాయ పడినావే!' అంటూ సానుభూతి ప్రకటించాడు. దానికి జవాబుగా, "లేదు జనరల్! నేను గాయ పడలేదు, నేను ఇప్పటికే మరణించాను" అంటూ ఆ సైనికుడు కుప్పకూలి పోయాడు. ఆంజనేయులు మరణమూ అలాంటిదే" అంటూ ముగించారు.

ఇచ్చిన ఉపన్యాసాన్ని విని డిసెంబర్ 1944లో 9వ తరగతి విద్యార్థి నరసయ్య శాఖకు రావడం ప్రారంభించారు. ఆ విధంగా వారు గటనాయక్‌గా, శిక్షక్‌గా, ముఖ్యశిక్షక్‌గా అనేక బాధ్యతలను శ్రద్ధగా నిర్వహించారు. సోమయ్య నెల్లూరు జిల్లా ప్రచారక్‌గా ఉన్నప్పుడు వీరు తాలూకా కార్యవాహగా బాధ్యత స్వీకరించారు. జిల్లా శారీరక్, బౌద్ధిక్ ప్రముఖ్‌గా, జిల్లా, విభాగ్ కార్యవాహగా అకుంఠిత దీక్షతో కార్యక్రమాలను నిర్వహించారు. వీరు బాధ్యతను నిర్వహించిన సమయంలో పాతవారితోను, కొత్త వారితోనూ, కార్యకర్తలందరితో మంచి సంబంధాలు ఉండేవి. కార్యకర్తలకు చక్కని మార్గదర్శనం చేసేవారు. తన ఆర్ద్రస్వభావంతో–అందరికీ అత్యంత ఆత్మీయులై స్వయంసేవకుల హృదయాలను చూరగొన్నారు.

ఒకవైపు నెల్లూరు సెంట్‌పీటర్స్ హైస్కూలు గణితశాస్త్ర ఉపాధ్యాయులుగా సేవలందిస్తూనే మరోవైపు – నెల్లూరు జిల్లాలోనేగాక, చిత్తూరు, మదనపల్లి, తిరుపతి పట్టణాలలో పర్యటించి మార్గ దర్శనం చేశారు. హైస్కూలు విద్యార్థులకు అత్యంత

ర్మమూర్తులు

నైపుణ్యంతో పాఠాలు చెప్పి, వారి మన్ననలను పొందిన మహనీయుడై తనవద్ద విద్యనేర్చిన విద్యార్థుల హృదయాలలో శాశ్వత స్థానాన్ని పొంది ధన్యుడైనారు.

ఆయన గణితంలో స్వర్ణ పతక గ్రహీత. 'స్వయంసేవకులు సంఘపని బాగా చెయ్యటమేకాదు, బాగా చదవాలి. మంచి మార్కులు తెచ్చుకోవాలి' అని చెప్పేవారు. పరీక్షలకు ప్రతిరోజు ఉదయం 4.00గం.కు సైకిలుపై వచ్చి ఇంటింటికీ తిరిగి స్వయంసేవకులైన విద్యార్థుల్ని లేపి చదివించేవారు. తర్వాత శాఖ పూర్తి చేసుకొని ఉదయం. 9.30వరకు శాఖపనిలోనే తిరిగేవారు. మీరు బడికి ఎప్పుడు వెళ్తారని అడిగితే, "ఏముందయ్యా మరో 8 నిమిషాల్లో ఇంట్లో ఉంటాను. 5 ని.లు స్నానం, 8ని.ల్లో భోజనం చేసి మరో 5 నిమిషాల్లో బడిలో ఉంటాను" అంటూ సైకిల్‌పై వేగంగా వెళ్లేవారు. వారినుండి అందరమూ నేర్చుకోవలసిన సమయపాలన అది. నెల్లూరుకు దగ్గరగా ఉన్న గ్రామాలకు సాయంత్రం సమయంలో వెళ్లి సంఘకార్యాన్ని నిర్వహించేవారు.

సర్‌సంఘచాలకుల సహా అఖిల భారత అధికారుల పర్యటన కార్యక్రమాలలో వారి బౌద్ధికులను తెలుగులోకి అనువదించేవారు. వీరు నెల్లూరు విభాగ్ అంతా పర్యటించి సంఘశాఖల అభివృద్ధికి నిరంతరం కృషిచేశారు. ఒకవైపు ఉద్యోగం – సంఘశాఖల పని – మరోవైపు కుటుంబ నిర్వహణ –ఊపిరిసలపని పనులలో సంఘపనిని నిర్వహించే వారు. తమ ఇంటికి వచ్చిన సంఘకార్యకర్తలను, స్వయంసేవకులను ఆత్మీయంగా ఆదరించేవారు. వారికి నచ్చేవిధంగా సలహాలు ఇచ్చి మెప్పించడం వారి దైనందిన కార్యక్రమం.

పేద స్వయంసేవకుల కుమార్తెలకు వివాహం జరిపించడానికి, పేద విద్యార్థుల చదువు సాగడానికి ధనసహాయం చేసేవారు. ఏ మాత్రం కోపపడకుండా తన ఆత్మీయస్వభావంతో స్వయంసేవకులను, కార్యకర్తలను దగ్గర తీసేవారు. శారీరక బాధ ఉన్నా ఎవ్వరికీ తెలియనివ్వకుండా సంఘ కార్యక్రమాలను నిర్వహించేవారు. ఒకసారి సోమయ్య "నర్సయ్యగారు తక్కువగా మాట్లాడతారు, ఎక్కువగా పని చేస్తారు" అని వారి ఎదుటే ప్రశంసించారు.

ఉపాధ్యాయుడుగా – విద్యార్థులలో చురుకైన వారిని ఎంపిక చేసి నియమితంగా శాఖకు రప్పిస్తూ, నిదానంగా, అంచెలంచెలుగా తీర్చిదిద్దారు. అలా ఎందరో ప్రాంత, విభాగ్, జిల్లా, నగర స్థాయుల్లో వివిధ క్షేత్రాలలో ఈనాటికీ పనిచేస్తున్నారు. 1948 సంవత్సరంలో సత్యాగ్రహం చేసి జైలుకెళ్లారు. అక్కడి ఖైదీలకు చదువు చెప్పి, మొదటి శ్రేణిలో ప్యాసయ్యే టట్లు తర్ఫీదునిచ్చారు.

చిన్నతనంలో సంఘంలో చేరినప్పటి నుండి ఆఖరి క్షణము వరకు సంఘము కొరకు, సమాజము కొరకు జీవించారు. అత్యంత సామాన్యంగా కనపడే నరసయ్య అసామాన్యంగా జీవించారు. ఆయన గుర్తుకు రాగానే – వారి సైకిలు, సంచి జ్ఞప్తికి

ఒకసారి సోమయ్య "నర్సయ్యగారు తక్కువగా మాట్లాడతారు, ఎక్కువగా పని చేస్తారు" అని వారి ఎదుటే ప్రశంసించారు.

వస్తాయి. జీవితాంతము నిరాడంబరముగా, నిజాయతీగా, ప్రణాళికాబద్ధంగా, క్రియాశీలకంగా జీవిస్తూ సంఘపనిలో లీనమయ్యారు. నియమితంగా నిత్యమూ శాఖలో పాల్గొనడం, స్వయంసేవకుల ఇళ్లకెళ్లి ప్రేమతో కలియడం వారి జీవిత స్వభావము. అందువలననే నెల్లూరు జిల్లాలో ఉండే పెద్దలందరికీ, స్వయంసేవకులందరికీ నర్సయ్య మాట వేదవాక్కు. చూడగానే అత్యంత సామాన్యంగా కనపడే నర్సయ్య అసమాన్యమైన వ్యక్తిత్వము. నెల్లూరులో పనిచేసిన యువ ప్రచారకులందరు వారి ఆప్యాయత రుచి చూసినవారే. ప్రచారక్ నెల్లూరు రాగానే భోజన వ్యవస్థసహా స్వయంగా అన్ని ఏర్పాట్లుచేసేవారు. ప్రచారకులందరూ ఆయన దగ్గర అప్యాయత పొందినవారే.

ఎం.ఎల్.సి.గా పోటీ చేయాలని పలువురు ఒత్తిడి



యరగుడిపాటి నరసయ్య

తెచ్చినపుడు వినమ్రంగా తిరస్కరించారు నర్సయ్య. జయభారత్ ఆస్పత్రి ప్రారంభ వికాసాలల్లో వీరి కృషి అమూల్యం. అయినా అహంకారము దరిచేరనీయ లేదు. నెల్లూరులో ఏబీవీపీ, ఉపాధ్యాయ సంఘం, వీహెచ్‌పీ, భారతీయ జనసంఘ్ తదితర సంస్థల విస్తరణకు కృషిచేశారు.

భాగ్యనగరంలోని శ్రీ విద్యావిహార పాఠశాలకు ప్రధానాచార్యునిగా వెళ్లాలని సంఘపెద్దలు సూచించగానే అక్కడికి వెళ్లి 4 సంవత్సరాలపాటు ఉన్నత విద్యా ప్రమాణాలతో ఆ సంస్థను తీర్చిదిద్దారు.

విజయవాడ దగ్గరలోని విజ్ఞాన విహార పాఠశాల ప్రగతికై వెళ్లాలన్న సంఘపెద్దల సూచన మేరకు అక్కడ 2 సంవత్సరాలు పనిచేసి ఆ పాఠశాలను కూడా తీర్చిదిద్దారు. తమ 30 సంవత్సరాల ఉపాధ్యాయ జీవితంలో సేకరించిన అమూల్యగ్రంథాలను అక్కడి గ్రంథాలయానికి అందజేశారు.

సాధారణంగా కనపడే ఒక స్వయంసేవకు – ఉత్తమ ఉపాధ్యాయులుగా, ఉత్తమ గృహస్థునిగా, జీవితాంతము క్రియాశీల కార్యకర్తగా, సేవా భావంతో అనేక సంస్థలకు సహకరిస్తూ, నిరాడంబరంగా ప్రామాణికంగా, ఎంతోమంది కార్యకర్తలను తీర్చిదిద్దుతూ, అహంకార రహితంగా, ప్రశాంతంగా ఎలా జీవించగలరో మన కళ్లకు కట్టి చూపించారు నరసయ్య. అత్యంత ఉన్నతమైన జీవితం గడిపిన నర్సయ్య ఒక సంవత్సరం అనారోగ్యంతో బాధపడి జనవరి 19,2012న తుదిశ్వాస విడిచారు. నెల్లూరు జిల్లా సంఘశాఖలకు భీష్మపితామహునిగా ఉండి అలుపెరుగక సలహాలు, సహకారాలను అందించిన వ్యక్తి శాశ్వతంగా కనుమరుగైనారు.

భౌతికంగా వారు లేకపోయినా, వారు ప్రబోధించిన విషయాలు స్వయంసేవకులకు మార్గదర్శకాలు. స్వర్గీయ నర్సయ్య సంఘకార్యంలో జీవితాన్ని గంధం చెక్కలా అరగదీసి సుగంధాలు పంచిన మహనీయుడు. ఇదే సంఘసృష్టి.

'అపర భగీరథులు' పుస్తకం నుంచి

పుకార్లను నమ్మవద్దు.. కానుకలన్నీ భద్రం: రామాలయ ట్రస్ట్!

అయోధ్యలో బాలరామునికి భక్తులు సమర్పించిన కానుకల భద్రతపై చిలవలు పలవలుగా వస్తున్న ప్రచారాలకు అధికారిక ప్రకటన ద్వారా శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్రట్రస్ట్ (న్యాస్) తెరదించింది. జూన్ 27న ట్రస్ట్ విడుదల చేసిన పత్రికా ప్రకటన భక్తుల్లో భరోసాను నింపింది. ఇటీవల గత కొన్ని రోజులుగా ఆలయ విరాళాల విషయంలో చోటుచేసుకున్న పరిణామాలపై స్పందించిన ట్రస్ట్ కోశాధికారి స్వామి గోవిందదేవ్ గిరి, భక్తుల విశ్వాసాన్ని కాపాడేందుకు తాము బద్ధులమై ఉన్నామని స్పష్టం చేశారు. శ్రీరాముని సేవ నిమిత్తం ట్రస్ట్ అధికారులకు భక్తులు స్వయంగా అందజేసిన వెండి ఇటుకలు, బంగారు ఆభరణాలతో పాటుగా ఇతర విలువైన వస్తువులు అన్నీ పూర్తి లెక్కలతో, అత్యంత సురక్షితంగా ఉన్నాయని, భక్తులు ఈ విషయంలో ఎటువంటి ఆందోళనలకు లేదా అనుమానాలకు గురికావాల్సిన అవసరం లేదని ట్రస్ట్ ఈ ప్రకటన ద్వారా భక్తులకు స్పష్టమైన హామీని ఇచ్చింది. దేశవిదేశాల నుండి వచ్చే భక్తులు అయోధ్య శ్రీరామునికి సమర్పించిన కానుకలపై వస్తున్న పుకార్లను ట్రస్ట్ తీవ్రంగా ఖండించింది.

ఇక అయోధ్య రామమందిర ప్రాంగణంలోని దాన్‌పాత్రల (హుండీల) ఆదాయానికి సంబంధించిన కొన్ని ఘటనలపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక విచారణ బృందాన్ని (SIT) ఏర్పాటు చేసింది. ఇది సమర్పించిన మధ్యంతర నివేదిక ఆధారంగా ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. తప్పు చేసిన వారు ఎంతటివారైనా వదిలిపెట్టేది లేదని, కఠిన, చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఈ పత్రికా ప్రకటనలో ట్రస్ట్ తెలియజేసింది.

'కనిష్కను కూల్చింది ఖలిస్థానీ ఉగ్రవాదులే'

భారతదేశాన్ని ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఖలిస్థానీ ఉగ్రవాదులకు పరోక్ష మద్దతు, ఆశ్రయం ఇస్తూ ఇన్నేళ్లూ మెతక వైఖరిని చూపుతూ వచ్చిన కెనడా ప్రభుత్వం, ఇప్పుడు తన తీరును మార్చుకుంటోందా? అంటే అవుననే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. 329మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్న 'ఎయిరిండియా కనిష్క' విమాన ప్రమాదం జరిగి నాలుగు దశాబ్దాలు గడిచిన తర్వాత.. తొలిసారిగా ఆ దారుణానికి ఖలిస్థానీ ఉగ్రవాదులే కారణమని కెనడా అధికారికంగా ఒప్పుకుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా, ఈ ఘాతుకంలో ఖలిస్థానీ వేర్పాటువాదుల పాత్రను స్పష్టం చేసింది. 1985 జూన్ 23న టొరంటో నుంచి ముంబయి బయల్దేరిన ఎయిరిండియా బోయింగ్ విమానం 'కనిష్క'లో ఖలిస్థానీ ఉగ్రవాదులు బాంబుపెట్టడంతో, అది అట్లాంటిక్ మహా సముద్రంలో కూలిపోయి ప్రయాణికులంతా ప్రాణాలు కోల్పోయారు. ఇది ఖలిస్థానీ ఉగ్రవాదుల పనేనని భారత్ నాడే గట్టిగా వాదించినప్పటికీ, కెనడా మాత్రం వారి పాత్రను అంగీకరించడానికి నిరాకరించింది. విచారణను కూడా నామ మాత్రంగానే ముగించడంతో కీలక నిందితులు సులభంగా తప్పించుకున్నారు. అయితే తాజాగా, కెనడా సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ (CSIS) తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో ఈ ఘోరకలికి ఖలిస్థానీ వేర్పాటువాద ఉద్యమమే కారణమని తేల్చి చెప్పింది. కెనడా కేంద్రంగా పనిచేస్తున్న ఖలీస్థానీ తీవ్రవాద గ్రూప్ 'బబ్బర్ ఖాల్సా' సభ్యులు విమానంలోని లగేజీ విభాగంలో బాంబులు పెట్టి దీనిని కూల్చేశారని, ఇది కెనడా చరిత్రలోనే అత్యంత దారుణమైన ఉగ్రదాడి అని అధికారికంగా పేర్కొంది. ఈ దారుణ ఘటనలో తెలుగు ప్రముఖుడు, శాస్త్రవేత్త అయిన డాక్టర్ యలవర్తి నాయుడమ్మతో పాటు మరెందరో భారతీయ ప్రముఖులు మరణించారు. మరో 80 మంది పిల్లలు కూడా చనిపోయారు.



అమర్‌నాథ్ యాత్రకు 'ఆపరేషన్ శివ'తో రక్షణ

పరమశివునిపై అమిత భక్తి విశ్వాసాలతో దేశవ్యాప్తంగా చేపట్టే అమర్‌నాథ్ యాత్రకు గతంలో ఎన్నడూ లేని విధంగా భారత ప్రభుత్వం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. "ఆపరేషన్ శివ" పేరిట సైన్యం ఈసారి ప్రత్యేక రక్షణ వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఈ యాత్రకు విచ్చేస్తున్న భక్తుల రక్షణ కోసం సరికొత్త టెక్నాలజీతో కూడిన యాంటీ – డ్రోన్ వ్యవస్థను వినియోగిస్తోంది. సున్నితమైన 55 ప్రదేశాల్లో అత్యాధునిక యాంటీ డ్రోన్ గన్‌లు, నిఘా పరికరాలను సిద్ధం చేశారు. ఇంత పెద్ద ఎత్తున ఇలాంటి వ్యవస్థను ఉపయోగించడం దేశంలోనే ఇది మొదటిసారి. ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ పరికరాలు, ప్రత్యేక నిఘా వ్యవస్థలు శత్రు డ్రోన్లను గుర్తించి క్షణాల్లో అంతం చేయగలవు. ఈ వ్యవస్థ సుమారు 400 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న జమ్మూశ్రీనగర్ జాతీయ రహదారి, బాల్తాల్, పహల్గామ్ మార్గాలను పర్యవేక్షిస్తుంది. ఆర్మీ నార్తర్న్ కమాండ్ లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ స్వయంగా బాల్తాల్, సోన్‌మార్గ్ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సమీక్షించారు. యాత్రా మార్గంలో క్యూఆర్‌టీ, క్యూఈటీ, బాంబు నిరోధక దళాలు, డాగ్ స్క్వాడ్‌లు, మౌంటెన్ రెస్క్యూ టీమ్‌లను అందుబాటులో ఉంచారు. లఖన్‌పూర్ నుంచి పవిత్ర అమర్‌నాథ్ గుహ వరకు ఉన్న మార్గాన్ని హైఅలర్ట్ జోన్‌గా ప్రకటించారు. అమర్‌నాథ్ క్షేత్రం పాక్ సరిహద్దుకు దగ్గరగా ఉన్నందున ముందు జాగ్రత్తగా అదనపు బలగాలను మోహరించారు.

विद्यया ऽ मृतमश्नुते

एन सी ई आर टी NCERT

ఎన్‌సిఈఆర్‌టీ పాఠ్యాంశాల్లో ఎమర్జెన్సీ పాఠం

భారత విద్యావ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా ఎన్‌సిఇఆర్‌టీ (National Council of Educational Research and Training - NCERT) కీలకమైన నిర్ణయం తీసుకుంది. భారతదేశంలో 1975లో విధించిన ఎమర్జెన్సీ పరిస్థితులను తొమ్మిదో తరగతి సాంఘికశాస్త్ర పాఠ్యాంశంగా చేర్చింది. ఎమర్జెన్సీ విధింపు అనేది భారత రాజ్యాంగంలో చీకటి అధ్యాయమని, ఆ సమయంలో ప్రాథమిక హక్కులకు తీవ్రంగా భంగం కలిగిందని పేర్కొంది. నాడు మన దేశానికి జరిగిన అన్యాయం గురించి నేటితరం విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం కూడా ఉందని నొక్కి చెప్పింది. పత్రికలకు సెన్సార్‌షిప్ విధించడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించినవారిని జైళ్ళకు పంపడం, విద్యార్థులకు సైతం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించడం... ఇలా ఎమర్జెన్సీ సమయంలో దేశం ఎదుర్కొన్న సవాళ్లను కూడా ఆ పాఠ్యాంశంలో NCERT ప్రస్తావించింది. ప్రజాస్వామ్యాన్ని సవాల్ చేసిన అతి ముఖ్య సందర్భాల్లో ఒకటిగా ఎమర్జెన్సీని అందులో అభివర్ణించింది. 'భారతదేశం లోపలి, బయటి సమాజాల అధ్యయనం' పేరిట ఎన్‌సీఈఆర్‌టీ కొత్తగా రూపొందించిన తొమ్మిదో తరగతి సాంఘికశాస్త్ర పాఠ్యపుస్తకంలో భారతప్రజాస్వామ్య బలం, ఎదురైన సవాళ్లను పరిచయం చేస్తూ, ఎమర్జెన్సీపై ఒక అధ్యాయాన్ని పొందుపరిచారు. ఎమర్జెన్సీతో పాటుగా నేటి సమాజంలో ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారిన మరికొన్ని అంశాలను కూడా ఈ అధ్యాయంలో చేర్చారు. ఫేక్‌న్యూస్, తప్పుడు సమాచారం, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘన, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, పేదరికం, ప్రాంతీయతత్వం, సామాజిక వివక్ష, లింగ అసమానతలను గురించి కూడా ఈ పాఠ్యాంశంలో ఉన్నాయి.

మొహర్రం వేళ భారీ కుట్ర...

దేశంలో అశాంతిని రేకెత్తించేందుకు అసాంఘిక శక్తులు నానా విధాలుగా ప్రయత్నిస్తున్నాయి. తాజాగా మొహర్రం సందర్భంగా ముంబైలో ఓ కుట్ర బయటపడింది. ఫయాజ్ ప్రేమ్ జీ అనే వ్యక్తి నొప్పి నివారణ, రోగనిరోధక శక్తిని పెంచే మందులని చెప్పి ప్రజలకు ఎలుకల మందుతో ఉన్న విషపూరిత క్యాప్సుల్స్ పంపిణీ చేశాడు. ఆ క్యాప్సూల్స్‌లో జింక్ ఫాస్ఫైడ్ అనే అత్యంత విషపూరిత రసాయనం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. సాధారణంగా ఈ రసాయనాన్ని ఎలుకల మందులో ఉపయోగిస్తారు. ఈ క్యాప్సూల్స్ తీసుకున్న 11మంది అస్వస్థతకు గురవగా, వారిని వెంటనే హాస్పిటల్‌లో చేర్చడంతో ప్రాణాపాయం తప్పింది. తాను సుమారు 15వేల మందిని చంపాలనుకున్నట్టు విచారణలో నిందితుడు ఫయాజ్ ప్రేమ్‌జీ చెప్పినట్లు అధికారులు వెల్లడించారు. కుట్రలో భాగంగా ఫయాజ్ 30వేల ఖాళీ క్యాప్సూల్స్, 50 కిలోల జింక్ ఫాస్ఫైడ్ (Zinc phosphide) ఆర్డర్ చేసినట్టు బయటపడింది. ఇతని వెనుక మరెవరైనా ఉన్నారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ భారీ కుట్రను ముగ్గురు మహిళా వాలంటీర్లు పసిగట్టి అడ్డుకున్నారు. నిందితుడు అనుమానాస్పదంగా ఈ క్యాప్సూల్స్ పంచుతుండటాన్ని వారు గమనించి, వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పూనేకు చెందిన నిందితుడు ఫైయాజ్ అక్కడ ఒక పెయింటింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. 15 రోజుల క్రితం ముంబై వచ్చి ఎలుకల మందుగా వాడే జింక్ ఫాస్ఫైడ్‌ని ఒక్కో క్యాప్సూల్‌లో ఒక గ్రామ్ చొప్పున నింపాలనుకున్నాడు. 30,000 క్యాప్సూల్స్‌లో నింపి మొహర్రం సందర్భంగా అందరికీ పంచాలని నిర్ణయించుకున్నాడు. కానీ, 14,900 ట్యాబ్లెట్లను మాత్రమే సిద్ధం చేయగలిగాడు. వీటిలో కొన్ని మొహర్రం సందర్భంగా కొందరికి పంచేందుకు ప్రయత్నించాడు కానీ, చాలా తక్కువమందికి మాత్రమే అతడు ఆ ట్యాబ్లెట్లు ఇవ్వగలిగాడు. ఆ లోపు పోలీసులకు సమాచారం అందించడంతో అతడిని పట్టుకున్నారు.

బహుభార్యత్వాన్ని సమర్థించిన మహిళా ఎమ్మెల్యే

మహారాష్ట్ర అసెంబ్లీలో ఎన్‌సీపీ ఎమ్మెల్యే సనా మాలిక్ బహుభార్యత్వాన్ని సమర్థిస్తూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఇవి తీవ్ర విమర్శలకు దారితీయడమే కాకుండా.. ముస్లిం పర్సనల్ లా, మహిళల హక్కుల అంశాలపై మరోసారి దేశవ్యాప్త చర్చకు తెరలేపాయి. ఎన్‌సీపీ (అజిత్ పవార్ వర్గం) సీనియర్ నాయకుడు నవాబ్ మాలిక్ కుమార్తె అయిన సనా మాలిక్, అసెంబ్లీ వర్షాకాల సమావేశాల రెండో రోజున మహిళలు, కుటుంబ సమస్యలు, విడాకులపై జరిగిన చర్చ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. బహుభార్యాత్వ విధానాన్ని కేవలం ఒక వర్గానికి మాత్రమే ఆపాదించి చూడకూడదని సనా మాలిక్ వాదించారు. కేవలం ముస్లింలనే టార్గెట్ చేయడాన్ని ప్రశ్నిస్తూ, "వేధింపులన్నీ ఒక్క ముస్లిం మహిళలకే జరుగుతున్నాయా?" అని ఆమె నిలదీశారు. ఇస్లాంలో బహు భార్యాత్వానికి అనుమతి ఉందని, ముస్లిం పర్సనల్ లాతో పాటు ఖురాన్‌లోనూ దీని గురించి స్పష్టమైన ప్రస్తావన ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ సమస్య కేవలం ఒక మతానికి మాత్రమే పరిమితం కాదన్న ఆమె, "ముస్లింలలో దీనికి అనుమతి ఉంది సరే, కానీ కేవలం ముస్లిం పురుషులు మాత్రమే బహుభార్యాత్వాన్ని పాటిస్తున్నారా? ఇతర మతాల పురుషులు అలా చేయడం లేదా? మిగతా వర్గాలలోనూ ఇది జరుగుతోంది" అన్నారు. ఖురాన్‌లోని ఈ అంశాన్ని పాకిస్థాన్ అమలు చేస్తోందని గుర్తుచేసిన ఆమె, "ఖురాన్‌లో ఉన్న ఈ విధానాన్ని పాకిస్థాన్ లాగే ఇక్కడ కూడా తీసుకురావాలని మేం డిమాండ్ చేస్తున్నాం" అని వ్యాఖ్యానించారు.

కథ

సుమారు 1960 ప్రాంతం నుండి, నాకు మా ఇంట్లో జరిగే దేవీ నవరాత్రులు గుర్తున్నాయి. అప్పటికి నాకు ఎనిమిది సంవత్సరాలు. మా నాన్న హరిపురంలో దసరా ఉత్సవాలు చేయటం ప్రారంభించారని చెప్తారు. మొదట తొమ్మిది రోజులు చేసేవారు. హరికథలూ, బుర్రకథలూ, బండ్ల వేషాలు, వీధి భాగోతాలు-ఆ తొమ్మిది రోజుల్లో జరిగేవి. నాన్నే ఖర్చంతా పెట్టేవారు. ఎవరి దగ్గరా తీసుకునే వారు కాదు. ఆ తరువాత మా నాన్న ఆదాయం తగ్గి ఆ ఉత్సవాలు మూడు రోజులకి దిగాయి.

దసరా నవరాత్రులప్పుడు మా ఇంట్లో బలే సందడిగా ఉండేది. దేవీ పటాన్ని ఇంటి మూడో అంతస్తు గది నుండి నాన్నగారి కాంపౌండర్ జన్ని రామ్మూర్తి దించేవాడు.

ఆ పటాన్ని ప్రతిష్ఠించడానికి ఓ కర్ర కుర్చీ ఉండేది. దాన్ని అలంకరించడానికి ఉలిపిరి కాగితాలతో రంగురంగుల పువ్వులు తయారు చేయడం మూడురోజుల ముందు నుంచే ప్రారంభమయ్యేది. పూలు చేయడం, ఐడియాలు ఇవ్వటంలో మా పిల్లల మధ్య చాలా పోటీ ఉండేది.

దసరా సంబరాల్లో జరిగే అన్ని కార్యక్రమాల్లో మా పిల్లలకి నచ్చిన కార్యక్రమం హరికథ. హరికథ అంటే మా హరిదాసు మామయ్య హరికథే. పిల్లలు అంటే మా తమ్ముడు భవానీ, చెల్లెలు రాజేశ్వరి, అప్పటికింకా మరో తమ్ముడు దుర్గా పుట్టలేదు. మా చిన్నాన్న పిల్లలూ, పక్క వీధి పంతులుగారి పిల్లలు. ఇంకా చాలామంది పిల్లలు చేరేవారు. అన్ని సంవత్సరాల్లోనూ మా ఇంట్లో సంబరాలకు ఆయనే హరికథకి మొనాపొలి. పేరున్న వారున్నా నాన్న మరెవరితోనూ చెప్పించలేదనుకుంటా.

హరిదాసు మామయ్య మా జ్ఞాపకాల్లో, మా ఇంట్లో అలా పాతుకు పోవడానికి కారణాలు ఎన్నో వున్నాయి.

ఆయన అసలు పేరు నరసింహ మూర్తి ఆచారి. వాళ్లు షరాబులు. శ్రీకాకుళం దగ్గిర అరసవిల్లి వాళ్ల ఊరనుకుంటా. దసరా సంబరా లకి ముందు, సంబరాల్లో కళారూపాలు ప్రదర్శించే వారికి పోస్ట్ కార్డులు వెళ్లేవి. సాధారణంగా చుట్టాలను పిలవడమంటూ ఉండేది కాదు. పిలవకుండానే వచ్చి పూజ ఏర్పాట్లలో సాయం చేసేవారు. అలాంటి వాళ్లు మా చిన్నమ్మ, మేనత్త, చిన్నాన్న, ఊర్లో స్నేహితులు.

హరిదాసు మామయ్య మాత్రం కార్డు అందగానే ఒక వారం ముందే రెక్కలు కట్టుకుని హరిపురం వచ్చేసేవాడు. నిజంగా రెక్కలు కట్టుకునే!

ఆయన దిగిన వెంటనే-ఆ హడావిడీ, అందర్ని పలకరించడం, జోక్స్ వేసి నవ్వించేవారు.

ఆయన ఏమీ పెద్ద సరంజామాతో దిగే వాడు కాదు. ఓ నల్ల ట్రావెల్ జిప్ బ్యాగులో హరిదాసు వేషానికి సంబంధించిన ఎర్ర పట్టుపంచె, జరీ అంచు పసుపు రంగు ఉత్తరీయం, చిడతలు, గజ్జెలు, నాంపండు, మెడలోకి పూసల దండా ఉండేవి. అవికాక ఓ రెండు జతల దుస్తులు.

పూజకి కేటాయించిన హాల్లో ఓ మూల పొడవు బెంచి కింద ఆయన ట్రావెల్ బ్యాగు ఒదిగిపోయేది. రాత్రి ఆ హాల్లోనే నిద్ర. స్నానాదికాలకు ఊరి చెరువు. చెరువు గట్టున శివాలయంలో పూజ తరువాత, నుదుట విభూతిలో, నోట్లో కిళ్లీతో ఆయన రోజు మొదలయ్యేది.

ఆయన వేషధారణ-శుభ్రంగా ఉతుక్కున్న ముతక తెల్ల లాల్చి, పంచె, భుజం మీద ఎర్ర తువ్వాలు. మనిషి చాలా హాస్యంగా ఉండేవాడు. ఏదో ఒక మాట అనేవాడు. దాంతో అందరికీ నవ్వొచ్చేది. ఆయన ఉన్న చోటు నుంచి ఏవో నవ్వులు వినపడుతుండేవి. నాకు తెలిసినంతవరకు ఆయన జోక్స్ వేయనిది ఇద్దరితోనే. వారు మా నాన్న, అమ్మా. మా అమ్మయితే, అన్నయ్యా అని పిలిచి మరీ భోజనం పెట్టేది.

ఆయన అలా వారం ముందు వచ్చినా ఎవరికీ ఇంట్లో ఇబ్బంది ఉండేది కాదు. పిల్లలకి మాత్రం ఆయన వస్తే సందడే. చెరువుకి వెళ్లి కలువపూలు తేవడం, బంతి పూలతో దండలు కట్టి దేవి పటానికి అలంకరించటం, ప్రసాదం పెట్టటం.. వంటి వాటన్నిటికి అనధికారిక పూజారిగా వ్యవహరించే వాడు.

దసరా నవరాత్రులలో రెండో రోజో, మూడో రోజో, లేక చివరి రోజో ఆయన హరికథా కాలక్షేపం ఉండేది. మా ఇంటి ముందు కర్ర బల్లలతో ఓ స్టేజీ వేసేవారు. దానిమీదే చాలా వరకు అన్ని కార్యక్రమాలు జరిగేవి. మొదట పెట్రోమాక్స్ లైట్లూ, ఆ తరువాతి రోజుల్లో ఎలక్ట్రికల్ లైట్స్‌తో స్టేజి వెలిగిపోయేది.

హరిదాసు మామయ్య గాత్రం వినటానికి బాగుండేది. పద్యాలు, కీర్తనలు, సంగీతయుక్తంగా ఉండేవి. ఆయన పాడుతుంటే గొంతులో ఓ జీర ఉండేది. అతను బాగా కిళ్లీలు తినటంవల్ల ఆ గొంతు అలా ఐపోయిందేమోనని మా అనుమానం.

అతను స్టేజి మీదికి వచ్చి మైకు ముందు నుంచోవడం, జన్ని రామ్మూర్తి హార్మోనియం, వల్లభరావు మద్దెలతో చెరో పక్కన కూర్చోగా, హరికథ దృశ్య కావ్యం మొదలయ్యేది. కొన్ని సంవత్సరాలుగా మా హరిదాసు మామయ్య చెప్పిన చాలా కథలు మాకిష్టమైనవి ఉన్నాయి. రుక్మిణీ కల్యాణం, భక్తప్రహ్లాద, భక్త రామదాసు, సుందరకాండ, శ్రీకృష్ణ జన్మవృత్తాంతం, పాండవ వనవాసం- ఇలా కొన్ని మా మనసుల్లో ఉండిపోయాయి. అందులో రుక్మిణీ కల్యాణం చాలా ప్రత్యేకం.



భండారు సదాశివరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది

కాలాన్ని మామయ్య

బమ్మిడి దేవీప్రసాద్

ఆ కథ చాలాసార్లు అతను చెప్పినట్టు గుర్తు. అందులో పోతన పద్యాలే ఎక్కువ పాడేవాడు. హరిదాసు మామయ్య హావభావాలు, పాట, గజ్జెలు కదలింపు, నాట్యం లయబద్ధంగా వుండేవి. ముఖ్యంగా భావం, ఆంగికం రుక్మిణీ దేవి శ్రీకృష్ణుడికి వద్దకు పంపిన బ్రాహ్మణుడి కోసం వేచి చూస్తూ పడిన వేదన, ఆయన గాత్రం లో వ్యక్తమయ్యేది.

"ఘనుడా భూసురుడేగెనో, నడుమ మార్గశ్రాంతుడై చిక్కెనో, విని కృష్ణుండది తప్పుగా తలచెనో" అంటూ ఎడమ ముణుకు మీద కూర్చుని కుడికాలిపై మోచేతి మీద ముఖమానించి దీనంగా "నా భాగ్యమెట్లున్నది" – అని పద్యం



ముగించి ఓ రెండు క్షణాలు అలాగే ఉండిపోయేవాడు. ప్రేక్షకుల ముఖాల్లో ఆమె పడుతున్న బాధ కనపడేది. ఆ క్షణాన, వేదిక మీద పందిరిలో కొబ్బరాకులు గాలికి కదిలే చప్పుడు తప్పించి మరేమీ ఉండేది కాదు.

"లగ్నంబెల్లి వివాహముంగదిసె నేల రాడు గోవిందుడని" ఉద్విగ్నమైన రుక్మిణి మనస్సులోని భావాల్ని తన గొంతులో పలికించే వాడు. అలాగే, పార్వతీదేవీ మందిరం నుండి బయటికి చెలికత్తె వేలుపట్టుకుని రుక్మిణి ఎలా మెల్లగా నడుస్తూ వస్తోందో వయ్యారంగా స్టేజి మీద నడిచి చూపిస్తే ప్రేక్షకులు నవ్వులు, చప్పట్లతో ఊగిపోయేవారు. ఆ వెంటనే అతని కంఠం, ఆంగికం మారిపోయేవి. రుక్మిణి ఆ దారిలో శ్రీకృష్ణుడ్ని ఎలా చూసిందో చెప్పే పద్యంలో–

"కనియెన్ రుక్మిణి, చంద్రమండల ముఖున్ కంఠీరవేంద్రావలజ్జున్... కంబు కంఠున్, జగన్మోహనున్," గొప్పగా, గంభీరంగా, కంచుమోగినట్టు అతని గానం, గజ్జెల లయబద్ధ శబ్దాలు మా చెవుల్లో మారుమోగేవి. ఆ కృష్ణుడు రుక్మిణీ దేవికి ఎలా కనిపించాడో గాని, మా మనసుల్లో కృష్ణుడి సుందరరూపం ముద్ర పడిపోయింది. ఆ రూపానికి దైవత్వం నేను అంటగట్టక పోయినా, ఒక గొప్ప వ్యక్తిగా, రాజనీతిజ్ఞునిగా, గీతోపదేశికుడిగా నా మనసులో ఆ రూపం ఉండి పోయింది.

ఇక చివరిగా, అలా కృష్ణుణ్ణి చూసిన తరువాత ఆమె రథం వైపు ఎలా నడిచి వచ్చి, కృష్ణుడి చేయి అందుకుని రథం ఎక్కడాన్ని, హోయలుగా నడుస్తూ ఒక చిన్న గెంతు గెంతి రథం అధిరోహించడాన్ని చూపేవాడు. ఆ వయ్యారానికి, నడకకి మరలా ప్రేక్షకుల్లో నవ్వులూ, కేరింతలూ.

కథలో మధ్య మధ్య హాస్యస్ఫోరకమైన పిట్టకథలు, ఒకటో రెండో సినిమా పాటలూ ఉండేవి.

రుక్మిణీ కల్యాణం తరువాత మా అందరికి నచ్చిన కథ భక్త రామదాసు.

"ఏ తీరుగ నను దయ తలచెదవో ఇన వంశోత్తమ రామా...నా తరమా భవ సాగర మీదను నళిన దళేక్షణ రామా"...అంటూ హరిదాసు మామయ్య పాడిన ఆ కీర్తన– ఆ వీధిలో, పందిరి కింద, లైట్ల వెలుతుర్లో వెలవెలబోయిన బయటి వెన్నెల్లో, ఆ గాలిలో– నాకు ఇంకా వినపడుతోనే వుంటుంది.

"ఇక్ష్వాకు కుల తిలకా... భరతునికి చేయిస్తి పచ్చల పతకము..ఆ పతకమునకు పట్టే పదివేలా వరహాలు రామచంద్రా"

మాకు ఇష్టమైన కీర్తన. రామదాసు ఎలా తిట్టేడో రామభద్రుడినని అనుకునే వాళ్లం.

"ఆ దెబ్బలకోర్వక అబ్బా తిట్టితినయ్యా" అనే చరణం ఆ తిట్లకు ఉపసంహారంగా మాకు అనిపించేది.

అలా కొద్ది సంవత్సరాలు గడిచిపోయేయి. ఈలోగా కాలం పెనుమార్పులు తెచ్చింది. అది 1970–1975 ప్రాంత కాలం. నేను విజయనగరం లో పి.యు.సి తరువాత, శ్రీకాకుళం గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్‌లో బీయెస్సీ చదువుతున్న రోజులు. అప్పటికి హరిదాసు మామయ్య హరికథా కాలక్షేపం మా దసరా సంబరాల్లో నిరాటంకంగా జరుగుతోనే ఉంది. ప్రేక్షకులు బాగానే వస్తున్నారు. వేదిక దగ్గర నుండి వీధి చివర బాదం చెట్టు వరకు జనాలు నిండేవారు. హరిపురంలో హరికథ చెప్పిన తరువాత చుట్టుపక్కల ఉద్దానం గ్రామాల్లో కూడా ఆయన

హరికథలు జరిగేవి. కాస్త డబ్బులు చేర్చుకుని, నవరాత్రులై పోయేక శ్రీకాకుళం వెళ్లేవారు.

ఐతే, కాలంతో పాటుగా కొన్ని మార్పులొచ్చాయి. ఆనవాయితీగా ప్రతి సంవత్సరం దసరా సంబరాల్లో ఆయన హరికథా కాలక్షేపం ఉన్నా, రాను రాను జనం రావడం తగ్గిపోయింది. రికార్డింగ్ డాన్సుల ప్రభావం గ్రామాలకి ప్రాకింది. హరికథకే కాదు, పౌరాణిక నాటకాలు, వీధి బాగోతం వంటి కళా రూపాల మీద ప్రజలకి ఆసక్తి తగ్గిపొయింది.

జనం అంతగా రాకపోయినా, మా నాన్న అతనినే కథ చెప్పమనేవారు. అందుకు వేరే కారణాలు కూడా ఉండేవి. అలా కథ చెప్పడం వల్ల ఆయనకు డబ్బులివ్వడానికి వీలయ్యేది. లేకపోతే తను తీసుకోడని నాన్నకి తెలుసు. అలాగే ఆయన ప్రోగ్రామ్ ఉండటం వల్ల ఆ సంబరాలలో ఆయన రాకకు ఓ స్థానం, ప్రయోజనం ఉండేది.

అలా దసరా సంబరాలకి హరిదాసు మామయ్య వచ్చేవాడు. ఏదో ఒక రాత్రి ఎంతమంది ఆడియన్స్ ఉన్నా సిన్సియర్‌గా హరికథ చెప్పేవాడు. మా నాన్న ఇంటిముందు సిమెంటు గడప మీద కూచుని తప్పనిసరిగా కథ వినే వారు. మేం ఎలానూ ఆడియెన్స్‌లో ఉండే వాళ్లం. ఓ రెండు సంవత్సరాల తర్వాత ఒక దసరా ఉత్సవాలలో ఇది జరిగింది.

అది 1974వ సంవత్సరమేమో. ఎప్పటిలాగే సంబరాలకి హరిదాసు మామయ్య ఊళ్లోకి దిగేడు. పూజ, భజనాది కార్యక్రమాలలో బిజీగా తిరుగుతున్నాడు. రెండు రోజులు గడచి పోయేయి. మా నాన్న హరికథా కాలక్షేప ప్రస్తావన ఎంతకీ తేకపోతుంటే, ఆయనే కల్పించుకుని –

'మాస్టారూ! హరికథ ఎప్పుడు పెట్టిద్దాం' అన్నాడు.

మా నాన్న ఆలోచనల్లో పడినట్టు కన్పించారు.

'జనాలు మరీ పల్చనై పోతున్నారు ఆచారీ! ఏం చేద్దాం' అన్నారు.

'ఈసారి బాగా చెప్పి రక్తి కట్టిద్దాం. నా శాయశక్తులా ప్రయత్నిస్తాను' అన్నాడతను.

మా నాన్నేమన్లే. మూడో రోజు రాత్రికి హరికథ కాలక్షేపం నిర్ణయించారు. ఆ సాయంకాలం నుండే మైక్‌లో రాత్రి జరుగబోయే హరికథ గురించి అనౌన్స్‌మెంట్స్ వచ్చేయి.

రాత్రి తొమ్మిదయింది. హరిదాసు మామయ్య తయారై చిడతలు పట్టుకుని హాల్లో అటూ ఇటూ తిరుగుతున్నాడు. ఇంకా జనం ఎవరూ స్టేజీ ముందుకు చేరలా. పిల్లలు మాత్రం దీపాల కింద పరిగెడుతూ ఆడుకొంటున్నారు.

అరగంటైంది. గంటైంది. ఒకరిద్దరు వచ్చి కూచున్నారు. స్టేజి పక్కన ఉసిరిక చెట్టు కింద ఓ కుక్క చలికి ముడుచుకుని నిద్ర పోతోంది.

ఇక ఆలస్యం చేయకూడదని హరిదాసు, ఆయన

కుక్క మళ్లీ రాగం మొదలెట్టింది. ఇలా హరిదాసు రాగం ఎత్తుకోవడం, కుక్కఅదేవిధంగా రాగం మళ్లే అరవడం మరో రెండుసార్లు జరిగినప్పటికీ హార్మోనియం వాయిస్తున్న రామ్మూర్తి తువ్వాలు నోటికి అడ్డం పెట్టుకుని నవ్వటం మొదలెట్టేడు. వల్లభరావు మాత్రం నవ్వు తొక్కి పెట్టుకున్నట్టు కనిపించేడు. మా నాన్న మొదట నవ్వినా వెంటనే నవ్వు ఆపి సీరియస్‌గా ఐపోయేరు. ఇక లాభం లేదనుకున్నాడేమో హరిదాసు మామయ్య మంగళ హారతి చెప్పేసి స్టేజీ దిగిపోయేడు.

టీమ్ స్టేజి మీదకి చేరేరు. విఘ్నేశ్వర ప్రార్థన, సరస్వతీ ప్రార్థన చేసి కథ మొదలుపెట్టేడో లేదో, ఆ ఇద్దరు ప్రేక్షకులు మెల్లగా నిష్క్రమించారు.

ఇక అప్పటికి, సిమెంటు గడప మీద మా నాన్న, మేడ మీద నుంచి చూస్తున్న మా అమ్మ, నేను, చెల్లి రాజేశ్వరి, స్టేజి మీద రామ్మూర్తి, వల్లభరావూ మిగిలాం. ఐనా నిరుత్సాహ పడకుండా గజ్జె కదలించి వద్యం ఎత్తుకున్నాడు ఆ నిర్మానుష్యమైన ప్రదేశాన్నుద్దేశించి.

ఎన్నాళ్లో, ఎన్ని కథలో చెప్పి ఎందరినో మెప్పించిన ఆ స్టేజి మీద, మడమ తిప్పకుండా కథా కాలక్షేపం చేయాలన్న పట్టుదల అతనిది. కానీ అదెలాంటి పరిస్థితి? అదెంత విషాదం?

కథ ప్రారంభించిన కాసేపటికి, ఉసిరిక చెట్టు కింద ఉన్న కుక్కకి నిద్రా భంగమైనట్లుంది నెమ్మదిగా లేచి ఒళ్లు దులుపుకొని ప్రేక్షక స్థానానికి, అదే స్టేజీ ముందుకి వచ్చి కూర్చుంది.

హరిదాసు పద్యంలోని చరణం పూర్తి చేసి రాగం ఎత్తుకున్నాడు. స్టేజి ముందున్న బైరవుడు మోరెత్తి 'ఓ' – అంటూ అరవటం ప్రారంభించేడు. అనూహ్యమైన ఆ సంఘటనకి కాస్త తికమకపడ్డా, అతను ఛా!ఛా! అని కుక్కని అదిలించి మళ్లా రాగం అందుకున్నాడు.

కుక్క మళ్లీ రాగం మొదలెట్టింది. ఇలా హరిదాసు రాగం ఎత్తుకోవడం, కుక్క అదేవిధంగా రాగంమళ్లే అరవడం మరో రెండుసార్లు జరిగినప్పటికీ హార్మోనియం వాయిస్తున్న రామ్మూర్తి తువ్వాలు నోటికి అడ్డం పెట్టుకుని నవ్వటం మొదలెట్టేడు. వల్లభరావు మాత్రం నవ్వు తొక్కి పెట్టుకున్నట్టు కనిపించాడు. మా నాన్న మొదట నవ్వినా వెంటనే నవ్వు ఆపి సీరియస్‌గా ఐపోయేరు.

ఇక లాభం లేదనుకున్నాడేమో హరిదాసు మామయ్య మంగళ హారతి చెప్పేసి స్టేజీ దిగిపోయేడు.

రామ్మూర్తి స్టేజి దిగి ఓ కర్రుచ్చుకుని, 'దీనెమ్మా...' అని బూతులు తిడుతూ ఆ కుక్కని వీధి చివరకు తరుముకుంటూ వెళ్లేడు. నేను హాల్లోకి వచ్చేసరికి వేషం దుస్తులు బ్యాగులో సర్దుకొంటున్న హరిదాసు మామయ్య అన్యమనస్కంగా కనపడ్డాడు.

ఆ సంవత్సరం తరువాత, అతను మరో సంవత్సరం దసరా ఉత్సవాలకి వచ్చేడు గానీ హరికథ చెప్పలేదు. ఆ తరువాతి సంవత్సరం రాలేదు. హరిదాసు మామయ్య ఎందుకు రాలేదా? అని మావాళ్లు చర్చించుకోవడం విన్నా. ఆ తరువాతి ఏడాది శ్రీకాకుళంలో నేను బీయెస్సీ రెండో సంవత్సరం. అపుడపుడూ అరసవిల్లి దేవాలయంకి వెళ్లడం అలవాటుగా ఉండేది. నాదేం దైవభక్తి కాదు. కొబ్బరికాయలు, అరటిపండ్లు తీసుకెళ్లటం లాంటి పనులేం చేసేవాడ్ని కాదు. కోవెలకి వెళ్లి, ఓ సారి ప్రదక్షిణ చేసి కూర్చొని వస్తే బాగుండేది. ఆరోజు అరసవిల్లికి నా హెర్యూలిస్ గుర్రం మీద పెంటవారి వీధిలోంచి వెళుతున్నాను. తెల్లవారి ఆరుగంటలు కూడా ఇంకా అవలా!

అక్కడ ఓ షావు అరుగుమీద ఎవరో పడుకునున్నారు, రోడ్డు వేపు వీపు పెట్టుకుని. నా సైకిలు షాపుని సమీపించే చప్పుడికి అతను ఇటు తిరిగేడు.

ఎవరా అని పరికించా!

'హరిదాసు మామయ్య!'

నన్ను చూశాడు. ఒక్క ఉదుటున సైకిలు దిగాను.

'ఏమిటిక్కడున్నావు మామయ్యా? మీ ఇల్లు లేదా?' అనడిగేను.

'ప్రసాదూ! నువ్వా?ఈ సందులోనే మా అబ్బాయి ఇల్లు. ఇక్కడ బాగుంటుందని పడుకున్నా,' అన్నాడతను.

రెండు నిమిషాలు ఏవో మాటలయ్యాయి. నా మనసులో ఎన్నో ప్రశ్నలు 'ఏమిటి ఈయన పరిస్థితి' అని.

'నాకు షుగరొచ్చిందిరా ఈ మధ్యే'

మాటలు పూర్తయిన తరువాత, సరే వెళ్తాను అని బయల్దేరాను. సైకిలెక్కబోతున్న నన్ను ఆపి –

'ప్రసాదూ! ఓ రెండ్రూపాయలుంటే ఇస్తావా?' అన్నాడు.

అతని కళ్లలోకి చూసేను. ఎంత మథనపడుతూ ఆ మాటన్నాడో నాకు కనపడింది.

నా కళ్లల్లో నీళ్లు. జేబులో చెయ్యిపెట్టి, దాన్లో ఉన్న మొత్తమంతా తీసి ఆయన చేతిలో పెట్టి ఆ చెయ్యి మూసేసి –సైకిలెక్కి అరసవిల్లి వెళ్లిపోయేను. అంతకన్నా ముందుకు వెళ్లి ఆ దినాన అతనికి ఏమి చెయ్యలేకపోయిన నా అనుభవశూన్యతకి ఇప్పటికీ గిల్టీగా ఫీల్ అవుతున్నా. ★

వికెట్ల రాణి..శ్రీచరణి!

తెలుగుతేజం శ్రీచరణి చరిత్ర సృష్టించింది. మహిళా టీ-20 క్రికెట్లో ప్రపంచ నం.1 ర్యాంకుతో భారత క్రికెట్‌కే గర్వకారణంగా నిలిచింది. అరంగేట్రం చేసిన ఏడాదికాలంలోనే అగ్రస్థానంలో నిలిచిన భారత, తెలుగు రాష్ట్రాల తొలి బౌలర్‌గా రికార్డుల్లో చేరింది.



ప్రపంచ మహిళా క్రికెట్ పరిమిత ఓవర్ల (వన్డే, టీ-20) ఫార్మాట్లలో భారత మణికట్టు మాంత్రిక స్పిన్నర్ శ్రీచరణి జోరు కొనసాగుతోంది. గతేడాది జరిగిన ఐసీసీ మహిళా వన్డే ప్రపంచకప్‌లో భారత్‌ను తొలిసారిగా విజేతగా నిలపడంలో తనవంతు పాత్ర పోషించిన శ్రీచరణి 2026 ఐసీసీ మహిళా టీ-20 ప్రపంచకప్‌లోనూ అంచనాలకు మించి రాణిస్తూ ప్రపంచ అత్యుత్తమ ర్యాంకు బౌలర్‌గా నిలిచింది.

కడప నుంచి అంతర్జాతీయ క్రికెట్‌కు...

ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా యరమాలపల్లి గ్రామం నుంచి ఏడాది క్రితమే భారత క్రికెట్లోకి దూసుకొచ్చిన 21 సంవత్సరాల శ్రీచరణి ఆకాశమే హద్దుగా రాణిస్తూ ప్రపంచ అత్యుత్తమ బౌలర్‌గా గుర్తింపు తెచ్చుకొంది. ఎడమచేతి వాటం బౌలర్‌గా ప్రత్యర్థి జట్లను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

భారత మహిళా క్రికెట్లో ఎడమచేతి వాటం స్పిన్నర్లు అనగానే దిగ్గజ స్పిన్నర్లు దయానా ఎడుల్జీ, నీతూ డేవిడ్, స్నేహా రాణా మాత్రమే మనకు కనిపిస్తారు. అయితే.. గతేడాదే భారతజట్టులో చోటు సంపాదించిన శ్రీచరణి నిలకడగా రాణించడం ద్వారా 50 ఓవర్ల వన్డే ఫార్మాట్లోనే కాదు..20 ఓవర్ల ధూమ్ ధామ్ టీ-20 క్రికెట్లో సైతం భారత తురుపుముక్కగా మారింది.

మణికట్టుతో మాయచేస్తూ.. వైవిధ్యభరితమైన బంతులతో ప్రపంచ మేటి బ్యాటర్లను బోల్తా కొట్టిస్తూ జాదూ స్పిన్నర్‌గా నిలిచింది. భారత్ వేదికగా జరిగిన 2025 ఐసీసీ మహిళా వన్డే ప్రపంచకప్ ద్వారా తానేమిటో నిరూపించుకొని లీగ్ దశ నుంచి నాకౌట్ టైటిల్ పోరు వరకూ జరిగిన తొమ్మిదికి తొమ్మిది మ్యాచ్‌లూ ఆడి 14 వికెట్లు సాధించింది. 4.96 సగటుతో మొదటి నలుగురు అత్యుత్తమ బౌలర్లలో చోటు సంపాదించింది.

విశాఖ వేదికగా ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్ జట్టు ఆస్ట్రేలియాతో లీగ్ దశ పోరులో తన కోటా 10 ఓవర్లలో 41 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టింది. చివరకు భారత్ తొలిసారిగా ప్రపంచకప్ అందుకోడంలో తనవంతు పాత్ర పోషించింది.

రన్నర్ కాబోయి స్పిన్నర్‌గా ...

క్రికెట్ నేపథ్యం ఏమాత్రం లేని కుటుంబం నుంచి వచ్చిన శ్రీచరణి మూడోతరగతి చదువుతున్న సమయంలోనే ప్లాస్టిక్ బ్యాట్‌తో క్రికెట్ ఓనమాలు దిద్దుకొంది. వాస్తవానికి ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో ఓ రన్నర్‌గా దూసుకుపోవాల్సిన ఆమె తన మేనమామ ప్రేరణతో క్రికెట్ వైపు మొగ్గు చూపాల్సి వచ్చింది. ఫాస్ట్ బౌలర్‌గా క్రికెట్ సాధన మొదలు పెట్టి శిక్షకుల సూచనతో ఎడమచేతి వాటం స్పిన్నర్‌గా తన దిశను మార్చుకొంది. స్థానిక, దేశవాళీ క్రికెట్ పోటీలలో రాణిస్తూ ఐపీఎల్‌లో పోటీపడుతున్న ఢిల్లీజట్టులో చోటు సంపాదించింది. ఆ తర్వాత నుంచి వెనుదిరిగి చూసింది లేదు.

శ్రీచరణిలోని అపార ప్రతిభను ముందుగానే గుర్తించిన సెలెక్టర్లు భారత మహిళా టీ-20 జట్టులో చోటు కల్పించారు. ఇంగ్లండ్‌తో జరిగిన అరంగేట్రం సిరీస్‌లోనే 10 వికెట్లు పడగొట్టడంతో పాటు... 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డుకు ఎంపికై 'వారేవ్వా' అనిపించుకొంది. టీ-20 ఫార్మాట్లో రాణించడం ద్వారా భారత వన్డే ప్రపంచకప్ జట్టులో చోటు సంపాదించి బంగారు పతకం అందుకొంది.

టీ-20 ప్రపంచకప్‌లో రికార్డుల మోత...

ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ఆధ్వర్యంలో జరుగుతున్న 2026 ఐసీసీ టీ-20 ప్రపంచకప్‌లో శ్రీచరణి భారత ప్రధాన అస్త్రంగా మారింది. గ్రూపులీగ్ దశలో భాగంగా పాకిస్థాన్, నెదర్లాండ్స్, దక్షిణాఫ్రికా, బాంగ్లాదేశ్ జట్లతో జరిగిన మ్యాచ్‌ల్లో మొత్తం 12 వికెట్లు పడగొట్టి 753 పాయింట్లతో ప్రపంచ నం.1 ర్యాంక్ బౌలర్‌గా నిలిచింది. టీ-20 ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్‌గా సరికొత్త రికార్డు నెలకొల్పింది. 2020 ప్రపంచకప్‌లో పూనమ్ యాదవ్ సాధించిన 10 వికెట్ల అత్యుత్తమ రికార్డును తెరమరుగు చేసింది. ఐసీసీ మహిళా బౌలర్ ర్యాంకింగ్స్ చరిత్రలోనే ప్రపంచ నం.1 ర్యాంక్ సాధించిన భారత, తొలి తెలుగు బౌలర్‌గా చరిత్ర సృష్టించింది.

వన్డే ప్రపంచకప్‌తో శ్రీచరణికి నజరానాల వెల్లువ...

అంతర్జాతీయ క్రికెట్లో కొందరు జీవితకాలం శ్రమించినా దక్కని గుర్తింపు, అవార్డులు, రివార్డులు కేవలం ఏడాది కాలంలోనే శ్రీచరణికి దక్కాయి. కొండంత ప్రతిభకు గోరంత అదృష్టం జతకలిస్తే అద్భుతాలే జరుగుతాయనటానికి ఆమెను మించిన నిదర్శనం మరొకటి లేదు.

వన్డే ప్రపంచకప్ బంగారు పతకంతో శ్రీచరణి పైన కాసుల వర్షమే కురిసింది. వన్డే ప్రపంచకప్‌లో ఆడిన తొమ్మిదిమ్యాచ్‌లకు మ్యాచ్ ఫీజుగా 54 లక్షల రూపాయలతో పాటు బీసీసీఐ నుంచి కోటిన్నర రూపాయలు ప్రోత్సాహక నగదు బహుమతిగా అందుకొంది.

ఇక, ఆంధ్రప్రదేశ్‌కే గర్వకారణంగా నిలవడం ద్వారా రాష్ట్రప్రభుత్వం నుంచి రూ.2.50 కోట్లు, కడపలో 1000 గజాల ఇంటి స్థలం, గ్రూప్-1 ఉద్యోగాలను శ్రీచరణి అందుకోగలిగింది.

ఇటు వన్డేలు, అటు టీ-20 ఫార్మాట్లలో ఒకేతీరుగా రాణిస్తున్న శ్రీచరణి సాంప్రదాయ టెస్టు క్రికెట్లో సైతం సత్తా చాటుకోగలిగితే వచ్చే పుష్కర కాలంపాటు భారత క్రికెట్‌కు సేవలు అందించ గలదనడంలో ఏమాత్రం సందేహం లేదు.

కృష్ణారావు చాప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

శ్రీమాత బాలికల ఆవాసానికి భూమి పూజ

తిరుపతి : శ్రీమాత బాలికల ఆవాసం ఉద్దేశ్యం అనేక మంది శ్రీ మాతలుగా (అరవింద మహర్షి శిష్యురాలు శ్రీమాత), శక్తి స్వరూపిణిగా తయారుచేసి, సమాజంలో మంచి మార్పు తీసుకురావడమేనని ఆర్ఎస్ఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రాంత ప్రచారక్ ఆదిత్య కోరారు. జులై 29 న తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం తొండవాడ పిచ్చినాయుడు పల్లి గ్రామంలో ప్రజ్ఞ ట్రస్ట్ – మహాయోగిని రాజ్యలక్ష్మి దేవి, రంగప్ప స్మారక భవనం భూమి పూజ, శంఖు స్థాపన కార్యక్రమం సందర్భంగా ఆదిత్య పాల్గొని ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో స్థలదాత, భవననిర్మాణ దాత వి.నటరాజన్ ప్రసాద్, శ్రీదేవి, వారి కుమారుడు చి.వ్రజేష్ కుటుంబసభ్యుల చేతుల మీదుగా భూమి పూజ జరిగినది.

ఈ కార్యక్రమానికి డా॥ మార్తా భాస్కర్ రావు అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రాంత కార్యవాహ వేణుగోపాల్‌నాయుడు, తిరుపతి విభాగ్ సంఘచాలక్ త్యాగరాజన్ రవీంద్రన్, మహేష్, గణపతిసింగ్, మల్లికార్జున్ , వెంకటచలం, ప్రజ్ఞ ట్రస్ట్ కార్యదర్శి దయాకర్‌రెడ్డి, ఆవాసం కమిటీ సభ్యులతోపాటు 400 మంది పాల్గొన్నారు

సేవాభారతికి విరాళంగా భవనం

కాకినాడ : సేవాభారతి నిర్వహిస్తున్న ఆవాసం విద్యార్థులు చక్కటి క్రమశిక్షణ కలిగి, విలువలతో కూడిన విద్యను అభ్యసిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల వీరాంజనేయ స్వామి కొనియాడారు. సేవాభారతి, కాకినాడ ఆధ్వర్యంలో జూన్ 26న జరిగిన నచికేత విద్యార్థుల ఆవాస భవన గృహప్రవేశంలో పూజాది కార్యక్రమాలలో వారు పాల్గొని ప్రసంగించారు.

ఆర్ఎస్ఎస్ క్షేత్ర సేవా ప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్ ప్రసంగిస్తూ భారతదేశంలో సుమారు మూడు కోట్లమంది అనాథలు ఉన్నారని, సేవాభారతి సంస్థ వారిని గుర్తించి దేశంలో వివిధ ప్రాంతాలలో ఆవాసాలు నిర్వహిస్తున్నారని అన్నారు.

40మంది పేద విద్యార్థులు ఉంటున్న ఈ నచికేత ఆవాసాన్ని పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు వాస్తవ్యులు, విశ్రాంత అధ్యాపకులు కొంపెల్ల లక్ష్మీ రామకృష్ణమూర్తి, వీరి కుమార్తె మెహర్ కాంతి సందర్శించి సేవాభారతివారి సేవలకు ప్రభా వితులై, రమణయ్యపేట–ఎఫ్‌సిఐ కాలనీలో వారికి గల మూడు అంతస్తుల భవనాన్ని ఆవాసం నిర్వహించుకొనేందుకు విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి సూర్య నారాయణ రాజు, సేవాభారతి కాకినాడ అధ్యక్షులు అట్లూరి శివ రామకృష్ణయ్య, ఆర్ఎస్ఎస్,సేవాభారతి కార్య కర్తలు, ఎమ్ఎల్ఏలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలు కొంపెల్ల లక్ష్మీ రామకృష్ణమూర్తి, కుమార్తె మెహర్ కాంతిని కాకినాడ సేవాభారతి వారు సన్మానించారు.

శివపథానికి జ్యోతిర్లింగాలు

అనంతమైన దైవత్వానికి, వెలుగుకు ప్రతీక అయిన లింగ రూపంలో పరమశివుడిని కొలవడం అనాదిగా వస్తున్న ఆచారం. లీయతే గమ్యతే ఇతి శివలింగః అంటూ నిరాకారమైన ఆ భగవంతుడిని అభివర్ణిస్తుంటారు. దేనిలోనైతే జగత్తు లీనమవుతుందో, దేని ద్వారా పరమాత్మను చేరుకుంటామో అదే శివలింగం అని ఆ వాక్యానికి అర్థం.

పన్నెండు జ్యోతిర్లింగాలు ఆధ్యాత్మిక శక్తికి కేంద్రాలు. అవి –

1. సోమనాథుడు – ప్రభాస్ పటాన్, గుజరాత్ మొదటి జ్యోతిర్లింగం. చంద్రుడు (సోముడు) తన శాప విముక్తి కోసం ఇక్కడ శివుడిని ఆరాధించి నట్లు పురాణాలు చెబుతాయి.

2. మల్లికార్జునుడు – ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం. ఇది జ్యోతిర్లింగంతో పాటు అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన భ్రమరాంబికా దేవి పీఠం ఇక్కడ కొలువై ఉంది. దీనిని "దక్షిణ కైలాసం" అని అంటారు.

3. మహాకాళేశ్వరుడు– ఉజ్జయిని, ఇది, దక్షిణాభిముఖంగా ఉన్న ఏకైక జ్యోతిర్లింగం. ఇక్కడ జరిగే భస్మ హారతి ప్రపంచ ప్రసిద్ధి గాంచినది.

4. ఓంకారేశ్వరుడు– మాంధాత, మధ్య ప్రదేశ్‌లోని నర్మదా నది తీరంలో ఉన్న ఈ ద్వీపం సహజంగానే 'ఓం' ఆకారంలో ఉండటం ఇక్కడి విశిష్టత.

5. వైద్యనాథుడు –దేవఘర్, జార్ఖండ్, రావణాసురుడు లంకకు తీసుకువెళ్లాలని ప్రయత్నించిన లింగం ఇది. శివుడు ఇక్కడ వైద్యుని రూపంలో రోగాలను నయం చేస్తాడని నమ్మకం.

6. భీమశంకరుడు–పూణే సమీపంలో, మహారాష్ట్ర సహ్యాద్రి పర్వత శ్రేణులలో ఉన్న ఈ క్షేత్రం భీమా నదికి జన్మస్థలం. శివుడు త్రిపురాసురుడిని సంహరించిన ప్రదేశం.

7. రామేశ్వరుడు–రామేశ్వరం. శ్రీరాముడు రావణ సంహారం తర్వాత పాప ప్రక్షాళన కోసం స్వయంగా ఈ లింగాన్ని ప్రతిష్ఠించి పూజించాడని చరిత్ర.

ఆదూరి హైమవతీ శ్రీనివాసరావు
పుట్టపర్తి

8. నాగేశ్వరుడు– గుజరాత్‌లోని ద్వారక సమీపంలో ఈ ఆలయం స్థితమై ఉంది. శివుడు 'నాగరాజు'గా పూజలందుకునే క్షేత్రం. పాము కాటు, గ్రహదోషాల నుండి విముక్తి కోసం ఇక్కడ పూజిస్తారు.

9. విశ్వనాథుడు– అత్యంత పవిత్రమైన కాశీ క్షేత్రంలో గంగానది ఒడ్డున కొలువై ఉన్నాడు. ఇక్కడ మరణిస్తే నేరుగా మోక్షం లభిస్తుందని నమ్మకం.

10. త్రయంబకేశ్వరుడు – గోదావరి నది ఉద్భవించిన త్రయంబకంలో వెలసిన లింగం. ఇక్కడ లింగంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కలిసి ఉండటం విశేషం.

11. కేదారేశ్వరుడు– హిమాలయాలలో మంచు కొండల మధ్య ఉన్న క్షేత్రం కేదార్‌నాథ్. పాండవులు తమ పాప పరిహారం కోసం ఇక్కడ శివుడిని దర్శించుకున్నారని అంటారు.

12. ఘృష్ణేశ్వరుడు–ఎల్లోరా. ఇది చివరి జ్యోతిర్లింగం. ఘుష్మ అచంచలమైన భక్తికి మెచ్చి శివుడు తన భక్తురాలి కోసం ఇక్కడ వెలిశాడని పురాణ గాథ.

ఆమె కథ ప్రతి ఒక్కరి మనసునూ తాకుతుంది.

పురాణాల ప్రకారం, దేవగిరి పర్వతం దగ్గర సుధర్ముడు అనే బ్రాహ్మణుడు నివసించేవాడు.అతని భార్య పేరు సుదేహ. వారికి సంతానం కలగలేదు. సంతానం కోసం సుదేహ తన చెల్లెలైన ఘుష్మను తన భర్తకిచ్చి వివాహం చేయమని కోరుతుంది.

ఘుష్మ గొప్ప శివభక్తురాలు. ఆమె ప్రతిరోజూ 101 పార్థివ లింగాలను అంటే మట్టి లింగాలు తయారుచేసి పూజించి, దగ్గరలోని చెరువులో నిమజ్జనం చేసేది. శివుని అనుగ్రహంతో ఆమెకు ఒక అందమైన కుమారుడు జన్మిస్తాడు.

సమయం గడిచేకొద్దీ, సుదేహ మనసులో అసూయ మొదలైంది. తన చెల్లెలికి కలిగిన కుమారుడు, ఆమె పొందుతున్న గౌరవం సుదేహ సహించలేక పోతుంది. ఒకరోజు రాత్రి, ఘుష్మ కుమారుడు నిద్రిస్తున్న సమయంలో సుదేహ అతడిని చంపి, ఘుష్మ ప్రతిరోజూ లింగాలను నిమజ్జనం చేసే చెరువులో పడేస్తుంది.

మరుసటి రోజు ఉదయం తన కుమారుడు చనిపోయాడని తెలిసినా, ఘుష్మ ఏమాత్రం చలించలేదు. "నన్ను రక్షించేవాడు, శిక్షించేవాడు ఆ పరమశివుడే" అని నమ్మి, ఎప్పటిలాగే నిత్యకృత్యమైన శివపూజను ప్రారంభించింది. పార్థివ లింగాలను పూజించి, వాటిని నిమజ్జనం చేయడానికి చెరువు దగ్గరకు వెళ్లింది.

ఘుష్మ లింగాలను నిమజ్జనం చేసి వెనుతిరుగు



తుండగా, ఆమె కుమారుడు చెరువులో నుండి నడుచుకుంటూ బయటకువస్తాడు. అప్పుడే పరమ శివుడు ప్రత్యక్షమై, సుదేహ చేసిన ద్రోహాన్ని వివరించి, ఆమెను శిక్షిస్తానని అంటాడు. కానీ దయార్ద్ర హృదయురాలైన ఘుష్మ తన అక్కను క్షమించమని వేడుకుంటుంది.

ఘుష్మ భక్తికి మెచ్చిన శివుడు ఏవైనా వరం కోరుకోమంటే.. "స్వామీ! లోక కళ్యాణం కోసం మీరు ఇక్కడే జ్యోతిర్లింగ రూపంలో కొలువై ఉండాలి" అని కోరుకుంటుంది. ఘుష్మ పేరు మీద వెలసిన లింగం కనుక దీనికి ఘృష్ణేశ్వరుడు అనే పేరు వచ్చింది.

ఈ క్షేత్రాన్ని దర్శించుకుంటే సంతానలేమి సమస్యలు తొలగిపోతాయని, కుటుంబంలో కలహాలు నశించి శాంతి చేకూరుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.ఘుష్మ కథ మనకు నిశ్చలమైన భక్తి, క్షమాగుణం నేర్పుతుంది.

పన్నెండు జ్యోతిర్లింగాలు కేవలం భౌగోళిక ప్రాంతాలు మాత్రమే కాదు, అవి మానవ శరీరంలోని వివిధ నాడులు, చక్రాల శుద్ధికి సంకేతాలు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమలను ఆచరిస్తూ భగవంతుడిని స్మరిస్తే, మన జీవితమే ఒక జ్యోతిర్లింగంగా మారుతుంది. ★

గురుభక్తికి నిలువెత్తు రూపం

కథ

ధౌమ్య మహర్షి ఆశ్రమంలో అరుణి అనే శిష్యుడు ఉండేవాడు. అతడు ఎంతో వినయసంపన్నుడు. గురువు చెప్పిన పనిని చిన్నదైనా, పెద్దదైనా చాలా శ్రద్ధతో చేసేవాడు. ఒకరోజు భారీ వర్షం నిరంతరంగా కురవసాగింది. ఆశ్రమ సమీపంలోని చిన్న నది కట్ట తెగి పంట పొలాలు, గ్రామాలు మునిగిపోయే ప్రమాదం ఉంది. ప్రాణనష్టం కూడా జరగవచ్చు. సూర్యాస్తమయం ముందుగానే అరుణిని పిలిచి, వెళ్లి నదికి గండిపడిందా లేదా చూసి రమ్మంటాడు.

అరుణి వెళ్లి చూసేసరికి నది కట్ట తెగి నీరు పొలాలవైపుకు వస్తుంటుంది. ఆశ్రమం వెళ్లి చెప్పి వచ్చే లోపల ప్రమాదం ఎక్కువ కావచ్చు అని గమనించాడు. వెంటనే తానే స్వయంగా మట్టిని వేసి గట్టును మూసే ప్రయత్నం చేశాడు. కర్రలు, రాళ్లు పెట్టి ఆపే ప్రయత్నం చేశాడు. కానీ నీటివేగం ఎక్కువగా ఉండటంతో ఏదీ నిలబడలేదు. అరుణి కాసేపు ఆలోచించాడు. "గురువు చెప్పిన పని పూర్తికాకుండా నేను ఎలా తిరిగి వెళ్లగలను?" అనుకున్నాడు. చివరికి అతను తన శరీరాన్నే ఆ గట్టుకు అడ్డుగా పెట్టి నీరు బయటకు పోకుండా మట్టిలో పడుకున్నాడు.

ఒకవైపు ఎముకలు కొరికే చలి, మరోవైపు జోరు వర్షం. రాత్రంతా గడిచిపోయింది. అరుణి ఆశ్రమానికి రాలేదు. తెల్లవారుజామున ధౌమ్యమహర్షి ఆందోళనతో శిష్యులతో కలిసి నదివైపు పరుగులు దీస్తూ "అరుణీ.. ఎక్కడ అంటూ?" బిగ్గరగా పిలువసాగాడు.

చాలా దూరం నుంచి బలహీనస్వరంతో "గురుదేవా, నీరు బయటకు పోకుండా నేను నీటి ప్రవాహానికి అడ్డుగా పడుకున్నాను, లేస్తే ప్రవాహం పెరుగుతుంది" అన్న అరుణి మాటలు వినపడ్డాయి. అరుణిని సమీపించిన గురువు కళ్లలో కరుణ నిండింది. "నాయనా, లేచి రా. నీవు చూపిన భక్తితో నేను గెలిచినట్లయింది" అన్నాడు.

అరుణి లేచాడు. గురువు అతన్ని ఆశీర్వదిస్తూ "ఇప్పటి నుంచి నీవు ఉద్దాలకుడి పేరుతో ప్రసిద్ధి చెందుతావు. నా మాటను ప్రశ్నించకుండా పాటించావు గనుక లోకంలో మహాశ్రేయస్సును పొందుతావు. ధర్మశాస్త్రాలు నీలో వెలుగుతాయి" అన్నాడు. **(ఇది మహాభారతం నుండి)**

మంచిమాట

నీ గమ్యస్థానం ఎంత ఎత్తులో ఉన్నప్పటికీ దానిని చేరుకునే మార్గం మాత్రం నీ కాళ్ల కింద నుండే మొదలవుతుంది.

మెదడుకు మేత

పళ్లుంటాయి కానీ..
తినలేను. నేనెవరు?

సమాధానం : ణుఙుజ

పద్యం

ఆకొన్న కూడె యమృతము
తాకొందక నిచ్చువాడె దాత ధరిత్రిన్
సోకోర్చువాడె మనుజుడు
తేకువ గలవాడె వంశతిలకుడు సుమతీ

భావం : ఆకలితో ఉన్నవారికి అన్నం అమృతంతో సమానం. ఎదుటివాడు అడిగే వరకు ఎదురుచూడ కుండా, అతని అవసరాన్ని గుర్తించి సహాయం చేయగలవాడే నిజమైన దాత. ఇతరుల బాధను తన బాధగా భావించి ముందుకు వచ్చే మనిషే కుటుంబానికి, సమాజానికి గౌరవం తెస్తాడు.

శ్లోకం

దాతృత్వం ప్రియ వక్తృత్వం
ధీరత్వమ్ ఉచితజ్ఞతా
అభ్యాసనే న లభ్యన్తే
చత్వారః సహజా గుణాః

భావం : దానగుణం, ప్రియంగా మాట్లాడడం, ధైర్యం, ఉచితానుచితాలు వివేకం పుట్టుకతో వచ్చే సహజ లక్షణాలు. అవి అభ్యాసం వల్ల వంటబట్టవు.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

బుడాపెస్ట్	స్విట్జర్లాండ్
బెర్న్	కొలంబియా
బెర్లిన్	హంగరి
బెల్‌గ్రేడ్	జర్మనీ
బెల్మోపాన్	సెర్బియా
బోగోటా	బెలిజ్

ఘుఢంఱఞ–ఘ్ళఘ్ళఢ ;ళ్తఢఢ–క్తఘ్ళోఢ ;ఘుర్రెఢ–ళ్తుళ్తోఢ ;స్ఫోఢ–క్తర్రెఢ ;ళ్తంఘఘ్ళోస్ఫ –ర్తెఢ ;ర్ఱఱంఘ–స్ఫోఢఱఞఢ : ణుఙుజఘ్ళుఘ్ళ

నిర్వహణ : నయనశ్రీ

శాస్త్రవేత్తలు

జేమ్స్ క్లర్క్ మ్యాక్స్‌వెల్



జేమ్స్ క్లర్క్ మ్యాక్స్‌వెల్ స్కాట్లాండ్‌కు చెందిన ఒక గొప్ప భౌతిక శాస్త్రవేత్త. విద్యుత్, అయస్కాంతం, కాంతి.. ఈ మూడు వేర్వేరు విషయాలు కావని, ఇవన్నీ ఒకే శక్తి రూపాలకు సంబంధించినవని ప్రపంచానికి చూపించిన ఘనత ఆయనది. అందుకే మ్యాక్స్‌వెల్‌ను "ఎలక్ట్రోమాగ్నెటిక్ థియరీ పితామహుడు" అని పిలుస్తారు. అప్పటివరకు విద్యుత్ ఒకటి, అయస్కాంతం ఒకటి, కాంతి మరొకటి అని భావించేవారు. కానీ మ్యాక్స్‌వెల్ తన ప్రసిద్ధ సమీకరణాల ద్వారా విద్యుత్ క్షేత్రం, అయస్కాంత క్షేత్రం కలిసి తరంగాల రూపంలో ప్రయాణిస్తాయని నిరూపించారు. ఆ తరంగాల వేగం కాంతి వేగంతో సమానంగా ఉండటంతో, కాంతి కూడా ఒక ఎలక్ట్రోమాగ్నెటిక్ వేవ్ అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఆలోచన తర్వాతి కాలంలో రేడియో, టెలివిజన్, మొబైల్ కమ్యూనికేషన్, వైర్‌లెస్ టెక్నాలజీ వంటి ఎన్నో ఆవిష్కరణలకు పునాది అయింది.

జనరల్ నాలెడ్జ్

1. ప్రపంచంలోనే అతిపెద్ద ఇతిహాసం ఏది?
2. మనదేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న గిరిజన తెగ?
3. 'వైట్ కోల్' అని దేనిని పిలుస్తారు?

సమాధానాలు : 1. మహాభారతం (74 శ్లోకాలు), 2. గోండులు; 1.8 శాతం మంది), 3. బొగ్గు.

భక్తాగ్రేసరులు

నారాయణ గురు

ప్రపంచంలోని ప్రజలందరికి ఒకే కులం, ఒకే మతం, ఒకే దైవం. భగవదారాధనకు నిర్మల మనసు తప్ప, జపతపాలతో నిమిత్తం లేదు' అన్నది నారాయణ గురు సందేశం. కేరళలోని ఒక కుగ్రామంలో మదన్, కుటి దంపతులకు జన్మించిన ఆయన బాల్యం నుంచే తెలివైనవాడు. జీవితంలో ఎదురైన కష్టాలను నిబ్బరంగా అధిగమించాడు.తన పదిహేనవ ఏట తల్లి మరణించడంతో తండ్రికి కూడా చెప్పకుండా ఇల్లు విడిచి, సమీప గ్రామానికి చేరాడు. అక్కడ రామన్ పిళ్లై అనే ఉపాధ్యాయుడిని ఆశ్రయించాడు. ఆయన శిష్యరికంలో విద్యాబుద్ధులు నేర్చి అనతి కాలంలోనే 'నానూ ఆసన్'గా ప్రసిద్ధుడయ్యాడు. భార్య మరణానంతరం విరక్తితో దేశసంచారిగా మారారు. ఇతరులకు మేలు చేయడంలోనే నిజమైన ఆనందమని గ్రహించాడు.తమ ప్రాంతంలో సర్వసాధారణమైన అంటరానితనం, జంతుబలి ఆయనను కలచివేశాయి. వాటిని నివారించే ప్రయత్నంలో ప్రజలకు జీవిత విలువలను బోధించారు. ప్రజలలో మూఢ నమ్మకాల నిర్మూలనకు కృషి చేశారు. భేదభావాలు లేని సమాజ నిర్మాణం ఆయన ఆశయం. మత మార్పిడులను నిరసించారు. అన్ని మతాల సత్యం, ధర్మం ఒకటే అయినప్పుడు మతాలు ఎందుకు మారాలి? అన్నది ఆయన ప్రశ్న. మాతృభాష మలయాళంలోనూ, సంస్కృతంలోనూ అనేక రచనలు చేశారు.



వారఫలాలు

06-12 జూలై, 2026

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

ఒక వర్తమానం మీలో కొత్త ఆశలు నింపుతుంది. దేవాలయాలు సందర్శిస్తారు. అందరిలోనూ మీ పట్ల గౌరవం పెరుగుతుంది. వ్యాపారులకు పెట్టుబడులు అనూహ్యంగా దక్కుతాయి. ఉద్యోగులకు విధుల్లో గందరగోళం తొలగుతుంది. పారిశ్రామిక వేత్తలు, కళాకారులకు శుభవార్తలు అందుతాయి. క్రీడాకారులు, పరిశోధకులకు విజయాలు వరిస్తాయి. 6,7 తేదీల్లో అనుకోని ఖర్చులు. స్నేహితులతో విభేదాలు. హనుమాన్ చాలీసా పఠించండి..

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

వాహన, గృహం కొనుగోలు ప్రయత్నాలు సఫలమవుతాయి. వ్యాపారులకు తగినంత పెట్టుబడులు సమకూరి లాభాలు సైతం అందుతాయి. ఉద్యోగులకు బాధ్యతల భారం నుంచి కొంత విముక్తి. పారిశ్రామిక, రాజకీయవర్గాలకు కలసివస్తుంది. రచయితలు, క్రీడాకారులు లక్ష్యసాధనలో ముందడుగు వేస్తారు. 11,12 తేదీల్లో స్నేహితులతో తగాదాలు. స్వల్ప శారీరక రుగ్మతలు. ఆకస్మిక ప్రయాణాలు శివాష్టకం పఠించండి.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

వాహనయోగం. స్థిరాస్తుల విషయంలో వివాదాలు తీరతాయి. ఇంతకాలం పడిన కష్టం ఫలిస్తుంది. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు పనిభారం కొంత తగ్గవచ్చు. రాజకీయ, పారిశ్రామికవర్గాలకు ఇబ్బందులు తొలగుతాయి. రచయితలు, పరిశోధకులకు ముఖ్య సమాచారం. 9,10 తేదీల్లో స్వల్ప శారీరక రుగ్మతలు. కుటుంబసభ్యులతో విభేదాలు. రామరక్షాస్తోత్రాలు పఠించండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

విద్యార్థులకు అవకాశాలు అనుకోకుండా దక్కుతాయి. వాహనాలు, ఇళ్లు కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారులకు లాభసాటిగా ఉంటుంది. ఉద్యోగులకు అనుకున్న హోదాలు రాగలవు. రాజకీయవర్గాలకు కొత్తపదవులు దక్కవచ్చు. కళాకారులు, క్రీడాకారులకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 7,8 తేదీల్లో సన్నిహితులతో తగాదాలు. శారీరక రుగ్మతలు. కనకధారాస్తోత్రాలు పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

మీ సత్తా, శక్తిసామర్థ్యాలను అందరూ గుర్తిస్తారు. సోదరులతో సఖ్యత నెలకొంటుంది. ఇంటి నిర్మాణ యత్నాలు ముమ్మరం చేస్తారు. వ్యాపారులు లాభాలు గడిస్తారు. ఉద్యోగులు పనిభారం నుంచి బయట పడతారు. కళారంగం వారికి మరింత ఊహించని అవకాశాలు. రచయితలు, క్రీడాకారులకు కొత్త ఆశలు. 6,7 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. శ్రీకృష్ణాష్టకం పఠించండి.

కన్య: ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

సేవాకార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. భాగస్వామ్య వ్యాపారాలలో వివాదాలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగులకు కోరుకున్న మార్పులు ఉండవచ్చు. కళాకారులు, రాజకీయవేత్తలకు చికాకులు, సమస్యలు తొలగుతాయి. పరిశోధకులు, క్రీడాకారులకు అంచనాలు నిజమవుతాయి. 8,9 తేదీల్లో అనుకోని ఖర్చులు. శారీరక రుగ్మతలు. శివ పంచాక్షరి పఠించండి.

తుల: చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

వాహనాలు, భూములు కొనుగోలు చేస్తారు. కొన్ని సమస్యల నుంచి బయటపడతారు. దేవాలయాలు సందర్శిస్తారు. వ్యాపారస్తులకు మరింతగా లాభాలు అందుతాయి. ఉద్యోగులకు అనుకూల మార్పులు ఉండవచ్చు. రాజకీయవేత్తలకు శుభవార్తమానాలు. రచయితలు, క్రీడాకారులకు కొత్త ఆశలు. 10,11 తేదీల్లో సన్నిహితులతో తగాదాలు. శారీరక రుగ్మతలు. ఆంజనేయ దండకం పఠించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారులు ఆశించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు విధుల్లో మనశ్శాంతి చేకూరుతుంది. కాంట్రాక్టులు ఎట్టకేలకు లభిస్తాయి.. పారిశ్రామిక, రాజకీయవేత్తల కృషి కొంత ఫలించే అవకాశం. పరిశోధకులు, రచయితల కృషి కొంతమేర ఫలిస్తుంది. 11,12 తేదీల్లో వృథా ఖర్చులు. బాధ్యతలు పెరుగుతాయి. అన్నపూర్ణాష్టకం పఠించండి..

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేసి సత్తా చాటుకుంటారు. స్నేహితులతో విభేదాలు తొలగి సఖ్యత ఏర్పడుతుంది. ఉద్యోగులకు కొత్త అవకాశాలు లభిస్తాయి. కళాకారులు, పారిశ్రామికవేత్తల ప్రయత్నాలు విజయవంతంగా సాగుతాయి. రచయితలు, క్రీడాకారులు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. 7,8 తేదీల్లో శ్రమాధిక్యం. శారీరక రుగ్మతలు. గణేశాష్టకం పఠించండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

స్థిరాస్తి వివాదాలు తీరి ఒడ్డున పడతారు. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలు సఫలమవుతాయి, అనుకున్నంత లాభాలు పొందుతారు. ఉద్యోగులకు ఒత్తిడులు, సమస్యలు తొలగుతాయి. రాజకీయ, పారిశ్రామికవర్గాలకు శుభవార్తలు. క్రీడాకారులు, పరిశోధకుల యత్నాలలో పురోగతి కనిపిస్తుంది. 7,8 తేదీల్లో శారీరక రుగ్మతలు. దూరప్రయాణాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ముఖ్యమైన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురవుతాయి. గృహనిర్మాణయత్నాలు మందగిస్తాయి. కుటుంబసభ్యులు, స్నేహితుల నుంచి ఒత్తిడులు అధికమవుతాయి. వ్యాపారులకు చికాకులు తప్పవు. ఉద్యోగులకు అదనపు పనిభారం. పారిశ్రామిక, రాజకీయవర్గాలకు ఒడి దుడుకులు ఎదురు కావచ్చు. 8,9 తేదీల్లో ధనలాభం. శుభ వార్తలు. స్థిరాస్తి వృద్ధి. లక్ష్మీనృసింహస్తోత్రాలు పఠించండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

కాంట్రాక్టులు ఎట్టకేలకు దక్కే సూచనలు. గృహనిర్మాణ యత్నాలలో అవాంతరాలు తొలగుతాయి. సమాజంలో గౌరవమర్యాదలు పొందుతారు. వ్యాపారులు కొంతమేర లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు విధుల్లో బాధ్యతలు మరింత పెరుగుతాయి. కళాకారులు, రాజకీయవేత్తలకు కష్టానికి ఫలితం కనిపిస్తుంది. క్రీడాకారులు, పరిశోధకులకు కాస్త ఊరట. 11,12 తేదీల్లో వృథా ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. ఆదిత్య హృదయం పఠించండి.

పదరసం-571



ఆధారాలు

అడ్డం

1. బహుమతి (3)
3. ఆవు అరుపు (2)
5. కూతురు (3)
8. ఓర్పు (2)
10. అతి నెమ్మదిగా పాకే జీవి (2)
12. అత్త భర్త (2)
13. అమ్మతో పాటే (2)
14. పండుకు ముందు దశ..అటు నుంచి (2)
16. కాలం కాని కాలం (3)
18. యెగాసన విశేషం (4)
20. శ్రుతితో పాటే, నాశం (2)
21. ఒక అప్సరస, కదళీ (2)
22. బడితో ఆదాయం (2)
25. మంగళం (2)
26. ఎండిన కొబ్బరికాయ (3)
27. నేత్రం (2)
28. గుంపు, సమూహం (2)
29. వృశ్చికం (2)
30. మహిళ (3)
32. రుషి, కొన (2)
34. దక్షిణ భాగం (2)
38. కారణం, వంక (2)
39. భూమి (2)
40. ఇది సగం బలమట (3)
41. పోపుల పొట్టెలో ఓ ద్రవ్యం (2)
42. సంపద (3)

నిలువు

1. 'విశ్వదాత' ఇంటి పేరు (5)
2. శత్రుత్వం (2)
4. పెద్ద కుండ (2)
6. దేశ ఉత్తర సరిహద్దు పర్వతం (4)
7. చీకటి, అజ్ఞానం (3)
9. దుర్యోధనుడు తికమక పడిన ప్రాసాదం (4)
11. అడ్డం 12 భార్య.. కింద నుంచి (2)
15. కాబట్టి, కనుక (2)
17. ఆదిశంకరుల జన్మస్థలి (3)
18. మొదలు, ప్రారంభం (3)
19. శ్రీకృష్ణుడు (3)
23. దీనితో పూజంటే కొట్టడం (3)
24. పానుగంటి వ్యాసాల శీర్షిక (2)
25. చిలుక (3)
26. విలాసం...ఎటు చదివినా ఒకటే (3)
27. బండి ఇరుసు సూదిమొన (2)
31. అప్పు, బాకీ (2)
33. అరవై సెకన్లు (3)
35. నాటకంలో ఒక ప్రక్రియ (3)
36. స్నేహం (3)
37. పౌరుషానికి సంకేతమట (2)

పదరసం - 570 సమాధానాలు

1 బా	స		3 కో	వె	ల		5 డ	జ	6 ను
7 వ	రి		8 నే	త		9 మ	బ్బు		వ్వు
మ		10 కు	రు	లు		ను		11 మే	లు
12 ర	క్క	సు	లు		13 తా	వు		ను	
ది		మా		14 కా	డు		15 న	లు	16 వ
	17 అ	లు	18 సు			19 పా	డి		ల
20 ని	ప్పు		21 భ	వ	22 నం		23 రే	ఖ	లు
దా		24 ని	ద్ర		25 దు	26 బా	యి		డు
27 న	28 జ	రు		29 న	లు	డు		30 ర	
31 ము	య	డు		ది		32 గ	వా	క్ష	ము

ప్రథమార్ధంలో పరేషాన్!

ఈ యేడాది అప్పుడే ఆరు నెలలు పూర్తయ్యాయి. ఇప్పటి వరకూ అదరహో అనిపించిన సినిమాలను వేళ్లపై లెక్కపెట్టొచ్చు. ప్రథమార్ధం నిరాశ పర్చినా... ద్వితీయార్ధం బాగుంటుందనే ఆశతో సినీ జనం ముందడుగు వేస్తున్నారు. ఇంతకూ 2026 ఫస్ట్ హాఫ్ ఎలా సాగిందో తెలుసుకుందాం.

ఈ యేడాది ఇప్పటి దాకా సినీ ఫ్యాన్స్‌ను థియేటర్స్‌కు పరుగులు తీసేలా చేసిన చిత్రాలు చాలా తక్కువగా వచ్చాయనే చెప్పాలి. గడచిన ఆరు నెలల్లో సుమారు 153 సినిమాలు విడుదల కాగా అందులో 43 అనువాద చిత్రాలు. వాటిలో సూపర్ డూపర్ హిట్‌గా 'మన శంకర వరప్రసాద్ గారు', సూపర్ హిట్‌గా 'అనగనగా ఒక రాజు' చిత్రాలను లెక్కించొచ్చు. ఈ రెండు చిత్రాలు సంక్రాంతి సీజన్‌లో వచ్చినవే కావడం గమనార్హం. అదే సమయంలో వచ్చిన 'నారీ నారీ నడుమ మురారి' సైతం సక్సెస్ రూటులో సాగింది. ఆ తరువాత మే వరకూ ఒక్కటంటే ఒక్క బంపర్ హిట్ పలకరించలేదు. జూన్ మొదట్లోనే 'పెద్ది' ఓపెనింగ్స్‌తో దడదడ లాడించేసింది. తరువాత 'మా ఇంటి బంగారం' విజయ పథంలో దూసుకుపోతోంది. ఈ సినిమాలను మినహాయిస్తే తీసినవారికి, ఆడించిన వారికి లాభాలు చేకూర్చినవేవీ కనిపించలేదు. అంటే ఈ ఆరు నెలల్లో మన తెలుగు సినిమా సక్సెస్ రేటు ఐదు శాతం లోపే!

జనవరిలో 26 చిత్రాలు వెలుగు చూశాయి. అప్పుడే ఓ మూడు సినిమాలు మురిపించాయి. జనవరి 1న అనువాద చిత్రాలతో కలిపి 12 చిత్రాలు విడుదలైనా ఒక్కటి కూడా విజయపథంలో సాగలేదు. సంక్రాంతి సీజన్‌లో వచ్చిన 'ది రాజా సాబ్', 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' పరాజయం పొందాయి. అలానే ఆ నెలాఖరులో వచ్చిన 'ఓం శాంతి శాంతి శాంతిః, జమానా, ధృతరాష్ట్రుడు, త్రిముఖ, జగన్నాథ్' సినిమాలేవీ జనాలను మెప్పించలేదు. ఆ నెలలో వచ్చిన నాలుగు అనువాద చిత్రాలూ పరాజయం పాలయ్యాయి. ఫిబ్రవరిలో వచ్చిన 29 సినిమాల్లో ఏ ఒక్కటీ ఆకట్టుకోలేక పోయింది. డ్రగ్స్ నేపథ్యంలో వచ్చిన 'యుఫోరియా', వినోదాత్మకంగా తెరకెక్కిన 'శ్రీ చిదంబరంగారు', యూత్‌ను టార్గెట్ చేసి తెరకెక్కిన 'కపుల్ ఫ్రెండ్లీ', అర్జున్ 'సీతాపయనం', విశ్వక్ సేన్ 'ఫంకీ', శ్రీవిష్ణు 'విష్ణు విన్యాసం' సినిమాలు ఓ మాదిరిగా అయినా ఆడతాయని మేకర్స్ భావించారు. కానీ ఇవన్నీ బాక్సాఫీస్ దగ్గర పరాజయం పాలయ్యాయి. వీటిలో 'కపుల్ ఫ్రెండ్లీ' మాత్రం ఓ మోస్తరు కలెక్షన్స్ వసూలు చేయగలిగింది. ఆ నెలలో విడుదలైన ఐదు అనువాద చిత్రాల అడ్రస్ గల్లంతైంది. ఇక 22 మూవీస్‌తో మార్చి నెల మురిసినా, జనాన్ని మురిపించలేదనే చెప్పాలి. ఈ నెలలో వచ్చిన సినిమాలలో 'మృత్యుంజయ్', సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని, బ్యాండ్ మేళం'పై దర్శక నిర్మాతలు ఆశలు పెట్టుకున్నారు. ఈ నెలలో వచ్చిన పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' పరాజయం పాలు కావడంతో అభిమానులు డీలా పడ్డారు. ఎనిమిది అనువాద చిత్రాలదీ అదే పరిస్థితి.

ఏప్రిల్‌లో 25 పిక్చర్స్ వచ్చాయి– వెళ్లాయి – విశేషం ఏమంటే ఈ నెలలో అత్యధికంగా పది అనువాద చిత్రాలు వచ్చాయి. 'రాకాస, బైకర్, తిమ్మరాజు పల్లి టీవీ, పాపం ప్రతాప్' సినిమాలు ఆడతాయని మేకర్స్ ఆశపడ్డారు. ఇందులో కొంతలో కొంత ఆడిన సినిమా 'రాకాస'. అనువాద చిత్రాలు సహా మిగిలినవన్నీ ఇంటికి వెళ్లిపోయాయి. మే నెలలో 31 చిత్రాలు బాక్సాఫీస్ బరిలో దూకి అన్నీ చతికిలపడ్డాయి. వినోదాన్ని అందిస్తాయని ఆశించిన 'గాయపడ్డ సింహం, జెట్లీ, సతీ లీలావతి' మెప్పించ లేకపోయాయి. డబ్బింగ్ సినిమా 'వీరభద్రుడు' కాస్తంత ఫర్వాలేదనిపించింది. సంఖ్యపరంగా ఈ నెలలో ఎక్కువ సినిమాలు వచ్చినా... ఫలితం మాత్రం దిగదుడుపుగానే ఉంది.

జనవరి తరువాత మళ్లీ సినిమాకు కళ తీసుకు వచ్చింది జూన్ మాసమనే చెప్పాలి. ఈ నెలలో 20 సినిమాలు వచ్చాయి. మొదటి వారంలోనే 'పెద్ది' సినిమా భారీ ఓపెనింగ్స్ తో మురిపించింది. ఈ యేడాది ఇప్పటి దాకా హయ్యెస్ట్ గ్రాసర్‌గా 'పెద్ది' నిలచింది. అయితే ఈ మూవీ నార్త్‌లోనూ, కొన్ని ఏరియాల్లోనూ, అమెరికాలోనూ నిరాశ కలిగించిందని ట్రేడ్ టాక్. ఈ ప్రథమార్ధం బేరీజు వేస్తే రూ.300 కోట్లకు పైగా కలెక్షన్స్ చూసిన చిత్రాలు రెండే రెండు – ఒకటి చిరంజీవి 'మన శంకరవరప్రసాద్ గారు', రెండోది రామ్ చరణ్ 'పెద్ది'. అలా తండ్రీ కొడుకులు బాక్సాఫీస్ వద్ద తమ ఆధిక్యం చాటుకున్నారు. సెలవులు ఇంకా ఉన్న నమయంలోనే రావడం వల్ల 'పెద్ది'కి కొన్ని కేంద్రాలలో భారీ వసూళ్లు లభించాయి. అయితే జూన్ 19వ తేదీన విడుదలైన సమంత 'మా ఇంటి బంగారం' మౌత్ టాక్‌తో ఊపందుకుంది. ఈ సినిమా నిదానంగా పంద కోట్ల క్లబ్‌లో చేరేందుకు పరుగులు తీస్తోంది. జూన్ 20న వచ్చిన 'దీవానా'కు విమర్శకుల ప్రశంసలు లభించినా... అవి కలెక్షన్ల రూపంలో రిఫ్లక్ట్ కాలేదు. అలానే జూన్ ఆఖరులో వచ్చిన ఈ చిన్న సినిమా కూడా మెప్పించలేక పోయింది. దాంతో తిరిగి కాస్తంత ఊపు తగ్గింది.

ఇక ఓవర్ ఆల్‌గా చూసుకుంటే.. జనవరిలో సంక్రాంతి సందడి వల్లే బాక్సాఫీస్ కాసింత కళకళ లాడింది. ఫిబ్రవరిలో ఉసూరుమనిపించింది మన సినిమా. వేసవికి మంచి సినిమాలు వస్తాయని ఆశించారు. ఓ వైపు అమెరికా– ఇరాన్ యుద్ధం, మరోవైపు ఐపీఎల్ మ్యాచెస్ కారణంగా సమ్మర్ సందడి ఏ మాత్రం సాగలేదు. జూలైలో 'నాగబంధం, రావు బహదూర్, లెనిన్, శ్రీనివాస మంగాపురం, చెన్నయ్ లవ్ స్టోరీ, సిగ్మా' వంటి ఆసక్తికరమైన పలు చిత్రాలు విడుదల అవుతున్నాయి. ఇవి ఏ మాత్రం ప్రేక్షకాదరణకు నోచుకున్నా... ద్వితీయార్ధంకు శుభారంభం పలికినట్టే.

– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.150/-

వెల : ₹.60/-

వెల : ₹.270/-

వెల : ₹.80/-



వెల : ₹.54/-

వెల : ₹.120



వెల : ₹.80



వెల : ₹.250/-



వెల : ₹.180/-

వెల : ₹.200/-



వెల:₹.999/- సెట్



వెల:₹.450/-



వెల :₹.699/-



వెల : ₹.400/-



వెల : ₹.145/-

పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

సాహిత్య నికేతన్ : వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 38